




www.prajapaksham.in

PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




బెగుసరాయ్‌లో కేంద్రమంత్రికి చెమటలు పట్టిస్తున్న సిపిఐ 3లో


శనివారం | 11-05-2024 | మహబూబ్‌నగర్ | సంపుటి 07, సంచిక: 160 | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00


## కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్



**న్యూఢిల్లీ:** మద్యం కుంభకోణంలో నిందితుడిగా విచారణ ఎదుర్కొంటూ, జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరైంది. జూన్ ఒకటో తేదీ వరకూ బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బెయిల్ కు షరతులు వర్తిస్తాయని, తరువాయి 2లో

## సిపిఐ హర్షం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంపై సిపిఐ హర్షం వ్యక్తం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎన్ని రకాలుగా అడ్డుకున్నప్పటికీ, సుప్రీం కోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగిన పరిణామమని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మద్యం కేసులో కేజ్రీవాల్‌పై చర్యలకు రెండు సంవత్సరాల సమయం ఎందుకు పట్టింది ఇడిని సుప్రీం కోర్టు నిదీసిన విషయాన్ని సిపిఐ ప్రస్తావించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సమయం, తీరును చూస్తుంటే, ఈ చర్య వెనుక రాజకీయ కోణం ఉందనే అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొంది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తోపాటు, బిజెపి అరెస్టు చేయించిన పలువురు ప్రతిపక్ష నాయకులకు కూడా బెయిల్ లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. బిజెపి కక్షపూరిత రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని, జూన్ 4న ఆ పార్టీకి ఇంటిదారి చూపిస్తారన్న నమ్మకం ఉందని సిపిఐ ఆ ప్రకటనలో తెలిపింది.




## కేంద్రంలో మరోసారి అధికారం మాదే

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ప్రజా పక్షం/హైదరాబాద్

దేశ వ్యాప్తంగా భారీ మెజార్టీతో బిజెపి మరోసారి గెలువబోతోందని హైదరాబాద్ ఎల్‌బి స్టేడియం వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎల్‌బి స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అక్షయ తృతీయ శుభాకాంక్షలతో ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంపై విరుచుకుపడిన మోదీ శ్రీరామ నవమి జరుపుకోవడం, రాముడిని పూజించడం దేశద్రోహమా అన్ని ప్రశ్నించారు. ఏ రాముడి ప్రేరణతో పరిపాలన సాగిస్తున్నామో దానినే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. వసుధైక కుటుంబం, బుద్ధం శరణం గచ్ఛామి అహింసో పరమోధర్మో అన్నదే భారత్ సిద్ధాంతమని ఇది వేల సంవత్సరాల ఈ దేశ అసలైన సిద్ధాంతమని తెలిపారు. ఓట్ల రాజకీయం కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు గడిచిన 70 ఏళ్లుగా హైదరాబాద్ విమోచనం దినోత్సవం పక్కనే పెడితే అదే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సెప్టెంబర్ 17 హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లను లాక్కొని, ముస్లింలకు ఇచ్చేస్తోందన్నారు. ముఖ్యంగా బిసి కోటా రిజర్వేషన్లు మతం పేరుతో ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఇదే విధానాన్ని దేశం మొత్తం అమలు చేసేందుకు కుట్రలు పన్నుతోందని ప్రధాని ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఆర్ టాక్స్ వసూళ్ల దందా నడుస్తోందని, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులను కాంగ్రెస్ ఎటిఎంగా మార్చుకుందన్నారు. హైదరాబాద్‌లో అయితే ఏకంగా ట్రిపుల్ ఆర్ టాక్స్ చెలామణిలో ఉందని ఈ భారం నగరవాసులు మోయాల్సి వస్తోందని, ఇందులో ఒకటి రజాకారు టాక్స్ ఉందన్నారు. విద్యుత్ కోతలతో రాష్ట్రం ఉక్కిరి బిక్కిరి అవుతోందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు బిజెపి ఏమి తరువాయి 2లో

మానవాభివృద్ధికి ప్రాధమ్యం కావాలిప్పుడు! 04

## నిజాయితీ గురించి మాట్లాడే మోదీకి ప్రచార ఖర్చులు ఎక్కడివి?

విరాళాలపై విచారణకు ప్రత్యేక కమిషన్

'మీట్ ది ప్రెస్'లో సిఎం రేవంత్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

రిజర్వేషన్ల రద్దు తేనే తుట్టను కదిలించినందుకే ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్‌షా తనను టార్గెట్ చేశారని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. అందుకే ఎన్నికల ప్రచారానికి వారు నిరంతరం తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారన్నారు. పొరపాటున మరోసారి బిజెపి చేతిలోనికి అధికారం పోతే, సమాజం నిట్టనిలువునా చీలుస్తుందన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తాజ్‌కృష్ణ హోటల్‌లో శుక్రవారం రేవంత్‌రెడ్డి మీట్ ది ప్రెస్ నిర్వహించారు. ఈ మీట్ ది ప్రెస్‌కు ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించగా, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. ఎన్నికలలో ఇతరుల నుండి రూపాయి తీసుకోకుండా, తమ సొంత ఆస్తులను అమ్మి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని భద్రచాలంలోని శ్రీరాముని పై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్ విసిరారు. అలా చేస్తే తాను ఎన్నికల ప్రచారం నుంచి తప్పుకుంటానన్నారు. నిత్యం నిజాయితీ గురించి మాట్లాడే ప్రధాని మోదీ ఎన్నికల ఖర్చులు, పార్టీ విరాళాలపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని మోదీని డిమాండ్ చేశారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని వందేళ్లు వెనక్కితీసుకెళ్లిన కెసిఆర్, ప్రస్తుతం తన కుటుంబం, తమ అవసరాలు, వ్యూహాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని బిజెపికి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిజెపి రాష్ట్రంలో అడుగు పెడితే మధ్యయుగం నాటి పరిస్థితులు వస్తాయని, మళ్లీ చక్రవర్తుల పాలన వస్తుందని అన్నారు. అధికారన్ని నిలుపుకునేందుకు బిజెపి ఎంతకైనా తెగిస్తుందని ఆగ్రహం తరువాయి 2లో

బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు రద్దు.. రాజ్యాంగం మార్పు... 09



## బెంగళూరులో భారీ వర్షం

**బెంగళూరు:** బెంగళూరులో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీనితో నగరంలవోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2లో లీకేజీ ఏర్పడి వర్షపు నీరు లోపలికి చేరింది. ఈదురు గాలులు, భారీ వర్షం కారణంగా పలు ఫ్లైట్స్ ను చెన్నైకి మళ్లించారు. వర్షాల వల్ల విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం (కెఎఐ) అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో ల్యాండింగ్ పరిస్థితులు క్లిష్టంగా మారాయని, దీంతో అంతర్జాతీయ విమానాలతో సహా పలు విమానాలను దారి మళ్లించక తప్పలేదని పేర్కొంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శుక్రవారం 13 దేశీయ తరువాయి 2లో



## తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోదీ చేసిందేమిటి?

రాష్ట్రానికి తెచ్చిన పెద్ద ప్రాజెక్టులేమిటో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి

రాహుల్ గాంధీకి అదాని, అంబాని డబ్బులిస్తే ప్రధాని ఏం చేస్తున్నారు?

ఎన్నికల కోడ్ కారణంగా తెలంగాణలో కొన్ని హామీలు అమలు చేయలేకపోయాం

మీడియా సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటో, తెలంగాణకు పెద్ద ప్రాజెక్టులు ఏమి తీసుకువచ్చారో ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హాయాంలో నిర్మించిన ప్రాజెక్టులే ఉన్నాయి తప్ప మోదీ కొత్త ప్రాజెక్టులేమైనా తెచ్చారా, అభివృద్ధి చేశారా అని ఆయన నిలదీశారు. మోదీ కొత్తగా తెచ్చిన ప్రాజెక్టులేమిటో చెప్పరని, అభివృద్ధి చేయరని, ప్రజలను మాత్రం మాయమాటలతో మభ్యపెడతారని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదారాబాద్‌ను బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, హైదరాబాద్, బెంగళూర్, ముంబాయికి రావాల్సిన పెట్టుబడిదారులను బెదిరించి గుజరాత్‌కు తరలించుకు వెళ్ళారు. బిజెపి నాయకులు నిరాశతో మాట్లాడుతున్నారని, తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉంటుందని, ఈ ప్రభుత్వాన్ని కదించాలని ప్రయత్ని వారే ఖతమైపోతారని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన ఖర్గే హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఎన్.ఉత్తంకుమార్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ తరువాయి 8లో

## మోదీ, షా, నడ్డాలపై చర్యలేవీ?

పోలింగ్ గణాంకాల విడుదలలో జాప్యం ఎందుకు?

ఇసిని కలిసి నిలదీసిన 'ఇండియా' నేతలు

**న్యూఢిల్లీ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, నిబంధనలను ఉల్లంఘించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డాలపై సాక్ష్యాధారాలు ఉన్నాగానీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ''ఇండియా'' కూటమి నాయకులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని శుక్రవారం నేరుగా కలిసి నిలదీశారు. పోలింగ్ శాతం విడుదల, ఎన్నికల్లో ఎంతమంది ఓటర్లు ఓటు వేశారనే కచ్చితమైన వివరాలు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యంపై కూడా వారు తమ తీవ్ర ఆందోళలను తెలియజేశారు. ఈ మేరకు ఏడు పేజీల మెమొరాండంను సమర్పించారు. జాప్యం లేకుండా ఈ వివరాలు విడుదల చేయాలని వారు కోరారు. అదేవిధంగా కేంద్రంలోని అధికారపార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ఎన్నికల నిబంధనలను పదే పదే ఉల్లంఘిస్తోందని కూడా 'ఇండియా' కూటమి నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటి, రెండు దశల్లో ఓటింగ్ చేసిన ఓటర్ల వివరాలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరిగిందని కూటమి తరువాయి 2లో

## బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం




కెసిఆర్ కారణంగానే విద్యుత్, నీటిపారుదల రంగాలపై దెబ్బ

'మీట్ ది ప్రెస్'లో మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

మోదీ మరోసారి అధికారంలోనికి వస్తే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రశ్నా ర్థకంగా మారుతుందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కెసిఆర్ వల్లనే నీటిపారుదల, విద్యుత్ రంగాలపై కోలుకోలేని దెబ్బ పడిందని,ఈ రంగాలను కెసిఆర్ సర్వనాశనం చేశారని, వింత నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్, సురవరం ప్రతాప రెడ్డి హాల్‌లో ఉత్తమ్ కుమార్‌రెడ్డితో శుక్రవారం మీట్ ది ప్రెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్‌ఎస్ ఉండదని,ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి సున్నా సీట్లు వస్తాయన్నారు. బిఆర్‌ఎస్ త్వరలోనే విఆర్‌ఎస్ తీసుకుంటుందన్నారు. ప్రధాని మోదీ రాజనీతిజ్ఞుడు తరహా వ్యవహరించడం లేదని, అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వంలోనే దేశ రక్షణ, జాతీయ భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిందని, నితావ్యసవర ధరలను ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంలోనే భారతదేశానికి చెందిన రెండువేల కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించుకున్నదని విమర్శించారు. స్వాతంత్ర్యం నాటి నుంచి ఇప్పటి వరకు పార్లమెంట్‌లో ఎక్కువ మంది ఎంపిలను సస్పెండ్ చేసి, తక్కువ సమయం పార్లమెంట్ సమావేశాలు బిజెపి ప్రభుత్వ హయాంలోనే జరిగాయని విమర్శించారు. పార్లమెంట్ సమావేశంలో కీలకమైన బిల్లులపైన కనీసం చర్చ కూడా చేయలేదని మండిపడ్డారు. ఇడి,సిబిఐ, ఆదాయ పన్ను శాఖను ప్రతిపక్ష పార్టీల నేతలరపైకి వదిలిపెట్టారని విమర్శించారు. మోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు తరువాయి 8లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ప్రజాపక్షం/ భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భద్రతా బలగాలు మావోయిస్టు లపై పైచేయి సాధించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ధృవీకరించారు. మరణించిన మావోయిస్టు మృతదేహాలు కూడా లభ్యమయ్యాయని సమాచారం. డిఆర్జి, ఎస్టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ కోబ్రా బెటాలియన్ సహా 1000 మందికి పైగా సిబ్బంది ఈ ప్రాంతాన్ని చుట్టు ముట్టారని బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో మావోయిస్టులు బాగా చిక్కుకుపోయినట్లు సమాచారం.

## మావోయిస్టులు, ఉగ్రవాదుల డేటా రికవరీపై తర్జనభర్జన

ప్రజాపక్షం/హైదరాబాద్

మాయమైన మావోయిస్టులు, ఉగ్రవాదుకు కీలక డేటా రికవరీ కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) అధికారులు తర్జనబర్జన బడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన నిందితులు ప్రతిపక్ష నేతల ఫోన్ రికార్డులతో మావోయిస్టులు, ఉగ్రవాదుల డేటాను కూడా మాయం చేసిన విషయం విధితమే. రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించడంలో ఎస్ఐబి పాత్ర అత్యంత కీలకం. వీరి వద్ద తెలంగాణలో నిషేధిత సంస్థ మావోయిస్టు పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన పుట్టుపుర్వోత్తరావు ఎస్ఐబి అధికారులకు చిటికెలో లభించేది. దీని ఆధారంగానే గ్రేహౌండ్స్ దళాలు మావోయిస్టు ప్రభావిత



ప్రాంతాలలో కూంబింగ్ నిర్వహించేవారు. వారి కదలికలపై ఒక కన్నేసి ఉంచేవారు. అవసరమైన సమయంలో కాల్పులకు కూడా తెగబడేవారు. అయితే ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతలు, దళ కమాండర్‌ల పేర్లు, వివరాలు, ఫోటోలు ఎస్ఐబి వద్ద లేవు. వీటిని తిరిగి ఎలా సేకరించాలనే ఆలోచనలో ఎస్ఐబి అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గతంలో మావోయిస్టులు, ఉగ్రవాదుల డేటా సేకరించడంలో విధులు నిర్వహించి పదవీ వివరమణ పొందిన కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎస్ఐబి అధికారుల సహాయసహకారాలాను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న ఐబి సంస్థ అధికారుల నుంచి మావోయిస్టులు, ఉగ్రవాదుల డేటా సేకరించాలని ఎస్ఐబి అధికారులు దృష్టి సారించారు.తెలుస్తుంది.తెలంగాణలోని అన్ని జిల్లా అధికారుల నుంచి తిరిగి డేటా సేకరించే విధంగా చర్యలు తరువాయి 8లో



## ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు శుక్రవారం వారి వారి స్టేషన్‌ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డిజిపి రవిగుప్తా ఆదేశాల మేరకు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లతో పాటు రాష్ట్రంలోని ఇతర పోలీసు కమిషనరేట్ల కమిషనర్లు, జిల్లాల ఎస్‌పిలు స్పందించారు. ఈ మేరకు ఆయా స్టేషన్‌ల పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ టీం, సిఆర్‌పిఎఫ్ బలగాలతో ఉదయం 10 గంటల నుంచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మార్కెట్ ఏరియాలు, రద్దీ ప్రాంతాలలో ఈ ఫ్లాగ్ మార్చ్ తరువాయి 2లో

## బహుళధృవ ప్రపంచమే చైనా లక్ష్యం

### జిన్‌పింగ్ ఐదు రోజుల యూరప్ పర్యటన పూర్తి



**బీజింగ్ :** చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఐదురోజులపాటు యూరప్‌లో చేసిన పర్యటన శుక్రవారంనాటితో ముగిసింది. జిన్‌పింగ్ పర్యటన విజయవంతంగా ముగిసిందని బీజింగ్ ప్రకటించింది. ఫ్రాన్స్, సెర్బియా, హంగరీ దేశాలలో ఆయన పర్యటించారు. ఈ మూడు దేశాలతో ఉన్న గాఢమైన దౌత్య సంబంధాలు పటిష్టం చేసుకోవడంలో భాగంగా వాణిజ్యపరమైన విస్తరణ చర్యలు, పరస్పర సహకారం పెంపొందించుకోవడానికి ఈ పర్యటన జరిగింది. ఇదే సమయంలో జిన్‌పింగ్ ఉక్రేన్‌యుద్ధం, పశ్చిమాసియాలో సమస్యల గురించి కూడా ఈ దేశాల నాయకులతో తన అభిప్రాయాలు పంచుకున్నారు. యుద్ధం విస్తరిస్తున్న ప్రపంచంలో బహుళధృవ ప్రపంచమే చైనా లక్ష్యమని ఆయన ఈసందర్భంగా చెప్పారు. ఫ్రాన్స్ పర్యటనలో జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా టిబెటన్లు నిరసన ప్రదర్శనలు చేయగా, సెర్బియాలో వేలాదిమంది ప్రజలు జిన్‌పింగ్‌కు "చైనా...చైనా..." అని నినాదాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. గురువారంనాడు సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ జిన్‌పింగ్‌కు మరపురాని ఘన స్వాగతం పలికారు. గురువారంనాడు హంగరీ అధ్యక్షుడు థామస్ ఉసుక్, ప్రధానమంత్రి విక్టర్ ఆర్బాన్ జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం పలికారు. 15 ఏళ్ళక్రితం చైనా అధ్యక్షుడు హంగరీలో పర్యటించాక మళ్ళీ ఇదే మొదటిసారి. ఇరు దేశాల ద్వైపాక్షి సంబంధాల పటిష్టత, ఇంధన సమస్య పరిష్కార చర్యలను చర్చించారు. చైనా–హంగరీ ద్వైపాక్షిక సంబంధాలు 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా జిన్‌పింగ్ ఈ పర్యటన చేశారు.

## పాకిస్థాన్‌లో ఆగని ఉగ్రవాదుల దాడులు

### స్కూలు భవనాలు కూల్చివేత, వర్కర్లు కాల్చివేత

**గదర్ :** పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల దడులు తగ్గుముఖం పట్టడంలేదు. ఉగ్రవాదుల దాడులు గతంకంటే తీవ్రస్థాయిలో పెరిగాయి. శుక్రవారంనాడు తాజాగా ఉగ్రవాదులు స్కూలు భవనం కూల్చివేశారు. ఉత్తర వజీరిస్థాన్‌లోని రెండు బాలికల పాఠశాలలను బాంబులతో పేల్చివేశారు. శుక్రవారం తెల్లవారుజాములోపే ఉగ్రవాదులలు ఈ అకృత్యానికి పాల్పడ్డారు. నూర్ జన్నత్,యూనుస్ కోట్‌లలో ఉన్న రరెండు బాలికల పాఠశాలను కూల్చివేశారు. అంతకుముందు గురువారంనాడు కూడా బలూచిస్థాన్ తీరప్రాంత నగరం గదర్‌లో తెల్లవారుజామున ఉగ్రవాదులు ఏడుగురు సెలూన్ వర్కర్లను కాల్చి చంపారు. ఈ ఘటనలో మరొకరు గాయపడ్డారు. గదర్ శివారు ప్రాంతంలోని ఇంట్లో వారు నిద్రిస్తుండగా ఆగంతకుడు లోపలికి వెళ్లి వారిపై కాల్పులు జరిపాడు. గదర్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ జోహైబ్ మొహసిమ్ ఈ విషయం చెప్పారు. గదర్‌కు 25 కి.మీ దూరంలో ఉన్న శివారు ప్రాంతంలోని ఒక సెలూన్‌లో వీరంతా పనిచేస్తున్నారని, తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందనీ చెప్పారు.వీరంతా పంజాబ్ రాష్ట్రం ఖనేవాల్, లోధ్రా ప్రాంతాలకు చెందినవారు. వీరంతా పంజాబీలేననీ, అందుకే వారిపై దాడి జరిగిందనీ ఆయన చెప్పారు. కాగా ఈ ఘటనను పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మిర్ సర్ఫరాజ్ బుగ్తీ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులను వదిలిపెట్టేదిలేదని అన్నారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోమనీ, దేశం నుండి ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేస్తామని షెహబాజ్ షరీఫ్ అన్నారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించారు. ఇటీవల బలూచిస్థాన్‌లో ఉగ్రవాదుల దాడులు అనూహ్యంగా పెరిగాయి. గతనెలలో 77 సార్లు పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు దాడులు చేశారు.

# రఫాపై డ్రోన్లు, ఎఫ్–16లతో ఇజ్రాయిల్ దాడి

### 1.10 లక్షల మంది తలోదిక్కుకీ పరుగులు

### ఒంటరి పోరుకు సిద్ధం : నేతన్యాహూ ప్రకటన





**టెల్‌అవీవ్ :** రఫాపై ఇజ్రాయిల్ విరుచుకుపడింది. డ్రోన్లు, ఎఫ్–16లతో దాడులు చేస్తున్నది ఇజ్రాయిల్ గడచిన సోమవారం నుండీ ఇజ్రాయిల్ రఫా బోర్డర్‌క్రాసింగ్‌ను మూసివేసి హెచ్చరికలుచేయడంతో ఐదు రోజులుగా 1,10,000 మందికి పైగా ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తూర్పు రఫా నుండి గుడారాలు ఖాళీ చేసి అటూ ఇటూ పారిపోయారని ఐక్యరాజ్యసమితి రిలీఫ్–వర్క్స్ ఏజన్సీ (యుఎన్‌డబ్ల్యు) ప్రకటించింది. గాజాలలోకి సహాయం పంపడానికి రఫా బోర్డర్‌క్రాసింగ్ మాత్రమమే అత్యంత సురక్షితమైనదని, ఇతర మార్గాలు సురక్షితం కాదనీ సహాయ సంస్థలు చెబుతున్నాయి. కానీ ఈ ప్రధాన ప్రాంతాన్నే ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకుని మూసివేయడంతో గాజాలో దాదాపు కరువు పరిస్థితులు వచ్చా యి. ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్యపై అనేక దేశాలు దృష్టిపెట్టి దౌత్య ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ మార్చినెలలో అంతర్జాతీయ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ఉల్లంఘించి కనీస జవాబుదారీ కూడా వహిచడంలేదు. ఈ నేపథ్యంలో, ఐక్య రాజ్యసమితి సహా ప్రపంచ దేశాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినప్పటికీ రఫాపై దాదాపు యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నేతన్యాహూ తాము ఒంటరి పోరుకు సిద్ధంగా ఉన్నామని శుక్రవారం ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రేన్ తప్పులను వెనకేసుకొస్తూ ఉండటంతో ఇరకాటంలో పడ్డారు. దాంతో ఆయన నేతన్యాహూకు తాత్కాలిక దూరం పాటిస్తూ బాహాటంగా ప్రకటనలు చేస్తున్న తరుణంలో, ఇజ్రాయిల్ ఎవరి సహాయం లేకపోయినా హమాస్‌ను సమూలంగా నాశనం చేసేందుకు ఒంటరి పోరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని నేతన్యాహూ ప్రకటించారు. బైడెన్‌తో వచ్చిన ప్రతికూల పరిస్థితులను తాము దిద్దుబాటు చేసుకోగలమన్న ధీమా ఆయన వ్యక్తం చేశారు.

## చైనా విద్యార్థులకు ఇక సైనికశిక్షణ తప్పనిసరి

**బీజింగ్ :** చైనాలో విద్యార్థులకు ఇకమీదట అన్నిస్థాయిల్లో సైనిక శిక్షణ తప్పనిసరి చేశారు. ఈ మేరకు కొత్త చట్టాన్ని సంస్కరిస్తున్నది. ఈ మేరకు విద్యార్థులు తప్పనిసరిగా ప్రాథమికస్థాయి మొదలు మిడిల్ స్కూల్, హైస్కూల్, యూనివర్సిటీ స్థాయి వరకూ తప్పనిసరిగా సైనిక శిక్షణ పొందవలసి ఉంటుంది. నేషనల్ డిఫెన్స్ లాను మార్పులు చేర్పులతో చైనా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరిస్తున్నది. ఇప్పటికే చైనాలోని అనేక విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు ఆయుధాలు ఎలా ఉపయోగించాలి? తుపాకీని, లేదా యుద్ధ ట్యాంక్‌ను ఎలా లోడ్ చేయాలి? వాటి పనివిధానం ఏమిటి? లక్ష్యాలు ఏమిటి? వంటి విషయాలపై థియరీ, ప్రాక్టికల్ అంశాలను ప్రవేశపెట్టారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్, రోబోటిక్స్, అంతరిక్షం వంటి సాంకేతికపరమైన, సున్నితమైన అంశాలను యూనివర్సిటీస్థాయిలో మిళితం చేసి సంబంధిత విజ్ఞాన అంశాలను వృద్ధి చేసేందుకు వెసులుబాటు కల్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసేందుకు ఈ కొత్త చట్టం దోహద పడనున్నది.

# అర్జంటైనా ప్రభుత్వంపై తిరగబడిన కార్మికులు

### సమ్మెతో స్తంభించిన కార్యకలాపాలు



**బ్యూనోస్‌ఐర్స్ :** దక్షిణ అమెరికా దేశం అర్జంటైనాలో కార్మికులు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం పొదుపు చర్యలు పాటించడం ప్రారంభించింది. కార్మికులను పణంగా పెట్టి పొదుపు చర్యలు పాటించడంతో వారు మరిన్ని సమస్యల్లో పడ్డారు. దాంతో వారు దేశవ్యాప్తంగా సమ్మె ప్రారంభించారు. కోత పెట్టిన నిధులను సబ్సిడీలుగా, సామాజిక కార్యక్రమాల అమలుకు ఖర్చుపెట్టాలని వారు కోరుతున్నారు. అధ్యక్షుడు జేవియర్ మిలెయ్ ప్రణాళికాబద్ధంగా సంస్కరణలు చేపట్టినట్లు ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైల్వే, రోడ్ రవాణావ్యవస్థ, సూపర్ మార్కెట్లు , క్రూయిజింగ్ సెక్టర్, విమానాలు, ఎయిర్‌పోర్టులు, బ్యాంకింగ్ రంగంసహా సమస్త కార్యకలాపాలు దేశంలో స్తంభించిపోయాయి. గత ఏడాది ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు మిలెయ్ మితవాద ఆర్థికవేత్త, మీడియా పండితుడు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం మూడంకెలస్థాయికి చేరి ప్రజలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దేశాన్ని గాడిలో పెడతానని శపథం చేసిన అధ్యక్షుడు కార్మికుల జీవితాలను మరింత ఇరకాటంలో పెడుతూ ఉండటంతో దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఊహించని రీతిలో అత్యంత కఠినమైన పొదుపు చర్యలు మిలెయ్ పాటించడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. ప్రజల జీవనం మరింత దుర్భరంగా మారింది. దేశంలో అతిపెద్ద సిటిఏ యూనియన్ సెక్రటరీ జనరల్ హ్యూగో యాస్కీ మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం ధనవంతులకే దేశాన్ని, దేశ వనరులను దోచిపెడుతున్నదనీ, కార్మికుల హక్కులను ప్రభుత్వం తిరస్కరిస్తున్నదని విమర్శించారు. ఈ తరుణంలో తిరగబడి ప్రభుత్వాన్ని నిలదీయడంతప్ప తమకు మరో మార్గం లేదని అన్నారు. వివాదాస్పదమైన కార్మిక సంస్కరణల అమలుకు దిగువసభలో ఆమోదం పొంది ఎగువసభకు అధ్యక్షుడు వెళుతున్న తరుణంలో మొదలైన సమ్మెతో దేశంలో ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు స్తంభించాయి. సమ్మె కొనసాగుతుందని వివిధ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. 'లార్డ్ ఆఫ్ రింగ్స్ చిత్రం నటుడు విగ్గో మోర్టెన్‌సన్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధ్యక్షుడు మిలెయ్ ఒక జోకరుగా మారారనీ, ఆయన చేతిలో ఆర్థిక వ్యవస్థ నాశనం అవుతోందనీ విమర్శించారు. ప్రభుత్వ వర్గాలు దీనిపై స్పందిస్తూ ఈ సమ్మె పూర్తిగా రాజకీయమని కొట్టిపారేశాయి.

## బఫర్ జోన్‌కు రష్యా యత్నం : ఉక్రేన్‌పై దాడి

**కీవ్ :** ఈశాన్య ఖార్కీవ్ ప్రాంతంలో రష్యా భూతల దాడులు ప్రారంభించిందని ఉక్రేన్ శుక్రవారంనాడు ప్రకటించింది. ఆ దాడులు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొంది. బఫర్ జోన్ సృష్టించేందుకు రష్యా ప్రయత్నం చేస్తోందనీ, వోవ్‌ఛాన్స్క్ పట్టణంలోకి కిలోమీటరున్న లోపలికి రష్యా వాహనాలు దూసుకువచ్చాయని, వారిని అడ్డుకుంటున్నామనీ, యుద్ధం కొనసాగుతోందనీ ఉక్రేన్ తన తాజా ప్రకటనలో పేర్కొంది. రష్యా దాడులను తిరగ్గొడుతున్నామని, వారి యత్నాలు విఫలమయ్యాయని కూడా ఉక్రేన్ రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. బెల్గరోడ్ సహా ఉక్రేన్‌తో రష్యాకు ఉన్న ఇతర సరిహద్దు ప్రాంతాలలో బఫర్ జోన్ సృష్టిసామని ఇటీవల పుతిన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ దాడులు మొదలయ్యాయి. ఉక్రేన్ తరచు తమ భూభాగాలపై దాడులు చేస్తున్నదనీ, ఈ దాడులను అడ్డుకునేందుకు ఒక ఏర్పాటు చేయాల్సి ఉందనీ రష్యా రక్షణశాఖ చెబుతున్నది.



**ఉక్రేన్ భద్రతా విభాగాధిపతిపై వేటు**

ఉక్రేన్ భద్రతావిభాగాధిపతి (స్టేట్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్) సెర్హీ రడ్‌పై దేశాధ్యక్షుడు జెలెన్స్కీ వేటు వేశారు. జెలెన్స్కీపై రష్యా చేసిన హత్యాయత్నాన్ని భగ్నం చేసినట్లు ఉక్రేన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఈనెల ఏడవ తేదీన ప్రకటన చేసిన తర్వాత కూడా తన వ్యక్తిగత భద్రతా విభాగాధిపతిని ఎందుకు జెలెన్స్కీ పదవి నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్న విషయంపై ఆ ప్రభుత్వం వివరణ ఇవ్వలేదు. రష్యన్ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎఫ్‌ఎస్‌బి) ఏజంట్లు జెలెన్స్కీ, ఇతర అధికారుల హత్యకు యత్నించారని యుసిసి ప్రకటించింది.

## రష్యా ప్రధానమంత్రిగా మళ్ళీ మిషస్టిన్



**మాస్కో :** రష్యా ప్రధానమంత్రిగా మైఖేల్ మిషస్టిన్ (58) తిరిగి నియమితులయ్యారు. అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ శుక్రవారంనాడు ఆయనను తిరిగి ఆ పదవిలో నియమించారు. ఈ మేరకు రష్యా పార్లమెంటుకుసమాచారం తెలియజేశారు. పార్లమెంటు ఈ విషయం చర్చించి ఆయన నియామకాన్ని ఖరారు చేస్తూ ఒక తీర్మానం చేస్తుందని పార్లమెంటు స్పీకర్ వ్యాచస్లోవ్ వోలోడిన్ చెప్పారు. వీలైతే శుక్రవారంనాడే దిగువసభ ఆయన నియామకాన్ని ఆమోదిస్తుంది. నాలుగు సంవత్సరాలపాటు ఆయన ప్రధానమంత్రిగా పనిచేశారు. ఐతే పుతిన్ మూడు రోజులక్రితం దేశాధ్యక్షుడుగా ఐదోసారి లాంఛనంగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంతో మిషస్టిన్ తన రాజీనామాను మంత్రివర్గానికి సమర్పించారు. పరిపాలనావ్యవస్థ సజావుగా, సక్రంగా నిర్వహించడానికి తిరిగి మిషస్టిన్‌నే ప్రధానిగా నియమిస్తున్నట్లు పుతిన్ ప్రకటించారు. 2020 జనవరిలో ద్మీత్రీ మెద్వెదేవ్ స్థానంలో మిషస్టిన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## 48 గంటల్లోగా వివరణ ఇవ్వండి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికల కమీషన్ నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివరణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్‌కు సిఇఒ వికాస్ రాజ్ నోటీసులు జారీ చేశారు. కెసిఆర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి దూషిస్తున్నారని, అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని బిఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న సిఎంపై చర్యలు తీసుకోవాలని కోరింది. బిఆర్‌ఎస్ పార్టీ ఫిర్యాదు ఆధారంగా వివరణ కోరిన సిఇఒ వికాస్ రాజ్ 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని కోరారు. బిఆర్‌ఎస్ ఫిర్యాదును సిఈఓ కార్యాలయం ఈ మేరకు పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్‌కు పంపింది. ఫిర్యాదులోని అంశాలపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిర్ణీత గడువులోగా వివరణ రాకపోతే ఏమీ చెప్పేది లేదని భావించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని సిఈఓ వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

## బెంగళూరులో భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

విమానాలు, మూడు అంతర్జాతీయ ప్యాసింజర్ విమానాలు, ఒక అంతర్జాతీయ కార్గో విమానాన్ని చెన్నైకి మళ్లించినట్టు అధికారులు వివరించారు. ఇలావుంటే, బెంగళూరులో వరుసగా నాలుగో రోజు కూడా వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. శుక్రవారం ఉదయం నాటికి, 24 గంటల వ్యవధిలో, బెంగళూరులో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఈ సమయంలో నగరంలో గరిష్టంగా 33 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 22 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది. ఇలావుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో, మరో రెండుమూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి ఒక ప్రకటనలో తెలిపింది.

## అధికారం మాదే

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదని కాంగ్రెస్ నేతలంటున్నారని అయితే తెలంగాణకు ట్రైబల్ విశ్వవిద్యాలయం, ఎన్‌టిపిసి విద్యుత్ కేంద్రం విస్తరణ, రామగుండం ఎరువుల కర్మాగారం, పసుపు బోర్డుతో పాటు 4 వందే భారత్ రైళ్లను ఎవరు ఇచ్చారో చెప్పాలన్నారు. 5 ఏళ్లలో హైదరాబాద్‌లో కేంద్రంగా అనేక ప్రాజెక్టులను తెలంగాణలో నెలకొల్ప బోతున్నామన్నారు. సబ్‌కా సాత్ , సబ్‌కా వికాస్ అనేదే బిజెపి నినాదమని, అధికారంలో ఉన్న ఈ 10 ఏళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని , తాము మత పరమైన రిజర్వేషన్లకు పూర్తి వ్యతిరేకమని చెప్పారు. తెలంగాణలో బిఆర్‌ఎస్‌కు ఓటు వేసినా కాంగ్రెస్‌కు మేలు జరుగుతుంది. కాంగ్రెస్‌కు ఓటు వేసినా కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, అందుకే బిజెపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**ప్రధాని మోదీ సభా వేదిక మీదకు రాజాసింగుకు నో ఎంట్రీ**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి ఘోరా అవమానం జరిగింది. ఆయన నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎల్‌బి స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల సభ వేదికపైకి రాజాసింగ్‌ను పోలీసులు అనుమతించలేదు.. వేదికపై కూర్చోవాల్సిన జాబితాలో తన పేరు లేకపోవడంతోనే పోలీసులు తనను అనుమతించలేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రాజాసింగ్ నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా వచ్చిన కారణంగానే అనుమతించలేదని పోలీసులు తెలిపారు. తనను వేదికపైకి అనుమతించాలని చాలా సేపు పోలీసులను వేడుకున్నా వారు పట్టించుకోకపోవడంతో చేసేది లేక రాజాసింగ్ కార్యకర్తల మధ్యలో కూర్చుని మోదీ సభను వీక్షించారు.

# వడ్డెర సామాజికవర్గం సంపూర్ణ మద్దతు కాంగ్రెస్‌కే

### అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 13 న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో 29 రాష్ట్రంల్లో వడ్డెర్లు లక్షల సంఖ్యలో ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మంది వడ్డెర్లు ఉన్నారన్నారు. కాని గత కెసిఆర్ ప్రభుత్వం తమ జనాభాను కేవలం 2 లక్షలుగా గుర్తించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాళ్ళు కొట్టి, భావన నిర్మాణం, మట్టి పని చేస్తూ జీవనం కొనసాగిస్తూ వడ్డెర్లు విద్య, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని, ఎస్‌టిల్లో చేర్చకుండా వడ్డెర్లని బిసి (ఎ) లో చేర్చడం వల్ల అన్నివిధాలా నష్టపోతున్నారన్నారు. ఈ విషయం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలసి విన్నవించగా ఎస్‌టి జాబితాలో తప్పకుండ చేర్చి, వడ్డెరల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ , జాతీయ ఉపాధ్యక్షులు కుంచాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షులు రేపని గిరి బాబు, కార్మిక విభాగం అధ్యక్షులు ఎస్.గోపాల్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వి. తిరుమలా దేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార ఖర్చులు ఎక్కడివి?

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు అభివృద్ధి, సంక్షేమం కోసం కాదని, రాజ్యాంగాన్ని రద్దు చే స్తారా?అనే ప్రతిపాదికన ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ, ఎన్నికల సమయంలో తనచుట్టూ అవినీతిపరులను పెట్టుకుని అవినీతి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 2021లో జనాభా లెక్కలు జరగలేదని, బిజెపి జనాభా లెక్కించడం లేదని, ఇందుకు కారణాలు ఏమిటని ప్రశ్నించారు. బిసి జనాభాను లెక్కించడాన్ని మోదీ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు.

**బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి జరగలేదు**

బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి జరగలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మెజార్టీ స్థానాలతో బిజెపి అధికారంలోనికి వచ్చినా అక్కడ పెట్టుబడులు రావడం లేదన్నారు. బిజెపి వ్యవహారమే ఇందుకు నిదర్శనమన్నారు. దేశం ఏమైనాప్పటికీ తాము అధికారంలోనికి రావాలన్నదే మోదీ విధానమని మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్‌పై విష ప్రచారం చేస్తోందన్నారు. శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుందని, బిజెపి మరోసారి అధికారంలోనికి వస్తే తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, జనాభా ప్రతిపాదికన పునర్విభజన జరిగితే అన్యాయం జరుగుతుందని వివరించారు. మోదీని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయని, ప్రజలు విహార యాత్రలకు వెళ్తే మన మనుగడకే ప్రమాదమని, అందుకే అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రేవంత్ రెడ్డి కోరారు. ఈ మీట్ ది ప్రెస్‌లో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు , ప్రధాన కార్యదర్శి రవికాంత్ రెడ్డి, సిఎం సిపిఆర్‌ఓ బోరెడ్డి అయోధ్య రెడ్డి హాజరయ్యారు.

**రాష్ట్రంలో ద్విముఖ పోటీ**

రాష్ట్రంలో త్రిముఖ పోటీ కనిపిస్తున్నప్పటికీ పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్, బిజెపి మధ్య పోటీ మాత్రమే ఉంటుందని, బిఆర్‌ఎస్ 6 స్థానాల్లో డిపాజిట్ కొల్పోనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇండియా కూటమి వస్తే ఐదు మంది ప్రధానమంత్రులు ఉంటారని చెబుతున్నారని, ఇప్పటీ వరకు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటీ వరకు ఎంతమంది ముఖ్యమంత్రులను మార్చిందని ప్రశ్నించారు. మన్మోహన్ సింగ్ పదేళ్లు ప్రధానిగా పనిచేశారని గుర్తు చేశారు. గుజరాత్, మధ్య ప్రదేశ్‌లో బిజెపి ఎంతమందిని మార్చిందో అందిరికీ తెలిసిందేనన్నారు. బిజెపి ప్రతి అంశంలో రాజకీయంగా లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని,వెనుకబడిన రాష్ట్రాలకు పూర్తి వివక్ష చూపుతూ, కేవలం ధనిక రాష్ట్రాలకు మాత్రమే మోదీ ప్రభుత్వం సహాయం అందిస్తుందని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న సీట్ల ఆధారంగా ధామాషా ప్రకారం పునర్విభజన జరిగితే దాక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని,జనాభా ప్రతిపాదికన పునర్విభజన జరిగితే అన్యాయం జరుగుతుందని తెలిపారు. దీనిని తాము అడ్డుకుంటామన్నారు.

# మధ్యంతర బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 2న మళ్లీ ఆయన జైలుకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంతకుముందు ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం కేజ్రీవాల్ బెయిల్ పటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేతగా ఉన్న కేజ్రీవాల్ కు ఎన్నికల్లో ప్రచారం చేసే అవకాశం కల్పించడానికి కోర్టు అవకాశం కల్పించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వాదించింది. ఎన్నికల ప్రచారం రాజ్యాంగ హక్కు కాదని పేర్కొంది. ఢిల్లీలో మే 25వ తేదీన ఎన్నికలు జరగనున్నందున, ఎన్నికల ప్రచారంలో తన అవసరం ఉందని కేజ్రీవాల్ చేసుకున్న విజ్ఞప్తిని ఇడి తప్పుపట్టింది. ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన దాఖలాలు గతంలో లేవని ఇడి పేర్కొంది. అయితే, ఇడి వాదనతో ఏకీభవించని సుప్రీం కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, జూన్ 2వ తేదీన ఆయన తిరిగి లొంగిపోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఆయనకు 21 రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వడం వల్ల నష్టమేమీ ఉండదని అభిప్రాయపడింది. అయితే, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కేజ్రీవాల్ ఎలాంటి అధికారిక విధులు నిర్వర్తించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ షరతును కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తొలుత వ్యతిరేకించినప్పటికీ, ఆ తర్వాత అంగీకరించారు. శుక్రవారం సాయంత్రం జైలు నుంచి బయటకు వచ్చారు. కాగా, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో కేజ్రీవాల్ జైల్లోనే ఉంటారు. కాగా, మధ్యంతర బెయిల్‌కు సంబంధించిన వివరణాత్మక ఉత్తర్వులను సుప్రీం కోర్టు అప్‌లోడ్ చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఇడి మార్చి 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు 45 రోజులుగా కేజ్రీవాల్ తీహార్ జైలులోనే ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి రూ. 100 కోట్ల మేర అవినీతి సొమ్ము అందిందని, ఆ డబ్బును గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారని ఇడి తన చార్జిషీట్‌లో పేర్కొంది.

## తెలంగాణకు ఏమిచ్చిందని బిజెపికి ఓటేయాలి

### కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణకు బిజెపి ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, తెలంగాణ ప్రజలు బిజెపికి ఎందుకు ఓటేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశ్నించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు ప్రజల కోసం జరుగుతున్నాయని, ఈ పదేండ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏమిచ్చిందో ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా మోదీ ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి గర్వపడుతున్నానని, మ్యానిఫెస్టోలో అన్నివర్గాల ప్రజల అంశాలను చేర్చామన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన శశిథరూర్ శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో మెజారిటీ నాయకులు హిందువులేనని, హిందువులం హిందువులను ఎందుకు ద్వేషిస్తామని, ద్వేషం అనేది కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉండనే ఉండదని, ద్వేషం అనే బజార్‌లో ప్రేమ దుకాణం తెరిచామన్నదే కాంగ్రెస్ నినాదమని శశిధరూర్ స్పష్టం చేశారు. జిహాద్ అంటే కత్తులు పట్టుకుని జనాలను చంపడం కాదన్నారు. ప్రధాని మోదీ చెప్పిన వాగ్దానాలు నేరవేర్చనందునే విద్వేషం పెంచే మాటలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలను విడగొట్టడానికి బిజెపి చాలాసార్లు మీడియాను వాడుకుందన్నారు. జాతీయ ఐక్యత చాటడానికే రాహుల్ గాంధీ సౌత్, నార్త్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారన్నారు. రామమందిరాన్ని ఎన్నికల కోసం వాడుతున్న విధానాన్నే కాంగ్రెస్ తప్పు పట్టామని, దేవుడిని రాజకీయం కోసం వాడుతున్నందుకే మేం ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్ళలేదని ఆయన స్పష్టం చేశారు. కేజ్రీవాల్ కి బెయిల్ ఇప్పటికైనా వచ్చినందుకు సంతోషమని, రాజకీయ కక్షతోనే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసారని శశిధరూర్ అన్నారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. తద్వారా ఓటు హక్కు వినియోగించునే ఓటర్లకు భరోసా ఇవ్వడంతో పాటు అసాంఘీక శక్తులకు హెచ్చరించినట్లయ్యింది. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ఈ ఫ్లోగ్ మార్చ్ నిర్వహించినట్లు డిజిపి రవిగుప్తా పేర్కొన్నారు.

## చర్యలేవీ? (మొదటి పేజీ తరువాయి)

నాయకులు ఇసికి తెలిజేశారు. ఈ మేరకు చెప్పదలచుకున్న సమస్యలన్నింటినీ ఎన్నికల సంఘం అధికారులకు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లిఖితపూర్వకంగా తెలియజేశారు. అధికారపార్టీలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన నాయకులను తప్పు పడుతూ, తప్పు చేసిన వ్యక్తులను శిక్షించేవిధంగా అర్థవంతమైన చర్యలు కూడా తీసుకోలేదని నిరసన తెలియజేశారు. ఖర్గేతోపాటు సిపిఐ నాయకుడు బినోయ్ విశ్వం, కాంగ్రెస్ నాయకులు అభిషేక్ మను సింఘ్వి, సల్మాన్ ఖుర్షీద్, టిఎంసి నాయకులు డెరెక్ ఓ బ్రెయిన్, డిఎంకె నాయకుడు టి.ఆర్.బాలు, జెఎంఎం నాయకులు మహువా మఝి,అలీ తదితరులు ఇసిని కలిసిన ప్రతినిధిబృందంలో ఉన్నారు. గతంలో ఏనాడూలేని రీతిలో అధికారపార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు పాల్పడిందనీ, వారిపై చర్యలు తీసుకోలేదనీ మెమొరాండంలో ప్రశ్నించారు. గతంలో ఏనాడూ ఇలా జరగలేదనీ, అత్యున్నతమైన రాజ్యాంగాధికారాలను చెలాయించే వ్యక్తులే ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఫిర్యాదులో 'ఇండియా' కూటమి నాయకులు స్పష్టం చేశారు. సాక్ష్యాలు డాక్యుమెంట్ల రూపంలో ఉన్నాగానీ, ఎన్నికల సంఘం ముందు ఈ వివరాల జాబితాలు పెట్టినాగానీ అర్థవంతమైన చర్యలు సంబంధిత వ్యక్తులపై తీసుకోలేదని, శిక్షలు వేయలేదనీ మెమొరాండంలో ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ నాయకులు మీడియాకు ఈ వివరాలు తెలియజేశారు.




| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## 'థర్డ్ పార్టీ' ప్రచారకులు..



ఈ మధ్యకాలంలో చాలా పార్టీలు 'థర్డ్ పార్టీ' ప్రచారకులపై ఆధారపడుతున్నాయి. పార్టీయేతర ప్రచారకులను 'థర్డ్ పార్టీ' ప్రచారకులుగా పేర్కోవచ్చు. అంటే, వారికి పార్టీతో ఎలాంటి సంబంధం ఉండదు. పార్ట్‌టైమ్ ఉద్యోగుల మాదిరిగానే, ఎన్నికల సమయాల్లోనే వీరు రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలు, ప్రచారాల్లో కనిపిస్తారు. ఆ తర్వాత అంతరార్ధమవుతారు. ఒకప్పుడు పార్టీ లేదా నాయకులమీద ఉన్న అభిమానంతో ప్రజలు పెద్ద సంఖ్యలో సభలకు హాజరయ్యేవారు. కానీ, ఇప్పుడు ఆదో ఒక ఆశచూపి, ప్రజలను రప్పిస్తున్నారన్నది అందరికీ తెలిసిన రహస్యం. చివరికి నాయకులు సైతం 'జన సమీకరణ'కు పెద్దఎత్తున ప్రయత్నిస్తున్నామని, సభ విజయవంతమవుతుందని చెప్పుకొస్తున్నారు. ప్రజలు వారంతటవారుగా అంటే స్వచ్ఛందంగా రావాలే తప్ప 'సమీకరణ' ఏమిటి? సభలు, సమావేశాలకు డబ్బులిచ్చి జనాలను తీసుకెళుతున్న చందంగానే, ప్రచారాలకు ఏదో ఒకరంగంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, ప్రజల్లో ఇంతోఅంతో ఆదరణ ఉన్న వారిని పిలిపిస్తున్నారు. భారత ఎన్నికల చట్టాల్లో 'థర్డ్ పార్టీ ప్రచారకులు' అనే పదం ఏదీ లేదు. అందుకే, 'థర్డ్ పార్టీ' ప్రచార సారథులు చట్టబద్ధమా లేక చట్ట విరుద్ధమా? అనే ప్రశ్న ఉదయించదు. కానీ, అధినాయకత్వం అనుసరిస్తున్న ఈ విధానంతో, చాలా పార్టీల్లో ద్వితీయ శ్రేణి నాయకులతోపాటు, పార్టీ శ్రేణులు కూడా నిరాశకు గురికావడం నిజం.

## ఓటరు ఐడి కార్డులో చిరునామాను ఇలా మార్చుకోండి

ఓటరు ఐడి కార్డులో చిరునామా మార్చుకోవడంపై చాలా మందిలో సందేహాలు ఉండవచ్చు. మకాం మార్చినప్పుడు, ఒటర్ ఐడి అనేది అధికారిక పత్రం కాబట్టి, అందులో చిరునామాను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ మార్పును ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. ముందుగా, అధికారిక జాతీయ ఓటర్ల సేవల పోర్టల్ (national voters service portal)ను తెరవాలి. ప్రధాన పేజీలో 'నివాసం మార్చడం/ ఎగ్జిస్టింగ్ ఎలక్టోరల్ రోల్‌లో ఎంట్రీల సవరణను ఎంపిక చేసుకోవాలి. 'ఫామ్ 8' ఎంపికపై క్లిక్ చేసి, అవసరమైన వివరాలను నమోదు చేయగల కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో 'సెల్ఫ్' ఆప్షన్‌ను ఎంపికను ఎంచుకుని, ఆపై 'సమర్పించు'పై క్లిక్ చేయాలి. 'షిఫ్టింగ్ ఆఫ్ రెసిడెన్స్' ఎంపికను ఎంచుకొని, అనంతరం 'అసెంబ్లీ నియోజకవర్గం లోపల' లేదా 'అసెంబ్లీ నియోజకవర్గం వెలుపల' ఆప్షన్లలో ఒకదానిని సెలెక్ట్ చేసుకోని 'సరే' క్లిక్ చేయాలి. అనంతరం మీ 'రాష్ట్రం, జిల్లా, అసెంబ్లీ/ పార్లమెంటరీ నియోజకవర్గం' వివరాలను ఎంచుకొని, 'తదుపరి' క్లిక్ చేయండి. మీ ఆధార్ నంబర్, ఇమెయిల్, మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, 'తదుపరి' క్లిక్ చేయండి. అతర్వాత కొత్త చిరునామాను నమోదు చేయండి. చిరునామా మార్పు కోసం అవసరమైన సహాయక పత్రాలను అప్లోడ్ చేయండి. 'తదుపరి' క్లిక్ చేయండి. డిక్లరేషన్‌ను పూర్తిచేసిన తరావత 'క్యాప్చా కోడ్'ను నమోదు చేసి, 'సమర్పించు' క్లిక్ చేయండి. పైన పేర్కొన్న దశలను పూర్తి చేసిన తర్వాత, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) లేదా భారత ఎన్నికల సంఘం మీ అభ్యర్థనను ప్రాసెస్ చేస్తుంది.

విజయవంతమైన ప్రాసెసింగ్ తర్వాత, ఇసిఐ మీ ఓటర్ ఐడి కార్డలో సంబంధిత మార్పులను చేస్తుంది. ఈ దశలను పూర్తి చేసిన తర్వాత, అప్లికేషన్‌ను ట్రాక్ చేయడానికి అధికారిక జాతీయ ఓటర్ల సేవల పోర్టల్‌కు వెళ్లండి. 'ట్రాక్ అప్లికేషన్ స్టేటస్'పై క్లిక్ చేయండి. రిఫరెన్స్ నంబర్‌ను నమోదు చేసి, 'స్టేట్'ని ఎంచుకుని, 'సమర్పించు' క్లిక్ చేయండి. మీ అభ్యర్థన అప్లికేషన్ పురోగతి స్థితి స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఓటరు ఐడిలో మీ చిరునామాను నవీకరించే ప్రక్రియ పూర్తయిన తర్వాత, మీరు మీ కొత్త నియోజకవర్గంలో మీ ఓటు వేయవచ్చు.

# బెగుసరాయ్‌లో కేంద్రమంత్రికి చెమటలు పట్టిస్తున్న సిపిఐ



బిహార్‌లో కమ్యూనిస్టుల కంచుకోట, 'బిహార్ లెనిన్‌గ్రాడ్', 'మినీ మాస్కో'గా పేరుబడిన బేగుసరాయి లోక్‌సభ నియోజకవర్గంలో సిపిఐ జోరు సాగుతోంది. ప్రస్తుత సిట్టింగ్ ఎంపి, వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో నిలిచే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మహాఘట్‌బంధన్ నుండి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఏల అవదేశ్ కుమార్ రాయ్ చెమటలు పట్టిస్తున్నారు. చారిత్రకంగా ఈ ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో కాంగ్రెస్‌తో కమ్యూనిస్టులు కొన్ని దశాబ్దాలు తలపడ్డారు. బేగుసరాయ్ గ్రామాలలో వందకు పైగా ఇరు పార్టీల కార్యకర్తల హత్యలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో 2014లో బిజెపి ఈ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఆ ఎన్నికలలో బిజెపి తరుపున భోలా సింగ్ గెలుపొందడం ద్వారా బిజెపి తొలిసారి బోణీ కొట్టింది. ఆ తరవాత ఆయన ప్రధాని మోదీ వ్యవహార శైలితో విబేధించడంతో పాటు, ఆ పార్టీలో సంబంధాలు యజమాని, పనివారిలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. దీంతో ఆయనకు మరుసటి ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. అక్కడ నుండి 2019లో గిరిరాజ్ సింగ్‌ను పోటీ పెట్టగా, సిపిఐ తరుపున నాటి జెఎన్‌యు విద్యార్థి నాయకుడు కన్హయ్య కుమార్‌ను బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో పొత్తు లేకపోవడంతో ఆర్‌జెడి కూడా పోటీ చేసింది. అయితే, ప్రతిపక్షాల ఓట్లు చీలికతో సిపిఐపై బిజెపి గెలుపొందింది. పొత్తులు లేకున్నా సిపిఐ రెండస్థానంలో నిలిచింది. అక్కడ గెలుపొందిన గిరిరాజ్ సింగ్‌కు కేంద్రమంత్రి పదవి దక్కింది. వివాదాస్పద, నోటి దురు సు వ్యాఖ్యలతో ఆయన నిత్యం వార్తల్లో నిలిచే వారు. ఇప్పుడు ఆ నోటి దురుసు తనం కూడా ఆయన కు బిజెపి శ్రేణులకు దూరం చేసింది. ఈ నియోజకవర్గంలో అత్యధికు లు భూమిహార్ (అగ్రవర్ణం) సామాజిక వర్గానికి చెందిన వారు అత్యధికం. మొత్తం 21 లక్షల మంది ఓటర్లలో అత్యధికులు

### గిరిరాజ్ సింగ్‌కు ఎదురుగాలి

బిజెపి సిట్టింగ్ ఎంపి, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కి ఈ సారి స్వంత పార్టీలోనే ఎదురుగాలి వీస్తోంది. గిరిరాజ్ సామాజికవర్గం భూమిహార్‌లు సైతం ఆయన నోటిదురుసు తనాన్ని ఇష్టపడడం లేదు. ప్రజలు సమస్యలు కాకుండా పదే పదే హిందూ ముస్లిం విబేధాలను రెచ్చగొట్టడం ఆయన పట్ల వ్యతిరకతను పెంచింది. తాజాగా తనకు దేశ ద్రోహుల ఓట్లు అక్కర్లేదని, తుక్డే తుక్డే గ్యాంగ్‌ను తాను ద్వేషిస్తానని చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. ఇప్పటికే ఆయన విద్వేషపూరిత వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు సిపిఐ ఫిర్యాదు చేసింది. తనను చూసి కాకుండా మోదీని చూసి ఓట్లు వేయండి అని గిరిరాజ్ ఒక వీడియో సందేశంలో విజ్ఞప్తి చేయడమంటే ఓటర్లు ఆయనపై ఎంత వ్యతిరేకతతో ఉన్నారో స్పష్టమవుతుంది.

కేవలం మోదీ గాలితోనే ఆయన గత ఎన్నికల్లో

### సిపిఐకి కలిసొస్తున్న ప్రతిపక్షాల ఐక్యత

విజయం సాధించారు. గతంలో మాదిరిగా ఈ సారి మోదీ గాలి కనపడడం లేదని, కాబట్టి గిరిరాజ్ గెలుపు కష్టమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

పైగా రిజర్వేషన్‌లపై ఆది నుండి బిజెపికి ఉన్న వ్యతిరేకత కూడా ఓబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలు మహాఘట్‌బంధన్ వైపు మొగ్గు చూపేలా చేస్తోంది. మొత్తానికి బేగుసరాయ్‌లో కమ్యూనిస్టుల సంస్థాగత బలానికి తోడు, విపక్షాల బలమైన మద్దతుతో పాటు, గిరిరాజ్‌పై బిజెపిలోనే పెరుగుతున్న వ్యతిరేకత సిపిఐ అభ్యర్థి అవదేశ్ కుమార్ రాయ్ గెలుపును సుగమం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

చారిత్రకంగా బెగుసరాయ్‌లో భూ స్వామ్య వ్యతిరేక పోరాటానికి కమ్యూనిస్టులు నేతృత్వం వహించడంతో పేదవర్గాలన్నీ దశాబ్దాలుగా సిపిఐ బాట లో నడుస్తున్నాయి. అలనాటి పోరాట ఆనవాళ్ళే ఇప్పటికీ ఈ నియోజకవర్గంలో పటిష్టమైన క్యాడర్ ఉండేందుకు కారణమైంది. ఈసారి ఆర్‌జెడి, కాంగ్రెస్‌లు సైతం సిపిఐ అభ్యర్థి అవదేశ్ కుమార్ రాయ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాయి. దీనికి తోడు బచ్చారా నియోజకవర్గం నుండి అవదేశ్ రాయ్ మూడు సార్లు శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు. వరుసగా 1985 నుండి 2000 సంవత్సరం వరకు ఆ నియోజకవర్గం ఎంఎల్‌ఏగా ఉన్నారు. గత ఎన్నికల్లో కేవలం 484 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. అది కూడా అవకతవకలతోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. బచ్చారా నియోకజవర్గం బేగుసరాయ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. బేగుసరాయ్ పరిధిలో ఏడు శాసనసభ సెగ్మెంట్‌లు ఉండగా, అందులో మహాఘట్‌బంధన్ నాలుగు స్థానాలలో గెలుపొందగా, రెండు చోట్ల సిపిఐ, మరో రెండు చోట్ల ఆర్‌జెడి ఎంఎల్‌ఏలు ఉన్నారు. మిగతా మూడు సెగ్మెంట్‌లలో వందల తేడాతోనే ఎన్‌డిఏ అభ్యర్థులు గెలిచారు. 2020 అసెంబ్లీ ఎన్నికలలో మహాఘట్‌బంధన్‌కు బేగుసరాయ్ లోక్‌సభ నియోకజవర్గ పరిధిలో లక్షకు పైగా ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇది కూడా సిపిఐకి సానుకూల సంకేతమే. అవదేశ్ కుమార్ రాయ్ నామినేషన్ ర్యాలీకి భారీ సభ జరిగింది. దీనికి ఆర్‌జెడి యువ నేత తేజస్వీ యాదవ్ కూడా హాజరై, సిపిఐ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని గట్టిగా చెప్పారు. దీంతో ఆర్‌జెడి కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎంపి శత్రుఘ్న ప్రసాద్ సింగ్ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.సిపిఐ అభ్యర్థికి ప్రతిపక్ష పార్టీల ఓట్లన్నీ కచ్చితంగా బదిలీ అవుతాయని, గత ఎన్నికల్లో ఓట్ల చీలికతో బిజెపి గెలిచిందని, ఈ సారి అది జరగదని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# దేశాన్ని విధ్వంసం చేసిన బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల మల్లేష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశాన్ని పూర్తిగా విధ్వంసం చేసిన బిజెపిని ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ యాప్రాల్‌లో గుగువారం సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ గడిచిన 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను 25మంది సంపన్న వర్గాలకు దోచిపెట్టిందని ధ్వజమెత్తారు.

దేశాన్ని పూర్తిగా విధ్వంసం చేసి ఇప్పుడు వికసిత్ భారత్, పేరుతో ఓట్లను అడగడం సిగ్గు చేటాన్నారు. బిజెపి దేశంలో మూడోసారి గెలిపిస్తే కార్పొరేట్ రాజ్యాన్ని తీసుకువచ్చి మనువాద సిద్ధాంతాన్ని రాజ్యాంగంగా మార్చే ప్రమాదం పొంచి ఉండడమే కాకుండ ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంద అన్నారు. అందుకే బిజెపిని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

దేశంలో ప్రజాస్వామ్య మనుగడ సాగించాలంటే మోడీ మళ్ళీ అధికారంలోకి రావద్దని అన్నారు. బిజెపిని గద్దె దించాలనే లక్ష్యంతోనే దేశంలో 28 రాజకీయ పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ని గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిల్, అల్వాల్ మండల కార్యదర్శి కె సహదేవ్, సహాయ కార్యదర్శి డి జంగయ్య, సిపిఐ జిల్లా నాయకులు డిజి నరేంద్ర ప్రసాద్, డి నరేంద్ర చారి, ఎన్.పద్మ, బుడ్డోల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ రాష్ట్ర నాయకుడు బందెల నర్సయ్య మృతి

## ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బందెల నర్సయ్య(64) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగృహం చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ ఏరియాకు తరలించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు, జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు బందెల మృతదేహంపై పార్టీ జెండా, పూలమాల ఉంచి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతంలో పార్టీ విస్తరణకు ఎనలేని కృషి చేశారని, సింగరేణి వర్కర్స్ యూనియన్ నాయకుడిగా, బాధ్యతలు నిర్వహిస్తూ సేవకే అంకితమయ్యాడని అన్నారు. ప్రజా కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేశాడని అన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమ సహచరుడిగా కొనసాగిన నర్సయ్య మృతి బాధాకరమన్నారు. ఆయనలేని లోటు తీర్చలేనిదని, అమరుడి ఆశయాల సాధనకు కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నర్సయ్య మృతి పట్ల సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు బందెలకు కన్నీటి వీడ్కోలు పలికారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనిఆస్, మున్నాలక్ష్మీ కుమారి, రంగయ్య, సలీం, నరాటి ప్రసాద్, పుల్లారెడ్డి, సారయ్య, బ్రహ్మం, వాసిరెడ్డి మురళి, దమ్మాలపాటి శేషయ్య, గనిగళ్ళ వీరస్వామి, దమ్మాలపాటి శేష య్య, వంగ వెంకట్, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, పూర్ణచందర్‌రావు, సాయిబాబు, ముగిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, గెడ్డాడు నగేష్, భూక్యా దస్రు, జక్కుల రాములు, కుమారి హన్మంతరావు తదితరులు ఉన్నారు.

# విద్యుత్ కోతలు లేని ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి : నామ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇక బిఆర్‌ఎస్ కోలుకుంటుందా అన్న ప్రచారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు మరో రెండు రోజులు ముందున్న పరిస్థితులను పరిశీలిస్తే చాలా మార్పు కనిపిస్తుంది. నామ నాగేశ్వరరావు పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలత ఏమి లేదనుకున్న బిఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అనే పరిస్థితికి తీసుకు వచ్చింది. రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా పనిచేసినా అవినీతి మరక



లేకపోవటం, వ్యక్తిగతంగా, రాజకీయంగా ఎవ రి వ్యవహారాలలోను జోక్యం చేసుకోకపోవటం అధికార దర్పాన్ని ప్రదర్శించకపోవటం బిఆర్‌ఎస్ పార్లమెంటరీ నేతగా తెలంగాణకు సంబంధించి చట్ట సభలలో పోరాడారు అన్న పేరు ఆయనకు సానుకూలతను తెచ్చిపెట్టింది. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నాటికంటే ఇప్పుడు పార్టీలో కనిపిస్తున్న ఐక్యత కూడా నామకు కలిసి వచ్చే అంశమే. బిఆర్ఎస్ అభ్యర్థి నామ మాట్లాడుతూ నేను గతంలో నాలుగు సార్లు ఎంపిగా పోటీ చేశానని ఎప్పుడు సానుకూలంగా ప్రజలు స్పందించారని పార్టీ ఓటు బ్యాంకు నా వ్యక్తిగత వ్యవహారం సానుకూలంగా ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో లోపం ఏర్పడిన ప్రతిసారి ప్రజలకు కేసిఆర్ గుర్తుకు వస్తున్నాడని నామ నాగేశ్వరరావు తెలిపారు.

ఐదారు అంశాలు ఖమ్మం పార్లమెంటు పరిధిలో బిఆర్‌ఎస్ గెలుపుకు దోహదపడనున్నాయని తెలుగుదేశంతో పాటు వామపక్ష భావజాలం కలిగిన వారు సైతం తనపట్ల సానుకూలంగా ఆలోచించే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు ప్రజల్లో తమ పట్ల సానుకూల ధృక్పధంగా మారుతుందన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం ప్రజల తీర్పు జాతీయ స్థాయిలో చర్చకు దారి తీస్తుందన్న నామ దేశంలో ప్రధాని మోడీ చరిష్మా తగ్గిందని బిజెపికి కాని, కాంగ్రెస్ కూటమికి కాని పూర్తి మెజార్టీ వచ్చే అవకాశం లేదన్నారు.

# పోలింగ్ ముందు డిబిటి కుదరదు

## ఎపి సర్కారుకు తేల్చిచెప్పిన ఎన్నికల కమిషన్

మేలో ఎన్నడూ నిధులు విడుదల చేయలేదని వ్యాఖ్య

**అమరావతి:** ఎపిలో మునుపెన్నడూ మే నెలలో సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేసిన చరిత్ర లేదని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) వ్యాఖ్యానించింది. ఎపి ఖజానాలో సరిపడా నిధులు ఉన్నా జనవరి నుంచి మార్చి వరకు లబ్ధిదారులకు నిధులు విడుదల చేయలేదని అభిప్రాయపడింది. సంక్షేమ పథకాలకు నిధుల విడుదలపై హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం ఉదయం నగదు బదిలీ పథకాలకు నిధుల విడుదలపై ఇసిఐ అనుమతి కోరుతూ సిఎస్ లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఇసిఐ పలు అంశాలపై వివరణ కోరుతూ మధ్యాహ్నం 3గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇసిఐకి వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం డిబిటి పథకాలను నిధులను విడుదల చేసిన తేదీలు, అవి లబ్ధిదారుల ఖాతాలకు జమైన తేదీలను అందించాలని ఇసిఐని కోరడంతో ఆ వివరాలను ఎన్నికల సంఘానికి ప్రభుత్వం సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన వివరాలను పరిశీలించిన ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఖజానా పరిస్థితి 2024 జనవరి మార్చి మధ్య కాలంలో నగదు బదిలీ పథకాలకు చెల్లింపులకు అనుకూలంగానే ఉందని వ్యాఖ్యానించింది. వివిధ పథకాలకు నగదును చెల్లించే పరిస్థితుల్లో ప్రభుత్వం ఉన్నా, వాస్తవ వ్యవధి కంటే ఎక్కువ కాలం పాటు సాగదీసినట్టు ఇసి అభిప్రాయపడింది. నిధులు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బదిలీ చేయడంలో జాప్యం జరిగినట్టు ఇసిఐ అభిప్రాయపడింది. గతంలో డిబిటి పథకాలకు నిధులు విడుదల చేసిన తేదీలను పరిశీలిస్తే, 2024 మే నెలలో సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉన్నట్టు కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాల ఆధారంగా సార్వత్రి క ఎన్నికల పోలింగ్ తేదీకి ముందు మే 10వ తేదీ లోపు నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

**హైకోర్టులో సుదీర్ఘ వాదనలు**

మరోవైపు ఎపిలో లబ్ధిదారులకు నిధుల విడుదల చేయాలని హైకోర్టు సింగిల్ బెంచ్ జారీ చేసిన ఉత్తర్వులపై నవతరం పార్టీ తరపున ఎపి హైకోర్టులో డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. దీనిపై చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ జరిపింది. నగదు బదిలీ పథకాలపై సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిష్న విచారణలో ఎన్నికల సమయంలో నిధుల విడుదల నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలకు కూడా నిధుల విడుదల జరగకూడదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఇసి కూడా ఎన్నికల పోలింగ్ పూర్తయ్యాక జమ చేయాలని చెప్పిందని పిటిషనర్ వివరించారు. పింఛన్లు ప్రతి నెలా ఇస్తున్నారుని హైకోర్టు ప్రశ్నించడంతో పింఛన్లు వేరు, పథకాలు వేరని పిటిషనర్ న్యాయవాది వివరించారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై దాఖలైన పిటిషన్‌ను విచారణ సందర్భంగా ఇసిఐ తీరును హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు కన్నా ఎక్కువ అని ఇసిఐ భావిస్తున్నట్టుందని, ఎన్నికల నిర్వహణలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో ప్రమాణా లు ఎందుకని నిలదీసింది. నిధుల విడుదలకు హైకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత ఇసిఐ ఏ అధికారంతో ప్రభుత్వాన్ని వివరణ కోరిందని న్యాయమూర్తి ప్రశ్నించారు. రిట్ అప్పీల్ చేయకుండా హైకోర్టు ఆదేశాలను ఇసిఐ ఏ విధంగా పక్కన పెట్టిందని ప్రశ్నించారు. అనంతరం ఈ అప్పీల్‌ను కోర్టు వేసవి సెలవుల అనంతరం విచారిస్తామని తెలిపింది.



# రఘురాంరెడ్డి గెలుపుకోసం కూనంనేని విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ స్థానం నుంచి సిపిఐ మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. కొత్తగూడెం పట్టణంలోని కూలిలైన్, జిఆర్ బస్తి, హనుమాన్ బస్తి, బూడిద గడ్డ తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, అభ్యర్థితో కలిసి ఇంటింటి ప్రచారంలో కూనంనేని పాల్గొన్నారు. ప్రచారం కోసం వచ్చిన రఘురాంరెడ్డి, కూనంనేనికి బస్తీలోని మహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్తి సెంటర్‌లో జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, మత రాజకీయాలతో, కార్పొరేట్ విధానాలతో బిజెపి ప్రభుత్వం కాలం వెళ్లదీసిందని, ఆచరణ సాధ్యం కాని పథకాలతో, అవినీతితో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు, కార్మికులు, కర్షకులకు, ఉద్యోగులకు ఈ రెండు ప్రభుత్వాలు చేసిందేమి లేదన్నారు. రామసహాయంను గెలిపించి చట్టసభకు పంపాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా కాంగ్రెస్ నాయకులు ఆళ్ళమురళి, నాగేంద్ర, త్రివేది, ఎల్.గోపాలకృష్ణ, సిపిఐ నాయకులు, సత్యనారాయణ, నేరెళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం

శనివారం, మే 11

## కేజ్రీవాల్‌కు ఎన్నికల బెయిల్

ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధానం (2021–22) కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి)మార్చి 21న అరెస్టు చేసినమీదట కోర్టు ఉత్తర్వులపై తిహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెంచి శుక్రవారం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో జూన్ 1వరకు ప్రచారం చేసేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేతకు అవకాశం లభించింది. ఇదొక అపూర్వమైన ఉత్తర్వు. ఆప్‌కు, ఇండియా కూటమికి ఇది ప్రోత్సాహకారి అవుతుంది. ఆప్ ఢిల్లీతోపాటు పంజాబ్‌లో అధికారంలో ఉంది. ఢిల్లీలో తొలిసారి కాంగ్రెస్ పార్టీతో లోక్‌సభ సీట్లు సర్దుబాటు చేసుకుంది. ఆప్ 4 స్థానాలకు, కాంగ్రెస్ 3 స్థానాలకు పోటీ చేస్తున్నాయి. ఈ ఒప్పందం బిజెపి గుండెల్లో గుబులు కలిగించింది. ఢిల్లీ ఓటర్లు గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు 90శాతంపైగా సీట్లు కట్టబెట్టారు. కాని లోక్‌సభ ఎన్నికల్లో రెండుసార్లు మొత్తం 7 సీట్లు బిజెపికి అప్పగించారు. ఈ పర్యాయం ఆప్–కాంగ్రెస్ ఒప్పందం కారణంగా బిజెపికి ఆ అవకాశం దక్కదు. కేజ్రీవాల్ తాత్కాలిక బెయిలు పిటిషన్‌ను 10వ తేదీ విచారిస్తామని జస్టిస్‌లు సంజీవ్‌ఖన్నా, దీపాంకర్ దత్తాలతోకూడిన ధర్మాసనం సానుకూల అభిప్రాయం వెల్లడించిన సందర్భంలోనే లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా కేజ్రీవాల్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) దర్యాప్తును సిఫారసు చేయటం ఆప్ అధినేతపై బిజెపికున్న కసికి నిదర్శనం. 'సిక్కులు ఫర్ జస్టిస్' అనే నిషిద్ధ సంస్థ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నిధులు స్వీకరించినట్లు వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఇండియా అనే ఒక సంస్థ సక్సేనాకు ఫిర్యాదు చేసిందట. దానిపై ఆయన విచక్షణారహితంగా ఉత్తర్వు చేశారు. ''ఇది బిజెపి పనుపున కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఒక పెద్ద కుట్ర'' అని ఆప్ నాయకుడు సౌరబ్ భరద్వాజ్ వ్యాఖ్యానించారు. ఆప్ 2014–2022 మధ్య ఆ ఖలీస్థానీ గ్రూపునుంచి 16 మిలియన్ డాలర్లు అందుకుందట. మరి హిందూత్వ వీరాభిమానులు ఇంతకాలం మౌనంగా ఉండి ఇప్పుడు ఫిర్యాదు చేయటంలోనే వారి దురుద్దేశం వెల్లడవుతోంది. కేరళలో పోలింగ్ సందర్భంలో అక్కడికి వెళ్లి బిజెపి అభ్యర్థులకు ఓట్లకోసం క్రైస్తవ మతాధికారులను కలిసే ప్రయత్నం చేసి భంగపడిన వ్యక్తి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా.

కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఇడి లాయర్లు చేసిన అడ్డగోలు వాదనలను న్యాయమూర్తులు సున్నితంగా తిరస్కరించారు. ఎన్నికల్లో ప్రచారం కోసం అనే కారణంతో బెయిల్ మంజూరు చేసిన ఉదాహరణలు లేవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదించారు. ఇది చట్ట పాలనకు, సమానతకు విరుద్ధం. ఎప్పుడూ ఏదో ఒక ఎన్నిక జరుగుతుండే మన దేశంలో దగాకోరు రాజకీయ నాయకులు నేరాలు చేస్తూనే ఉంటారని, ఎన్నికల పేరుతో అరెస్టు తప్పించుకుంటూ ఉంటారని ఇడి తమ 44పేజీల అఫిడవిట్‌లో పేర్కొన్నది. ఈ అఫిడవిట్ లీగల్ ప్రొసీజర్స్ కు బరితెగించిన ఉల్లంఘన అని దానిని తిరస్కరించిన ఆప్ లీగల్ టీం, కేజ్రీవాల్ అరెస్టుకు ఆరు నెలల ముందు తమ వద్ద ఏమి సమాచారముందో దాని ఆధారంగానే ఎన్నికల మధ్యలో ఆయన్ను అరెస్టు చేసి ఇడి అరెస్టు అధికారాన్ని దురుపయోగం చేసిందని పేర్కొన్నది.

'ఇడి ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు 2022' ఆగస్టులో రిజిస్టర్ అయింది. కాగా ముఖ్యమంత్రిని ఈ సంవత్సరం మార్చి 31న అరెస్టు చేశారు. అందువల్ల ఆయనకు 21 రోజుల బెయిల్ ఎటువంటి వ్యత్యాసం తేదు' అన్నారు న్యాయమూర్తులు.

ఇదే కేసులో అరెస్టు చేయబడిన బిఆర్ఎస్ నాయకురాలు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుమార్తె కవితను జైల్లో కొనసాగించటంలో ఔచిత్యం కనిపించదు. ఆమెకు కూడా బెయిల్ దొరుకుతుందని ఆశించుదాం. కాగా, కేజ్రీవాల్ అరెస్టును సవాలుచేస్తున్న పిటిషన్‌పై వాదనలు వచ్చేవారం కొనసాగుతాయి. మే 20న వేసవి సెలవులు ఆరంభమయ్యేలోపు తీర్పు ప్రకటిస్తామని సుప్రీంకోర్టు బెంచి ప్రకటించింది.

### మానవాభివృద్ధిలో అధమం – అసమానతల్లో అత్యధికం

### పొదుపు తక్కువ – అప్పులు ఎక్కువ : ఈ స్థితి మారదా?

# మానవాభివృద్ధికి ప్రాధమ్యం కావాలిప్పుడు!

నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయి. 5 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచంలో మూడవ స్థానానికి ఎగబాకుడు గూర్చి అనునిత్యం ఊదరగొట్టే ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుత ఎన్నికల్లో దానిపై ప్రచారం తగ్గించి ఇతరేతర భావోద్వేగ, నిందాపూర్వక అంశాలపైకి దృష్టి మళ్లించారు. మానవాభివృద్ధిలో తక్కువస్థాయి – అసమానతల్లో అత్యధిక స్థాయి; పొదుపు తక్కువ – అప్పులు అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మానవాభివృద్ధికి ప్రాధమ్యం ఇచ్చే ప్రత్యామ్నాయ వృద్ధి వ్యూహం గూర్చి ఆలోచించవలసిన పనిలేదా? మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌కు చెందిన డైరెక్టర్ ఎం.సురేశ్‌బాబు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సూక్ష్మంగా..

ఇటీవల రెండు నివేదికలు భారతదేశ అభివృద్ధిలో రెండు ముఖ్యమైన పార్శ్వాలు వెల్లడించాయి. ఒకటి, ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం ప్రచురించిన మానవ అభివృద్ధి నివేదిక, 2023–24; రెండు, ప్రపంచ అసమానత ల్యాబ్ 2024 మార్చిలో ప్రచురించిన పత్రం. మొదటిది సాపేక్ష పరిశీలనలు చేసి మానవాభివృద్ధి రంగంలో సాఫల్యాలను పేర్కొన్నది. రెండవది, భారతదేశంలో 1922 – 2023 మధ్య ఆదాయం, సంపద అసమానతగూర్చి దీర్ఘకాల ధోరణులను వెల్లడించింది. భవిష్యత్ గమనం దిద్దుబాటుకు వాటిని ఉపయోగించుకోవచ్చు. వచ్చే ప్రభుత్వం మానవ సామర్థ్యాలు మెరుగుదలపై, పౌరుల సంక్షేమంపై దృష్టి పెట్టదలచుకుంటే ఈ నివేదికలు గైడ్‌గా ఉపకరిస్తాయి.

**మానవాభివృద్ధి సూచీలో భారతదేశం :**
2022లో 193 దేశాల్లో 134, ఇది 2021తో పోల్చితే కాస్తమెరుగు. 2021లో మన దేశం స్థానం 192 దేశాల్లో 135. హెచ్‌డిఐ (మానవాభివృద్ధి సూచీ) విలువ 2021లోని 0.633 నుంచి 2022లో 0.644కు పెరగటం వల్ల ఆ మార్పు సాధ్యమైంది. దీంతో మనదేశం మానవాభివృద్ధిలో మధ్య స్థాయి కేటగిరీలో చేరింది. 1990–2022 మధ్య హెచ్‌డిఐలో భారత్ వృద్ధి విలువ 48.4శాతం – అనగా 1990 లోని 0.434 నుంచి 2022లో 0.644కు పెరిగింది. 2021తో పోల్చితే భారతదేశం ర్యాంక్ 1 పాయింటు పెరిగినప్పటికీ ఇప్పటికీ భూటాన్, బాంగ్లాదేశ్, శ్రీలంక, చైనాలకన్నా వెనుకబడి ఉంది. మధ్యస్థాయి మానవాభివృద్ధి కేటగిరీ దేశాల్లో మయన్మార్, ఘనా, కెన్యా, అంగోలా ఉన్నాయి.

**లింగ సమానత్వ సూచీ :** ఈ సూచీలో 2021లో 191దేశాల్లో 122 ర్యాంక్‌లో ఉన్న భారత్ 2022లో 193 దేశాల్లో 108ర్యాంక్‌కు చేరింది. అయితే శ్రామికశక్తి భాగస్వామ్యంలో లింగ వ్యత్యాసం చాలా హెచ్చుగా ఉంది. పురుషులు (76.1 శాతం), స్త్రీలు (28.3శాతం) మధ్య వ్యత్యాసం 47.8శాతంగా ఉంది.

ఇదిలావుండగా, దేశాల మధ్య అసమానత( హెచ్‌డిఐ ఎగువ–దిగువ కొనల మధ్య) 2020 నుంచి ఏటేటా పెరుగుతున్నది. వస్తువుల ప్రపంచ వాణిజ్యం దాదాపు 40శాతం మూడు లేదా అంత కన్నా తక్కువ దేశాల చేతిలో కేంద్రీకరించటం, దానితో పెరుగుతున్న ఆర్థిక కేంద్రీకరణ ఈ వ్యత్యాసానికి మూలం. అంతేకాదు, 2021లో, మూడు అతిపెద్ద టెక్నాలజీ కంపెనీల్లో ఒక్కొక్క దాని మార్కెట్ కాపిటలైజేషన్ ఆ సంవత్సరంలో 90 శాతం దేశాల జిడిపిని మించిపోయింది. పెరుగుతున్న ఈ అసమానతల పర్యవసానాలను ఆ నివేదిక చర్చించింది.






అసమానతకు సర్దుబాటు చేసినపుడు హెచ్‌డిఐలో భారతదేశం నష్టం 31.1శాతం. ఇది శ్రీలంక, బాంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థాన్ కన్నా ఎక్కువ.

**అసమానత:**
భారతదేశ జనాభాలో దిగువ 50శాతం 2022 – 23లో దేశ జాతీయాదాయంలో 15శాతం మాత్రమే పొందినట్లు వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనం తెలిపింది.

ఆ నివేదిక ప్రకారం, పై స్థాయిలోని 1 శాతం మంది సగటున 53 లక్షలు ఆర్జిస్తున్నారు. ఇది సగటు భారతీయుని ఆర్జనకు (23వేలు) 23 రెట్లు. కిందిస్థాయి 50 శాతం మంది సగటు ఆదాయం రూ.71,000(జాతీయ సగటుకు 0.3రెట్లు), మధ్యస్థాయి 40శాతం మంది సగటు ఆదాయం రూ.1,65,000(జాతీయ సగటుకు 0.7రెట్లు).

ఆదాయ పంపిణీ శిఖరాగ్రంలోని కుబేరులైన 10వేలమంది వ్యక్తు లు (92కోట్ల భారత వయోజనుల్లో) సగటున రూ.48కోట్లు ఆర్జిస్తున్నారు. ఇది సగటు భారతీయుని ఆదాయానికి 2069 రెట్లు. భారతదేశంలో ఆదాయం ఇంత తీవ్రమైన వ్యత్యాసానికి ముఖ్యమైన పర్యవసానాలుంటాయి.

ఆసక్తికరమైన అంశం ఏమంటే, 2014 – 2022 కాలంలో ఆదాయ పంపిణీలో మధ్యస్థాయిలో ఉన్న 40శాతంమంది ఆదాయ వృద్ధి దిగువస్థాయిలోని 50శాతం ఆదాయ వృద్ధికన్నా తక్కువగా ఉంది.దీనివల్ల 'మధ్యతరగతి' పరిమాణం తగ్గే అవకాశం ఉంటుంది. వృద్ధి పైస్థాయిలో కేంద్రీకృతమైనప్పుడు, ఆర్థికంగా ప్రజలమధ్య విభజన వేగం పుంజుకుంటుంది. అది అంతిమంగా సంపన్నులు – పేదలు అనే రెండు వర్గాలుగా విభజనకు దారితీస్తుంది. భారతదేశంలో కుటుంబ అప్పు స్థాయిలు 2023 డిసెంబర్‌లో చాలా హెచ్చుగా – జిడిపిలో 40శాతం నమోదైనాయి.

ఇటీవల నివేదిక ప్రకారం నికర పొదుపు మొత్తాలు జిడిపిలో 5.2 శాతానికి పడిపోయాయి. ఈ కుటుంబ రుణాలను విడదీసి చూస్తే హామీలేని వ్యక్తిగత రుణాలు చాలా వేగంగా వృద్ధి చెందాయి. హామీపూర్వక రుణం, వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు ఆ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. కుటుంబాల వార్షిక అప్పులు 2022–23లో జిడిపిలో 5.8 శాతానికి ఎగబాకాయి.

ఈ పరిస్థితులను సమీక్షించి మానవాభివృద్ధికి ప్రాధమ్యం ఇచ్చే ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం అన్వేషించటం అవసరం. దీనికి అల్పకాలిక ఎన్నికల లబ్ధికి మించిన రాజకీయ సంకల్పం, ఆలోచన అవసరం.

## 'ఒక అభ్యర్థికి ఒకే స్థానం' సాధ్యమా?

అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి పోటీచేసే అభ్యర్థులు చాలా మందే ఉంటారు. అయితే, ఒక అభ్యర్థి ఒకే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగే విధంగా నిబంధనలు మార్చాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ విషయంపై ఎన్నో సిఫార్సులు కూడా ఉన్నాయి. ఒక వ్యక్తిని, ఒకే స్థానానికి పరిమితం చేసేలా సంబంధిత చట్టాల్లో మార్పులు చేయాలని కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖను 2022లో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) కోరింది. ఇదే అంశాన్ని సూచిస్తూ, 2023లో సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. అయితే, ఇది తమ పరిధిలోకి వచ్చే అంశం కాదని పేర్కొంటూ, అత్యున్నత న్యాయస్థానం దానిని కొట్టేసింది. ఇలావుంటే, ప్రజల ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పిఎ) చట్టం 1951లోని సెక్షన్ 33(7) ప్రకారం ఒక అభ్యర్థి ఎన్ని స్థానాల్లోనైనా పోటీ చేయవచ్చు. అయితే, ఈ సెక్షన్‌ను 1996లో సవరించారు. కొత్త నిర్ణయం ప్రకారం ఒక అభ్యర్థి గరిష్ఠంగా రెండు నియోజకవర్గాల నుండి పోటీ చేయవచ్చు. ఒకవేళ రెండు స్థానాల్లోనూ గెలిస్తే, ఒక సీటును ఖాళీ చేయాలి. ఒక వ్యక్తి దేశంలోని ఎక్కడైనా తాను కోరుకున్న ఒకటి లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాలలో పోటీ చేయడానికి ఆర్‌పిఎ అనుమతిస్తుంది. అనంతరం జరిగిన మార్పును అనుసరించి, ఈ సంఖ్యను గరిష్ఠంగా రెండుకు కుదించడమేగాక, అభ్యర్థులకు ఉన్న పోటీ హక్కులో జోక్యం చేసుకునే అవకాశం ఇసిఐకి లభించింది. అవసరమైతే అభ్యర్థులు ఎంపికను తగ్గించే అవకాశం కూడా ఉంది. కాగా, చాలామంది దేశ వ్యాప్తంగా తమ పార్టీ అధికారాన్ని చాటుకోవడానికి రెండు నియోజకవర్గాల నుంచి పోటీలో ఉంటా రు. మరికొంత మంది తమకు దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు





ఉందని నిరూపించుకోవడానికి ఈ ప్రయత్నం చేస్తారు. ఒక పార్టీలో కీలకంగా ఉండి, ఒకవేళ ఆ పార్టీ గెలిస్తే కేబినెట్‌లో చోటు లభించే నాయకులు ఈ విధంగా రెండు నియోజకవర్గాలను ఎంచుకుంటారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి విజ యం సాధిస్తే, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి ఎన్నుకోవచ్చు. ఈ అవకాశాలు ఎక్కువ గా ఉన్న కారణంగానే ఆయన కేరళలోని వాయనాడ్‌తోపాటు ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి కూడా పోటీకి దిగారని అంటున్నారు. ఇలావుంటే, రెండు స్థానాల నుంచి పోటీ చేయ డం సరైనది కాదన్న వాదన బలంగా ఉంది. బహుళ నియోజకవర్గాల్లో ప్రచారం చేయడాని కి, అటు అభ్యర్థికి, ఇటు ప్రభుత్వానికి కూడా డబ్బు వృథా అవుతుంది. ఎందుకంటే, సదరు అభ్యర్థి రెండు నియోజకవర్గాల్లోనూ గెలిస్తే, ఒక దానిని వదులుకోవాలి. అక్కడ మళ్లీ ఉప ఎన్నికలను ఇసిఐ నిర్వహించాలి. ప్రజా ధనం ఈ విధంగా వృథా అవుతుంది. అంతేగాక, ఎన్నికల ప్రక్రియపై ఓటర్లు ఆసక్తిని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. ఇక ఆర్‌పిఎలోని సెక్షన్ 70 ప్రకారం, ఒక అభ్యర్థి అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ ఒకేసారి పోటీ చేయడానికి వీల్లేదు. సెక్షన్ 33 (7)ని అనుసరించి రెండు స్థానాల్లో పోటీ చేయవచ్చు. అంటే ఈ రెండు సెక్షన్లు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. ఒక అభ్యర్థి రెండు స్థానాల నుంచి పోటీకి దిగడం ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడమేనని కొంద రు అంటున్నారు. ఇది న్యాయమైన, సమాన ప్రాతినిధ్య సూత్రాన్ని బలహీన పరుస్తుందనే విమర్శలో నిజం లేకపోలేదు. అందుకే, సెక్షన్ 33(7)ని సవరించాలని ఎన్నికల సంఘం 2004 , 2010 , 2016, 2018, 2022 సంవత్సరాలలో సిఫార్సు చేసింది. ప్రజాస్వామ్య సూక్తం 'ఒక వ్యక్తి , ఒక ఓటు' మాదిరిగానే 'ఒక అభ్యర్థి, ఒక నియోజకవర్గం' అనే సూత్రాన్ని కూడా పాటించాలి.

## ప్రధానికి ట్రాన్స్‌జెండర్ సవాల్

లోక్‌సభ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలకు లోటు లేదు. వివిధ పార్టీలకు చెందిన అగ్ర నాయకులతో పోటీదిగడం ద్వారా ప్రచారం పొందాలనుకునే వారు చాలామందే ఉంటారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ నియోజకవర్గమైన వారణాసి నుంచి పోటీలో ఉన్న అఖిల భారత హిందూ మహాసభ (ఎబిహెచ్‌ఎం) అభ్యర్థి, 'ట్రాన్స్‌జెండర్' కిన్నార్ మహామండలేశ్వర్ హిమాంగి సఖిని ఇలాంటి వారి నుంచి మినహాయించాలి. ఆమె (అతను) పేరు కోసమో, ప్రచారం కోసమే ఈ నిర్ణయం తీసుకోలేదు. సుమారు దశాబ్దం క్రితం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సక్రమంగా అమలు చేయని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహంతో పోటీకి దిగిన విషయా న్ని గుర్తించాలి.

లింగ మార్పిడి చేసుకున్న వారి హక్కులను కాపాడడానికి, వారికి సమాజంలో తగిన గౌరవాన్ని అందించడానికి సఖి ఏకంగా ప్రధానిపైనే యుద్ధానికి సిద్ధమయ్యారు. 2024 లో 48,044 మంది థర్డ్ జెండర్ ఓటర్లు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)లో నమోదు చేసుకున్నారు. 2019లో ఈ సంఖ్య 39,683. ఇలావుంటే, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సక్రమంగా అమలు చేయమని సఖి లాంటి వారు ఎందుకు కోరుతున్నారు?నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎ



న్‌ఎఎల్‌ఎస్‌ఎ లేదా నాల్సా)వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు 2014లో చారిత్రక తీర్పును వెల్లడించింది. ట్రాన్స్‌జెండర్స్‌ను 'థర్డ్ జెండర్'గా గుర్తించాలని ఆదేశించింది. వారికి మిగతా పౌరులతో సమానంగా, రాజ్యాంగ బద్ధంగా అన్ని హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. జీవసంబంధమైన సెక్స్, సైకలాజికల్ సెక్స్ మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావించింది. జీవ సంబంధమైన సెక్స్ ఆధారంగా లింగ గుర్తింపును తిరస్కరించింది. మానసిక లింగం ఆధారంగా గుర్తింపుకు పూర్తి ప్రాముఖ్యతనిచ్చింది. రాజ్యాంగం ద్వారా లభించిన ప్రాథమిక హక్కులకు అనుగుణంగా ఉంటే, యోగ్యకర్త సూత్రాలతోసహా అన్ని అంతర్జాతీయ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 14 లింగ భేదం అనేది లేకుండా పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయని, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, విద్య, పౌర హక్కుల విషయంలో వారు అన్ని విధాలా మిగతా పౌరులతో సమానమని తేల్చిచెప్పింది. ఈ తీర్పును అనుసరించే 2019లో ట్రాన్స్‌జెండర్స్ హక్కుల చట్టం వచ్చింది. 2020లో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రారంభమైంది. 2022లో థర్డ్ జెండర్ ఖైదీల గోప్యత, గౌరవాన్ని నిర్ధారించడానికి రాష్ట్రాలు/యుటిలలోని జైళ్ల అధిపతులకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక సలహా పంపింది. లింగమార్పిడి వ్యక్తుల కోసం జాతీయ పోర్టల్ కూడా మొదలైంది. అయితే, ఇన్ని రకాలుగా హక్కులు, భద్రతలను కల్పించినప్పటికీ, 'థర్డ్‌జెండర్' వ్యక్తులు ఇప్పటికీ వివక్షకు గురవుతునే ఉన్నారన్నది సఖి ఆవేదన. 2019 ఎన్నికల్లో మోదీపై పోటీ చేసిన ఆమె, మరోసారి సమర శంఖం పూరించింది. జయాపజయాలు ఎలావున్నా, ఆమె ఆవేదన అందరికీ తెలుస్తుంది. ట్రాన్స్‌జెండర్ల పట్ల గౌరవంగా ఉండాలన్న కనీస కర్తవ్యాన్ని బోధిస్తుంది.

## సాంకేతిక ఆవిష్కరణలో భారత్ స్థానం పటిష్టం



ఓ రోజు విశాలంగా ఉన్న ఇంట్లో ఒక పెద్దమనిషి... ఆయన చుట్టూ మరో నలుగురు....డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు...వాళ్ళ మనసుకి చాలా ఆకలిగా ఉంది....టేబుల్ మీదున్న ఆహార పదార్థాలు తింటే తీరే ఆకలి కాదది. ఏదో వార్త కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు....ఆ సమయంలో వీళ్లకి దూరంగా ఉన్న గదిలో ఫోన్ రింగ్ అయింది. ఆ ఫోన్ ఎప్పుడు రింగ్ అవుతుందా...అని వేయి కళ్ళతో చూస్తున్న వ్యక్తి వెంటనే టెన్షన్తో ఫోన్ ఎత్తారు....అవతల ఫోన్ చేసే వ్యక్తి...సార్...మనం సాధించాం' అనగానే, 'గాడ్ బ్లెస్ యు' అని ఫోన్ దగ్గర ఉన్న వ్యక్తి గట్టిగా అరిచారు... వెంటనే డైనింగ్ టేబుల్ దగ్గర ఉన్న పెద్ద మనుషుల దగ్గరకు వెళ్ళి విషయం చెప్పారు...అంతే... వారి ఆకలి తీరింది...ఆ ఆనందంలో ఏమీ మాట్లాడలేదు.... వాళ్ల కళ్ళల్లో ఆనంద భాష్పాలు....కొద్ది సేపైన తరువాత అందరూ సంతోషంగా నవ్వుకున్నారు......!

ఇదంతా ఓ కథలా ఉంది కదా...!

కథకాదు...వాస్తవం...ప్రపంచంలో మనదేశాన్ని గగన వీధుల్లో నిలబెట్టిన కథ...కాదు...నిజం...!!!

ఆ రోజు.... 11, మే 1998..! సమయం మధ్యాహ్నం 03:45

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న పెద్ద మనిషి ప్రధాన మంత్రి వాజ్‌పేయి..!

మిగిలిన నలుగురు క్యాబినెట్ మంత్రులు లాల్ కృష్ణ అద్వాణీ, జార్జ్ ఫెర్నాండెజ్, యశ్వంత్ సిన్హా, జస్వంత్ సింగ్...!

ఫోన్ దగ్గర వెయిట్ చేస్తున్న వ్యక్తి బ్రజేశ్ మిశ్రా..!

అవతలి నుండి ఫోన్ చేసిన వ్యక్తి అబ్దుల్ కలాం...!

ఫోన్ చేసిన ప్రదేశం...పోఖ్రాన్...!

వాళ్ళు విన్న వార్త మన దేశం చేసిన అణు పరీక్ష ...విజయవంతం అయింద ని..!

పోఖ్రాన్ II పరీక్షలు మే11, 1998లో పోఖ్రాన్ వద్ద భారతదేశం నిర్వహించిన ఐదు అణు బాంబు పరీక్ష పేలుళ్ల శ్రేణి. భారతదేశం నిర్వహించిన అణు పరీక్షలలో రెండవది. మొదటి పరీక్ష స్మైలింగ్ బుద్ధ అనే కోడ్ పేరుతో మే 1974లో నిర్వహించబడింది.

పోఖ్రాన్ II ఐదు పేలుళ్లను కలిగి ఉంది. వాటిలో మొదటిది కేంద్రక సంలీనం, మిగిలిన నాలుగు కేంద్రక విచ్ఛిత్తి బాంబులు. ఒక కేంద్రకసంలీనం, రెండు కేంద్రక విచ్ఛిత్తి బాంబుల విస్ఫోటనంతో 11, మే 1998న ఆపరేషన్ శక్తి అనే కోడ్ పేరుతో పరీక్షలు ప్రారంభించబడ్డాయి. 13, మే 1998న రెండు అదనపు కేంద్రక విచ్ఛిత్తి పరీక్షలు చేయబడ్డాయి. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశాన్ని పూర్తిస్థాయి అణుదేశంగా ప్రకటించారు. ఈ పరీక్షల ఫలితంగా జపాన్ యునైటెడ్ స్టేట్స్‌తో సహా అనేక ప్రధాన దేశాలు భారతదేశానికి వ్యతిరేకంగా అనేక రకాల ఆంక్షలు విధించాయి.

**నాటకీయ పరిణామాలు:** అణు పరీక్ష కొరకు అప్పటి ప్రధాని వాజ్‌పేయికి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం క్షిపణి కార్యక్రమం యొక్క స్థితిని, ఆర్. చిదంబరం అణు కార్యక్రమం గురించి విస్తృతంగా వివరించారు. ఇతర డిఎఇ అధికారుల మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. 28, మార్చి 1998న ప్రధాని వాజ్‌పేయి వీలైనంత తక్కువ సమయంలో సన్నాహాలు చేయాలని శాస్త్రవేత్తలను కోరారు. చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్ కలాం , డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ డైరెక్టర్ డాక్టర్ చిదంబరం ఈ పరీక్ష ప్రణాళికకు ముఖ్య సమన్వయకర్తలుగా ఉన్నారు. విస్ఫోటనం ప్రక్రియలో సీనియర్ శాస్త్రవేత్తల చిన్న సమూహం పాల్గొంది. పరీక్షల గోప్యతను కాపాడేందుకు శాస్త్రవేత్తలందరూ ఆర్మీ యూనిఫారాలు ధరించాలని ఆదేశించారు. 1995 నుండి 58వ ఇంజనీర్ రెజిమెంట్ అమెరికా గూఢచారి ఉపగ్రహాలకు తెలియకుండా పని పూర్తయ్యే బాధ్యతలను తీసుకొంది. అనుమానం రాకుండా అందరూ సైనిక దుస్తులు ధరించారు.

మే 11
జాతీయ సాంకేతిక దినోత్సవం

**దేశం మొత్తం జేజేలు:**
పోఖ్రాన్ – II సిరీస్‌లో ఆయుధం కలిగిన న్యూక్లియర్ వార్‌హెడ్‌లను పరీక్షించి, న్యూక్లియర్ క్లబ్‌లో చేరిన ఆరవ దేశంగా భారత్ అవతరించింది. పరీక్షలకు సంబంధించిన వార్తలు భారతదేశంలోని సమాజం ద్వారా ఆనందోత్సాహాలతో పెద్దఎత్తున ఆమోదంతో స్వాగతించబడ్డాయి.

**జాతీయ సాంకేతిక దినోత్సవం:**
మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చారిత్రాత్మక పోఖ్రాన్ జ్ఞాపకార్థం మే 11ని భారతదేశంలో జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించారు.

జనక మోహన రావు దుంగ
8247045230

### జై టెక్నోక్రాట్ – డిజిటల్ యుగం:
జాతీయ సాంకేతిక విజ్ఞానశాస్త్ర దినం వేదికగా శాస్త్రజ్ఞులు మరియు సాంకేతిక నిపుణుల సేవలను సముచితంగా గుర్తించడం, విద్యాలయాల్లో అవగాహన/ సదస్సులు/ కార్యశాలలు/సైన్స్ ప్రదర్శనలు/ చర్చలు/వ్యాస రచనలు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం, యువతలో శాస్త్రసాంకేతికశాస్త్రాల పట్ల ఆసక్తిని కలిగించడం, ఆసక్తికర పోటీల నిర్వహణ లాంటి పలు కార్యక్రమాలను చేపట్టుట జరుగుతుంది. ఇదే రోజున విద్యార్థులు సమీప వైజ్ఞానిక ప్రదర్శనశాలలను సందర్శించడం జరుగుతుంది. ప్రపంచ మానవాళి కరోనా విష కోరల్ని పీకడానికి శాస్త్రసాంకేతిక నిపుణుల వైపు సామాన్య జనం వేయి కళ్ళతో ఎదురు చూసి సఫలీకృతం అయ్యారు. వైజ్ఞానికశాస్త్రం, గణితశాస్త్రం, ఇంజనీరింగ్, సాంకేతిక విజ్ఞానశాస్త్రం (యస్‌టిఈయం) మేలు కలయికగా ప్రపంచదేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించడంతో సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు ఆసాంతం పెరగడం జరుగుతున్నది. నేడు శాస్త్రసాంకేతిక రంగం ప్రమేయంతో పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య రక్షణ, వినోదం, దేశ భద్రత, ఆహార సేవలు, కృత్రిమ మేధ, ఆటోమేషన్ లాంటి అన్ని రంగాల్లో అడుగిడి మానవాళి సరళ జీవనానికి పటిష్ట పునాదులు వేస్తున్నది.

### పెరుగుతున్న ఇంటర్నెట్, సెల్‌ఫోన్ వినియోగం:
శాస్త్రసాంకేతిక విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా 5.44 బిలియన్లు (67 శాతం), ఇండియాలో 75 కోట్ల (53 శాతం) ప్రజలు ఇంటర్నెట్ వాడుతూ, రోజుకు 2.52 లక్షల నూతన వెబ్‌సైట్లు వరకు ఏర్పాటు చేయబడుతున్నా యి. రేడియో వాడకం 50 మిలియన్ల శ్రోతలకు చేరడానికి నాలుగు దశాబ్దాల సమయం పట్టగా, అదే సంఖ్యలో ఇంటర్నెట్ వాడకానికి నాలుగు సంవత్సరాలు మాత్రమే తీసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. మనిషి తన సగటు జీవితం కాలంలో 10 ఏండ్లు టివి చూడడానికే వినియోగిస్తున్నాడని అంచనా వేశారు.

స్మార్ట్ ఫోన్ల వాడకం ప్రతి ఇంటిలో కనీస అవసరం అయ్యింది, శరీరంలో మరో అంగం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా 91 శాతం (7.33 బిలియన్లు) జనాభా ఫోన్లు వాడుతున్నారని, ఇండియాలో 73శాతం జనాభా సెల్ ఫోన్ సౌకర్యాన్ని కలిగి ఉన్నారని, 76 కోట్ల స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. రేడియో కూడా విలాసవంతమైన ఎలక్ట్రానిక్ ఉపకరమని భావించిన రోజుల నుంచి గత 3 4 దశాబ్దాల్లో ఇంటింటికీ టివి, స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యాలు సాధారణం అయ్యాయి. సామాన్యులు అసాధ్యమనుకున్న విమానయానం అందరికీ అందుబాటులోకి వస్తున్నది. ఈకామర్స్‌తో ఇంట్లో కూర్చొని అన్ని వస్తువులు ఖరీదు చేయగలుగుతున్నాం. నాగలి అంతరించి, ట్రాక్టర్ అవతరించడం చూస్తుండగానే జరిగిపోయింది.

## విధ్యార్థి, యువకుల కోసం ఏమీ చేయని బిజెపికి ఓటు వద్దు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్‌కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేంద ర్‌రావును భారీ మెజా ర్టీతో గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి పిలుపుని చ్చారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ నగర్‌లో ఇండియా కూటమి ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఇంటింటికీ తిరిగి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిం చారు. ఈ సంధర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ గత 5 సంవత్సరా లుగా ఎంపిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ విద్యార్థి, యువతకు చేసిం దేమీ లేదన్నారు. యువతకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని, తెలంగాణకి విద్యాసంస్థలు కేటాయించాలని పార్లమెంటులో మాట్లాడని బండి సంజయ్‌ను ఈ ఎన్నికల్లో విద్యార్థి యువత ఓడించాలని, ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించా లని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామారావు వెంకటేష్, రేణుకుంట్ల ప్రీతం, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రావణ్, రాజేష్, సాయి, రాహుల్ నాని, అజయ్, నవీన్ తదితరులున్నారు.

## రఘువీర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఖాయం



ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెర్వు)ః సిపిఐ బలప ర్చిన నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన కోరారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కుందూరు రఘువీర్డ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ శుక్రవారం సిపిఐ మం డల కమిటీ సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీలను ఓడించాలన్నారు.రఘువీర్‌రెడ్డి విజయానికి సిపిఐ నాయకులు,కార్యకర్తలు పని చేయా లన్నారు.సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సారెడ్డి పాపిరెడ్డి,జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్య క్షురాలు ఉప్పతల కోటమ్మ, శాఖ కార్యదర్శి యలమంద, గొంగరెడ్డి భద్రా రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

## సిపిఐలోకి చేరికలు



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాల బిఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీని వీడి శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి సమక్షంలో సిపిఐ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామశాఖ కార్యదర్శి పల్లా రంగారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కిన్నెర యాదయ్య, వలమల్ల ఆంజనేయులు, నాయ కులు కాటం గోవర్ధన్, ఉడుత జంగయ్య, పల్లె కృష్ణయ్య, దాసరి రాములు, భారీములు, సంజీవ, రాజు, మహేష్, కృష్ణయ్య, బద్రి, రామకృష్ణ, సంజీవ రెడ్డి, పార్టీలో చేరిన వారిలో పల్లె నరేష్, పల్లె కృష్ణ, పల్లె ప్రసాద్, శ్రీను, ప్రశాంత్, మధు, ఇద్దయ్య, మహేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## ఇంటింటా సిపిఐ విస్తృత ప్రచారం



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రహ్మణపల్లి, సుద్దాల, అనంతారం, కొమ్మాయి పల్లి, లక్ష్మీ తండా గ్రామాలలో శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర మాట్లాడుతూ సిపిఐబలపరిచిన భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్‌అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమా ర్‌రెడ్డి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సూచించారు.సిపిఐ మం డల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, సత్యనారాయణ, స్వామి తది తరులు పాల్గొన్నారు.

## ఓటు ఎంతో విలువైనది




ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు.శుక్ర వారం ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వివిధ శాఖల సహకారంతో ఆర్డీవో ఆధ్వ ర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లను చేసిందన్నారు. బాధ్యతగల ప్రతి పౌరుడు పోలీస్ సెంటర్‌కు వెళ్లి ఓటును వినియోగించుకుని ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో తహసీల్దార్ నాగార్జున్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ ముత్తయ్య, ఎన్నెస్పీ ఏఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ః మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో డ్రైడే నిర్వహ ణలో భాగంగా మొక్కలకు అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంకతో కలసి నీరు పోశారు.కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండా లన్న, వర్షాలు పడాలన్న మొక్కల సంరక్షణ చేపట్టాలని సూచించారు. ఏవో సుదర్శన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ ప్రభంజనం




ప్రజాపక్షం/చొప్పదండిః యుపిఎస్సీ, ఎన్డీఏ శుక్రవారం వెలువరించిన పరీక్ష ఫలితాల్లో కరీంనగర్ జిల్లాలోని చొప్ప దండి మండల పరిధిలోని రుక్మాపూర్ సైనిక పాఠశాల ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. డిసెంబర్, జన వరి మాసంలో జరిగేటువంటి ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూకు ఎంపిక అయ్యా రని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్.లచ్చయ్య తెలిపారు. అర్హత పొందిన వి.అభిలాష్, ఆర్.సిద్ధార్థ, జి.వినయ్‌కుమార్, జె.నరసింహులు, ఎం.విష్ణువ ర్ధన్‌లను తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రటరీ సీతాలక్ష్మి, డైరెక్టర్ కె.సి.రావు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సి పాల్ సిహెచ్.లచ్చయ్య, ఓఎస్‌పి.ఎస్ శర్మ విద్యార్థులను ,వారి విజయాల వెనుక తోడుండి అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినం దించారు.

# రాజ్యాంగ రక్షణకోసమే కాంగ్రెస్ పోరాటం

### ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే



ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్)ః భారత రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశంలో జరగబోయే సార్వ త్రిక ఎన్నికల ద్వారా పోరాటం చేస్తుందని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. నల్లగొండ జిల్లా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నకిరేకల్ పట్టణంలో శాసనసభ్యులు వేముల వీరేశం నేతృత్వంలో శుక్రవారం 'జనజాతర' సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడవా లన్న లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికలలో పోటీ చేస్తుందని అందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ 400 సీట్లను బిజెపికి అందించాలని ప్రచారం చేస్తున్నా రని అన్నారు. బిజెపి మరో సారి కేంద్రంలో అధికారం లోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ రిజర్వేషన్లను రద్దు చేయాలన్న ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. కాగా కాంగ్రెస్ పార్టీ భారత రాజ్యాంగాన్ని పరిపూర్ణంగా రక్షి స్తుందని, దాని కోసం చివరి వరకు పోరాటం చేస్తుంద న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జనగణన, కులగణన చేపడుతుందన్నారు. తద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రిజర్వేషన్ల పెంపు చేపడుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు జిఎస్‌టిని ఎత్తివేస్తా మని, 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి నిరు ద్యోగులను ఆదుకుంటామన్నారు.

**'చందా దేదో - దందా లేలో'**

చందా దేదో దందా లేలో అన్న పద్ధతిలో బిజె పి పాలన కొనసాగుతుందని విమర్శించారు. దేశ సంప దను తమ ఆత్మీయ మిత్రులైన అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారని దుయ్యబట్టారు. ముందుగా వారి ఆస్థులపైకి ఈడి, ఐటి లను దాడి చేయించాలని సూచిం చారు. పది సంవత్సరాల బిజెపి పాలనలో ఆకలి చావు లు, నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయన్నారు. కాంగ్రెస్ ఖాతాలను దురుద్దేశ్య పూర్వకంగా రద్దు చేయించడానికి కుట్ర లు పన్నారని అన్నారు.భువనగిరి ఎంపిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సిగా తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఖర్గే అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నేతి విద్యాసాగర్, శాసనసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**సభకు రాని సిఎం రేవంత్‌రెడ్డి**

ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు పార్టీ ప్రకటించినప్పటికి మహబూబ్‌నగర్ జిల్లా పర్యట నలో ఉన్నందువలన రాలేకపోయారు. ఆయన వస్తా డన్న ఆశతో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు రేవంత్ రావడం లేదని నిరాశకు గురయ్యారు.

## 'బిజెపి, బిఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదు'



ప్రజాపక్షం/మునుగోడుః ఈ నెల 13 న తెలంగాణ వ్యాపితంగా జరు గుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బిఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మునుగోడు సిపిఐ కార్యా లయంలో జరిగిన మునుగోడు నియోజకవర్గ సమావేశం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నిరుద్యోగం అవినీతి పరిష్కరిం చకుండా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేటీకరణ చేస్తూ రైతు కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి ఈ దేశాన్ని ఆదానీ అంబానీలకు దేశ సంపదను దోచుపెడుతున్న కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చా లని ఎస్సీ ఎస్టీలకు బీసీ లకు అందుతున్న రిజర్వే షన్ ఎత్తివేసే కుట్ర బిజెపి పన్నుతున్నదని తెలంగా ణకు ఒక్క ప్రాజెక్టు కూడా జాతీయ హోదా కల్పించలేదని అన్నారు.టీఆర్ ఎస్ గత పది సంవత్సరాలుగా పరి పాలించి నల్లగొండ జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా ఎస్ఎల్బీసీ గాని డిండి ఎత్తిపోతల పథకం గాని పూర్తి చేయకుండా కాల యాపన చేసి ఇయాల ప్రజల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్ ను ఓడించాలని అన్నారు. ప్రజాస్వా మ్యాన్ని, లౌకికవాదాన్ని రక్షించే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి చేయి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఆర్ అంజచారి,గురుజ రామచంద్రం,జి గాలయ్య,ఎం రామలింగం,బి నర సింహ తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఎన్ సతీష్, భాస్కర్, పల్లె శేఖర్‌రెడ్డి, బిక్షం రెడ్డి, రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్య క్షులు బి సురేష్ తదితరులు పాల్గొ న్నారు.

## 'బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సాధ్యం'

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: బి ఆర్ఎస్‌తోనేఅభివృద్ధి,సంక్షేమం సాధ్య మని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీష్‌రెడ్డిఅన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామంలో నల్లగొండ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్, నాలుగు నెలల కాంగ్రెస్ పాల నకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తిం చారని అన్నారు. గత నాలుగేళ్లుగా దిగుబడిలో నల్లగొండ జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉంటే నేడు దిగుబడి రాక వెనుకబడిందన్నారు. దీనికి కార ణైన వారిని రైతులు గ్రహించాలని కోరారు. నల్లగొండ, భువనగిరిపార్ల మెంట్‌నియోజకవర్గాల్లో ఓడిపోతా మనే భయంతో కాంగ్రెస్ నేతలు జనా రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ బిఆర్ఎస్ నేతలను బెదిరింపు లకు పాల్పడడం దుర్మార్గమన్నారు. మోసకారి కాంగ్రెస్, బిజెపిపార్టీలను ఓడించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో బిఆర్ ఎస్ అభ్యర్థుల కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి, జడ్‌పిటిసి జీడి భిక్షం, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే నేతన్నలకు న్యాయం

### ఎం ఎల్ ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ప్రజాపక్షం /మునుగోడుః కాంగ్రెస్ పార్టీతోనే చేనేత నేతన్నలకు న్యాయం జరుగుతుందని మునుగోడు ఎమ్మెల్యే,భువనగిరి పార్ల మెంటు ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్ర వారం మునుగోడు మండల కేంద్రంలో తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో పద్మశాలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు సందర్భంగా చేనేత కార్మి కులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఉన్న చేనేత పథకాలను కొనసాగించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని అన్నారు.గత పది సంవత్సరాలుగా చేనేత కార్మికులను బిఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించలేదని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం 350 కోట్ల సహకార రుణాన్ని మాఫీ చేసిందని గుర్తు చేశారు.చేనేత కార్మికుల సమస్యలను పరి ష్కరించడంలో ముందుంటానని ప్రతి చేనేత కార్మికునికి నెలకు 15 నుంచి 20వేల రూపాయలు ఆర్థికంగా ఆదాయం వచ్చేలా ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోశిక యాదగిరి, కాం గ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస నేత,నియోజక వర్గం ఎన్నికల ఇన్చార్జ్ సంధ్యారెడ్డి, అధికార ప్రతినిధి నారబో యిన రవి, జక్కల ఐలయ్య యాదవ్,అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పోలగొని సత్యం,జాల ఎంకన్న పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

### కాంగ్రెస్ జిల్లా నాయకులు మేకల రమేష్



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : ఎంతో చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కి ఏ పార్టీ పోటీ కాదని కాంగ్రెస్ పార్టీ తోనే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతాయని పార్టీ జిల్లా నాయకులు మేకల రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచా రంలో భాగంగా సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురంలో శుక్రవారం ఎస్సీ కాలనీలో ఆయన ఇంటిం టి ప్రచారం నిర్వహించారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకై కార్యకర్తలుకృషి చేయాలని సూచించారు. ఆయన మాట్లా డుతూబడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పెడచెవిన పెట్టి మాయమాటలతో కాలం వెళ్ళదీసిందని ఆరోపించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని చేతి గుర్తుకు ఓటు వేసి అత్య ధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. దుబ్బాక నర సింహ, మేకల యాదగిరి, మెరుగు లింగస్వామి,లింగం పల్లి రమేష్, వెంకన్న, జంగయ్య, జలంధర్, మేకల కరు ణాకర్, పల్ల జంగయ్య ఉన్నారు.

## ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు

### మాజీ మంత్రి పువ్వాడ

ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ : తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చి వారి గ్రామాలను వారే పాలించుకునే విధంగా వెసులుబాటు కల్పించిన ఘనత కేసిఆర్ దేనని మాజీ మంత్రి పువ్వాడ అజ య్‌కుమార్ తెలిపారు. ఖమ్మం పార్లమెంటు బిఆర్ ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాం క్షిస్తూ శుక్రవారం రఘునాథపాలెం మండల పరిధి లోని చింతగుర్తి, కొర్లబోడుతండా, రాంక్యాతండా గ్రామాలలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాలలో కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పువ్వాడ అజయ్‌కుమార్ ఓట్లు అభ్యర్థించారు. పువ్వాడ మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయితీలుగా తీర్చిదిద్ది గిరిజనులే పాలన సాగించుకునేలా అవకాశం కల్పించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షే మమే ధ్యేయంగా పాలన సాగించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామలు, సాగు, తాగునీరు, పింఛన్లు, రైతుబంధు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత బిఆ ర్ఎస్‌దే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇ బ్బందులు పడుతున్నారన్నారు. కరెంటు సమస్యలు మళ్లీ మొదటికొచ్చాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలే దన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజ్మీర వీరునాయక్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మద్దినేని వెంకటర మణ, మాజీ సర్పంచులు మెంటెం రామారావు, అమాలీ, పద్మ, మాజీ ఎంపిపి శాంత, మాజీ ఉపస ర్పంచ్ సురేష్, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, తారా చంద్, సీతారాం, పెంట్యా, దేవా, మీటు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికలకు సర్వం సిద్ధం

### జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన

ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ పార్లమెంటు స్థానానికి మే 13 న పోలింగ్ నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరి చందన తెలిపారు. శుక్రవారం అమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికలు, శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికపై ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పార్ల మెంట్ పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రం పరిధి లోని 100 మీటర్ల లోనికి వచ్చిన వాళ్లకి టోకెన్లుఇచ్చి ఓటువేయడానికి అవకాశం ఇస్తా మని తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుండి అన్ని అసెంబ్లీనియోజకవర్గాలకుఈవీఎంలను పంపించామన్నారు. అభ్యర్థులు ఈనెల 11న సాయంత్రం తమ ప్రచారాలను నిలి పివేయాలన్నారు.

**పట్టభద్రుల ఎన్నికల్లో 63 నామినేషన్లు చెల్లుబాటు**

నల్లగొండ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు ఈనెల 2న నుండి 9 వరకు నామినేషన్ల స్వీకరణ జరిగిందని. మొత్తం 69 మంది అభ్యర్థులు 117 సెట్ల నామి నేషన్ పత్రాలను సమర్పించగా, శుక్రవారం ఆరుగురు అభ్య ర్థుల నామినేషన్లు తిరస్కరించామన్నారు.ఈ నెల 13న 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని తెలిపారు.నల్లగొండ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం 12 జిల్లాలలో విస్తరించి ఉందని తెలిపారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఈ ఎన్నిక జరుగుతుందని మొత్తం 4.63 లక్షల ఓటర్లు 605 పోలింగ్ స్టేషన్లలో తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. జూన్ 5న కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.విలేకరుల సమా వేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సహాయ రిటర్నింగ్ అధికారి సిహెచ్ మహేందర్ జి, ఏ ఆర్ ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,సమాచార శాఖ అసి స్టెంట్ డైరెక్టర్ యు.వెంకటేశ్వర్లు,కోటేశ్వరరావు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్టే..

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు



ప్రజాపక్షం/అలంపూర్: ఇండియా కూటమి నాగర్ కర్నూల్ ఎంపి అభ్యర్థి మల్లు రవి గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు అన్నారు. అలంపూర్ మండ లంలో సిపిఐ ఆధ్వర్యంలో మల్లు రవిని గెలిపించాలని ప్రచా రం చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చు పెడుతూ, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, గత ఎన్ని కల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దేశ ప్రజలను మోసం చేసిన మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సిపిఐ అలంపూర్ నియోజకర్గ ఇంచార్జీ పెద్దబాబు, జిల్లా నాయకులు, సభ్యులు క్రిష్ణ, ఉరుకుందు, శంకర్, నాగార్జున, రాము బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూం చెంత భారీ భద్రత



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః ఎన్నికల విధుల్లో పాల్గొం టున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న పోస్ట ల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచేందుకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా స్వతి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ లోని ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను జిల్లా కలె క్టర్ పరిశీలించారు. సెయింట్ అల్ఫోన్స్ స్కూల్‌లోని ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం నుంచి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్‌రూంకు తరలించాలన్నారు. 24గంటల పాటు స్ట్రాంగ్ రూం వద్ద భద్రత ఉంటుందని చెప్పారు. కళాశా లలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## నల్లచట్టాలకు ఊతమిచ్చిన బిజెపిని ఓడిద్దాం

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్**



ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి: రైతు వ్యతిరేకిగా నల్ల చట్టాలకు ఊతమిచ్చి ప్రజా వ్యతిరేక విధా నాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓడించి మతతత్వ ఊబి నుంచి విముక్తి కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, పోచంపల్లి మం డల ఇంచార్జ్ బోడ సుదర్శన్ పిలుపునిచ్చారు. సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం ఆయన పోచం పల్లిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా వ్యవసాయాలకు నల్లచట్టాలను తీసుకువచ్చి 725 మంది రైతులను చంపిన ఘనుడు అని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా లక్షల కోట్లు ఎగ్గొట్టే కార్పొరేట్ శక్తులకు నిన్న గాక మొన్న వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వంలో 1,50,000 కోట్ల రుణమాఫీ చేశారని ఎద్దేవ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విమానయానశాఖ టెలికాం శాఖ బ్యాం కింగ్ రంగాలను ప్రైవేటుపరం చేసిందనీ గుర్తు చేశారు. చివరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల కంటే లాభాల్లో నడుస్తున్న ఎల్ఐసిని కూడా ప్రైవే టుపరం చేయడానికి ప్రయత్నం చేస్తుందని ప్రజ లు మేలుకోవాలని పిలుపునిచ్చారు. చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్ జెండా ఎగర వేయాలని సిపిఐ పార్టీ పిలుపునిచ్చింది. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి గోదల్ల భూషణ్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు యాదయ్య, సిపిఐ మండల కార్యదర్శి మాజీ ఇంద్రియాల ఎంపీటీసీ భీమగాని నర సింహ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణ మూర్తి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు భారత లవకు మార్, సిపిఐ సహాయ కార్యదర్శి మునునూరి రాములు, రైతు సంఘం నాయకులు సుర్కంటి సాయిరెడ్డి, గణేష్, గుర్రు బాలయ్య, కంసాలి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని ఓడిద్దాం..ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

### సిపిఐ కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః దేశంలో ప్రజా స్వామ్యం పరిరక్షణ కావాలంటే రిజర్వేషన్లు ఉండా లంటే బిజెపిని ఓడించాలని, ఇండియా కూటమిని గెలి పించాలని కరీంనగర్ ఎంపిగా ఉన్న బండి సంజయ్ ప్రజలకు చేసిందేమీ లేదని, మే 13న జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని సిపిఐ కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్ర వారం కరీంనగర్ మండలం బొమ్మకల్, నగునూర్ గ్రామాలలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేంద ర్‌రావుతో కలిసి ప్రచారంలో సిపిఐ శ్రేణులు పాల్గొ న్నారు. ఈ సంధర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించి, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు అధికంగా పెంచి ప్రజలపై పెను భారం మోపిందన్నారు. మోదీ ప్రభుత్వం జిఎస్టీల పేరుతో పేదల నుంచి దోపిడీ చేస్తూ కార్పోరేట్లకు దోచి పెట్టిందని, మోదీ పదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచలేదని, తెలంగాణకు చేసిందేమీ లేద న్నారు. తెలంగాణ విభజన హామీలను అమలు చేయలే దని, తెలంగాణ బిజెపి ఎంపిలు రాష్ట్ర సమస్యలపై పార్ల మెంటులో ప్రస్తావించలేదన్నారు. బండి సంజయ్ కరీం నగర్ ఎంపిగా ఒక్క రోజు పదవికి న్యాయం చేయలేద న్నారు. ఎంపిగా ఉన్నా కార్పోరేటర్ మాదిరిగానే వ్యవ హరించారన్నారు. గల్లీలో మాట్లాడుతూ ఢిల్లీలో సమ స్యలపై పార్లమెంటులో గొంతెత్తలేదన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే అవ కాశం ఉందని, రిజర్వేషన్లు పేద మధ్యతరగతి అట్ట డుగు వర్గాల ప్రజలకు అందాలంటే దేశంలో ఇండియా కూటమి గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రజలు కరీంనగర్లో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని పిలుపునిచ్చారు.

## 'ఉపాధి' రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపిద్దాం



ప్రజాపక్షం/భువనగిరి రూరల్: గ్రామీణ ఉపా ధి హామీ చట్టం రక్ష ణకై కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. భువనగిరి మండలంలోని కూనూరు లో ఉపాధిహామీ పని ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ పార్ల మెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు ఏశాల అశోక్ పిలుపునిచ్చారు. 60 మంది పార్ల మెంట్ సభ్యుల మద్దతుతో పార్లమెంటులో ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చామని, ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. సిపిఐ కార్యదర్శి మరి పెల్లి రాములు వీరస్వామి, ఉపాధి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధిక మెజారిటీతో విజయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు



**ప్రజాపక్షం/వాజేడు:** సిపిఐ, కాంగ్రెస్ పొత్తులో భాగంగా మహబూబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వాజేడు మండలం ధర్మారం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలకు కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తోట మల్లికార్జునరావు మాట్లాడుతూ బిజెపి చేస్తున్న మతోన్మాద ప్రచారాలను తిప్పి కొట్టాలని, చేసిన హామీలను అమలు పరచకుండా మభ్య పెడుతుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తానని మభ్య పెట్టింది. మూడు నల్ల చట్టాలను అమలు పరిచి వాటివల్ల అనేక రైతులను ఇబ్బంది పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సిపిఐ నాయకులు ఆచంటి ప్రసాద్, బట్టి సంతోష్,శ్రీను,రాంబాబు,రమేష్,తదితరులు ఉన్నారు.

## చామల విజయానికి సిపిఐ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరన్‌కుమార్‌రెడ్డి గెలుపు కాంక్షిస్తూ శుక్రవారం సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వయించారు. సిపిఐ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్, బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ర్యాలీ జరిగింది. ర్యాలీని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న ప్రారంభించారు. ర్యాలీలో టిపిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ కంచె రాములు, జాయ మల్లేశం పాల్గొని సంఫీుభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆది సాయన్న మాట్లాడుతూ దేశంలో మోదీ పీడ విరగడవ్వాలంటే భువనగిరిలో చామల కిరన్‌కుమార్‌రెడ్డి గెలుపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళంపల్లి జనార్దన్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, కేమిడి మలయల్య, మేటే శ్రీశైలం, నగేష్, మల్లేశం, గుర్రం మదు, బూమండ్ల ఐలయ్య, బూడిగ వీరస్వామి, యాకయ్య, పుప్పాల ఐలయ్య, ఎం సుదర్శన్, సిహెచ్ శంకర్, వెంకటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మతతత్వ రాజకీయాలకు బుద్ధి చెప్పాలి



**ప్రజాపక్షం/కేసముద్రం** : బిజెపి మతతత్వ రాజకీయాలకు బుద్ధి చెప్పాలని సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహమూద్ పట్నం మూల స్తంభం, తౌర్య తండాలలో సిపిఐ బలపరిచిన మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపునకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పరి శేఖర్, మంద భాస్కర్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి సర్కార్ 10సంవత్సరాల పాలనలో మతాల పేరుతో, కులాల పేరుతో ఘర్షణలు సృష్టించి దాడుల కు పాల్పడింది తప్పా ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజాసంపద, జాతీయ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించింది. దేశ రక్షణ కోసం, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ పరిరక్షణ కోసం, కార్మిక చట్టాల అమలు కోసం సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ని గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు కాసు సాయి చరణ్, ఎస్కే ఇమామ్, చక్రు, సోమల తదితరులు పాల్గొన్నారు.

## మోదీని చిత్తుగా ఓడించాలి

### కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య



**ప్రజాపక్షం/చిట్యాల:** బిజెపి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని బడుగు బలహీన వర్గాల ప్రజల ఇంటి దీపమైన కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ కలిసి చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య అన్నారు. శుక్రవారం దళిత కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొట్ల రవి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కృష్ణయ్య కాంగ్రెస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఓరం సమ్మయ్యలు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ నిరంకుశ పాలనను పాతరేయ్యాలని రాజ్యాంగ రిజర్వేషన్లను కాపాడుకోవాలని ఎ స్సీ బీసీ మైనార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న బిజెపి పార్టీని దేశము నుండి తరిమి కొట్టాలని వారు మండిపడ్డారు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని మోడీని సిత్తుగా ఓడించి మనువాదాన్ని తరిమికొట్టాలని కోరారు భారత దేశంలో బిజెపి పార్టీ ఆర్‌ఎస్ఎస్ బజరంగ్దళ్ సిద్ధాంతాలను అవలంబిస్తూ రిజర్వేషన్లలో దేశాన్ని నిలువునా నాశనం చేసే అవకాశం ఉందని రోజురోజుకు బిజెపి ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని మణిపూర్ దారుణం దళిత యువతులపై దుర్మార్గపు చర్యలకు పాల్పడుతూ ఎన్నో అరాచకాలు చేసిన రాబందు ఒకే గాలివానకు కూలిపోయిన సందంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అంతం తప్పదని వారు హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ సామాజిక ఉద్యమ నేత నుండి రాజకీయ నేతగా రూపం తరం చెందాడు మాదిగలను మోసం చేసి బిజెపిలో చేరి మాదిగలకు మనగడ లేకుండా చేస్తున్నాడని మాదిగలు గమనించి బిజెపిని ఓడించాలని కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఇన్చార్జ్ ఏకు రవీందర్,కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, చిట్యాల ఎంపిటిసి దబ్బెట అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్, కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు పాల్గొన్నారు.

## హామీలు మరిచిన పాలకవర్గాలు

### ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** బిజెపి అధికారంలోకి వచ్చాక విభజన హామీలను ఏఒక్కటి అమలు చేయకపోగా, గిరిజన యూనివర్సిటి ని పేరు ప్రకటించిన ఎలాంటి అభివృద్ధి నిధులు వెచ్చించకుండా సవతిప్రేమ ఆదివాసి గిరిజన గూడాలపై చూపిస్తుందని ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటి చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాల ఉమ్మడి అభ్యర్థి చందా లింగయ్యకు ఎంసిపిఐ(యూ), బహుజన లెఫ్ట్ ఫ్రంట్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు కవచం 1/70 చట్టమని, ఆచట్టాన్ని పూర్తిగా రద్దు చేసే కుట్ర చేస్తుందన్నారు. అడవి సంపదను కార్పొరేట్ సంపన్న వర్గాలకు దారదత్తం చేస్తుందని విమర్శించారు. గిరిజన ప్రజలపై తప్పుడు కేసులు పెట్టిందని విమర్శించారు. నాయకులు గోనె కుమారస్వామి, నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, కన్నం వెంకన్న, మహ్మద్ రాజా సాహెబ్, రాజమౌళి, కేశెట్టి సదానందం, జన్ను రమేష్, మార్త నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కవిత విడుదల కోసమే.. బిఆర్‌ఎస్, బిజెపి కుమ్మక్కు

### రాష్ట్ర ఆటవి, దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఓటేస్తే.. కెసిఆర్ ఎంపిలను అమ్ముకుంటాడని.. ఎంఎల్‌సి కవిత విడుదల కోసమే బిఆర్‌ఎస్, బిజెపిలు కుమ్మక్కైనారని రాష్ట్ర ఆటవి, దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ ఆరోపించారు. బిఆర్‌ఎస్‌ను ప్రజలు గద్దె దింపిన కూడా మాజీ సిఎం కెసిఆర్ కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలను బూతులను తిడుతూ రెచ్చగొడుతున్నారన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అందరి బతుకులు బాగుపడుతాయన్నారు. సిద్దిపేట నియోజక వర్గం పరిధిలోని ఎన్సాన్‌పల్లి, పుల్లూరు, నారాయణరావుపేట, చిన్నకోడురు, నంగునూరు మండల కేంద్రాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. బిఆర్‌ఎస్, బిజెపి నాయకుల మాయమాటలు ఎటిట పరిస్థితుల్లో నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాకముందే ఎన్నికల్లో హామీలను ప్రజలను విమర్శిస్తున్నారన్నారు. ఇప్పటికే తాము ఆరుగ్యారంటీలో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. ఆగస్టు 15న రైతులను రెండు లక్షల రుణమాఫీ సిఎం రేవంత్‌రెడ్డి వందశాతం చేస్తారన్నారు. సిద్దిపేట ఎంఎల్‌ఎ హరీష్‌రావు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయకుంటే రాజీనామా చేస్తారా.. చేస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ చేశారన్నారు. ఆగస్టు 15న హరీష్‌రావు రాజీనామ లేఖతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హరీహష్ రావు ప్రతిపక్ష పార్టీలకు ఏజెంట్లు సైతం లేకుండ భయపెట్టిన సందర్భాలున్నాయన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని,. ఇక నీ ఆటలు సాగవన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు దైర్యంగా ఉండి ప్రచారం చేసి పేదింటి బిడ్డనుభారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. వడ్డెర సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. బిజెపికి ఓటేస్తే మోదీ కార్పొరేట్ల చేతిలో దేశాన్ని పెడుతాడని విమర్శించారు. బిజెపి నాయకులు దేవుని పేరుతో రాజకీయం చేస్తూ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారన్నారు. పంచాయతీ నుండి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ప్రతి ఒక్కరి కష్టసుఖాలు తెలుసునని కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు అన్నారు. తనను ఎంపిగా గెలిపిస్తే నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ప్రజాసేవ చేసేందుకు ముందుకు వస్తున్న తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట నియోజక వర్గంలో ఎన్సాన్‌పల్లి. పుల్లూరు, చిన్నకోడురు, నారాయణరావుపేట, నంగునూర్ మండలాల్లో పర్యటించిన మంత్రి కొండ సురేఖ, ఎంపి అభ్యర్థి నీల మధుకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొండ సురేఖ, ఎంపి అభ్యర్థి నీలం మధు ర్యాలీలో పాదయాత్ర చేపట్టి ఓటర్లను కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ న నాయకులు తాడురి శ్రీనివాస్‌గౌడ్, పూజల హరికృష్ణ, తిరుపతిరెడ్డి, మార్క సతీష్, అత్తుఇమామ్, ముద్దం లక్ష్మి , వంగరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విలువైన ఇసుకను అక్రమంగా తవ్వేశారు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం:** కోట్ల విలువైన ఇసుక ను అక్రమంగా అక్రమార్కులతో కుమ్మక్కై అడ్డగోలు తవ్వకాలకు తెలనొప్పి దన్నుగా నిలుస్తోంది. ఇసుక సురులు కుల్ల పొడి చేశారు. ఏటూర్ నాగారం మండలంలోని మానసపల్లి పట్టా ల్యాండ్ల పేరుతో గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ దందా అవినీతి బాగోతం అధికారుల సాక్షిగా వెలుగు చూసిన నిజా లు, నిబంధనలు అతిక్రమించి నది గర్భంలో లోతుగా భారీ యంత్రాలతో ఇసుకను తీయడం ద్వారా భూగర్భ జలాలు బయటికి వచ్చి చెరువులను తలపిస్తున్నాయి. అడ్డగోలుగా తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. త్రాగునీరు, సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీజినల్ వరంగల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల సాక్షిగా అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలో ఇసుక కాంట్రాక్టర్లు భారీ యంత్రాలతో నిబంధనలు ఉల్లంఘించి టన్నుల కొద్ది ఇసుక రోజువారీగా తరలిస్తూ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు అక్రమ తవ్వకాల బాగోతం బట్టబయలైంది. దీంతో టిఎస్ఎండిసి అధికారులు ఏం జరుగుతుందోనని గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇసుకను ఇస్తారా తవ్వి వేయడం వల్ల నదీ ప్రవాహంలో మార్పులు వస్తాయి దానివల్ల గోదావరి తీరంలో కోతకు గురై వర్షాకాలంలో ఆకస్మిక వరదలు ముంచెత్తి నివాసాలు పంట పొలాలు దెబ్బతింటాయి. ఇసుకను విచ్చలవిడిగా తవ్వేస్తే గోదావరి గర్భంలో లోతు పెరుగుతుంది. గోదావరి ముఖద్వారం వెడల్పు అవుతాయి దానివల్ల గోదావరి నది జలాల్లో ఉప్పొదనం పెరుగుతుంది. వాటిలో మలినాలు ఇబ్బడి ముబ్బడిగా పోగు బడతాయి. బార లోహాల సాంద్రత ఎక్కువ ప్రజలు ఆరోగ్యం గుల్ల బారుతుంది. గోదావరి నది గర్భం ఎండిపోతుంది దానివల్ల ఇసుక తిన్నలపై ఆధారపడి జీవించే స్థానిక వన్యప్రాణుల మునుగడ ప్రమాదంలో చిక్కుతుంది. గోదావరి నదుల్లోనూ జీవజాతుల ఆవాసాలు నాశనం అవుతాయి. మచ్చ ఉత్పత్తులపై దృష్టిబావం కనిపించి వాటిపై ఆధారపడి బ్రతికే ఎందరికో ఉపాధి దెబ్బతింటుంది.

### తప్పు కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో టిఎస్ఎండిసి అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా మనసపల్లి ఇసుక క్వారీలో భారీ యంత్రాలతో లోతుగా 10 .మీటర్ల లోతులో ఇసుక తవ్వకాలు జరపడంతో భూగర్భ జలాలు వాటర్ వచ్చి ఇసుక క్వారీలో చెరువును తలపిస్తున్నాయి. విజిలెన్స్ అధికారుల తనిఖీలో లోతులో తవ్వకాలు జరిపినట్లు నిర్ధారణ అయింది. క్వారీలో చెరువును తలపించే విధంగా వాటర్ ఏమిటని అధికారులు ప్రశ్నించడంతో తప్పును కపు పుచ్చుకునేందుకు టిఎస్ఎండిసి అధికారులు వర్షంపడటంతో నీరుచేరడంజరిగిందని కట్టుకదలు అల్లుతున్నారు.

### వర్షాకాలంలో వరదలు ముంచెత్తే ప్రమాదం ఉంది

ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వి వేయడం వల్ల నది ప్రవాహంలో మార్పులు వచ్చి గోదావరి కోతకు గురి అయి వర్షాకాలంలో ఆకస్మిక వరదలు ముంచెత్తి నివాసాలు పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే గతంలో రామన్నగూడెం. కొండాయి. గ్రామాలలో పట్టా భూముల పేరుతో ఇష్టం వచ్చినట్లు తవ్వకాలు జరపడంతో వర్షాకాలంలో గోదావరి కరకట్ట కోతకు గురి అయింది. దీంతో ఆయా గ్రామాలు జలమయమయ్యాయి. గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పట్టుకొని సహాయ కేంద్రాలకు పరుగులు తీశారు. గ్రామాలలో భారీగా నష్టం వాటిల్లింది. గత వర్షాకాలంలో ఏటుర్ నాగారం ప్రాంతం కూడా వరదలతో ముంచెత్తింది. మరల వర్షాకాలంలో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు గోదావరి పరిసర కర కట్ట ప్రాంతంలో ఇసుక క్వారీ లను రద్దు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నేనున్నా.. ధైర్యంగా ఉండండి

### మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/మహా ముత్తారం** : పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి శ్రీధ ర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, శుక్రవారం మహా ముత్తారం మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన జాడీ కీర్తి భాయ్ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ అ భ్యర్థి గడ్డం వంశీకృష్ణ వారితో పాటు కాంగ్రెస్ మండల నా యకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహా ముత్తారం మండల మ హిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సీనియర్ నాయకురాలు జాడి కీర్తి బాయి నిన్న సాయంత్రం ప్రమాదవశాత్తు మరణించగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు వారితో పాటు పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మా ట్లాడుతూ కీర్తి బాయి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు పార్టీ కోసం ఎనలేని సేవ చేశారని, కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకురాలుని కోల్పోయిందని ఆమె ఆత్మకి శాంతి చేకూరాలని, ఆ భగవంతున్ని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు మా కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ఎప్పటికీ అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడవద్దని అందరికీ నేనున్నానని తెలిపారు.

## బసవేశ్వరుడు అందరివాడు..

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కుల రహిత సమాజం కోసం కృషి చేసిన వ్యక్తి అని, బసవేశ్వరుడు అందరివాడు అని మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం బసవేశ్వరుని జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పొన్నాల వై జంక్షన్ వద్ద గల బసవేశ్వర స్వామి విగ్రహానికి లింగాయత్ సమాజంతో కలిసి హరీశ్‌రావు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోసం కృషి చేసి, ఆచరణలో అమలు చేసిన వ్యక్తి అని అన్నారు. సిద్దిపేటలో బసవేశ్వర భవన్ ఏర్పాటుకు నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి,లింగాయత్ అధ్యక్షుడు బావుపల్లి యాదగిరి,ఆకుల ప్రశాంత్,శివకుమార్, వీరేశం, లింగాయత్ సమాజ మహిళలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సంక్షేమం









### వరంగల్ ఎంపి అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని వరంగల్ ఎంపి అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలోనీ సుంధరయ్య నగర్‌లోని సిపిఎం గుడిసెవాసులతో నిర్వహించిన సమావేశ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, ఒక చెయ్యిని గెలిపించారని, మరో చెయ్యిని గెలిపిస్తే రెండు చేతుల చప్పట్ల శబ్దానికి అటు మోడీ ఇటు అరూరికి దిమ్మదిరిగాలన్నారు. మీ ఇంటి బిడ్డగా నిండు మనసుతో నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి రైతుల ఎరువుల సబ్సిడీలు ఎత్తివేసి ఆధాని, అబనీలకే కొమ్ము కాస్తూ వాళ్ళు చెప్పిన ధరలనే నిర్ణయిస్తున్నారన్నారు. మన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం కార్యదర్శి బందు సాయిలు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పాలకుర్తి నియోజకవర్గ సత్తా చాటాలి

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**రాయపర్తి:** వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి క డియం కావ్యను లక్ష్య మెజారిటీతో గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం మండలంలోని బంధనపల్లి, కొత్తూరు, సన్నూరు, వెంకటేశ్వరపల్లి గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపి ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ సత్తా చాటాలి లక్ష మెజారిటీ దిశగా కార్యకర్తలు పని చెయ్యాలనీ, డా, కడియం కావ్యకు అఖండ మెజారిటీ అందించి సీఎం రే వంత్ రెడ్డి కి బహుమతిగా అందిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు ఈదుల కంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్ రెంటాల, గోవర్ధన్ రెడ్డి, సిరికొండ కృష్ణారెడ్డి, ఈ రెడ్డి నర్సింహా రెడ్డి, ముద్ర బోయిన వెంకన్న,మందాటి సుదర్శన్ రెడ్డి, గుగులోతు శ్రీనివాస్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మునిత, వనజారాణి, తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్‌ను గెలిపించేందుకు కృషి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** కాంగ్రెస్, బిజెపి పార్టీలు మోసపూరిత పార్టీలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వర్ధన్నపేట మండలంలోని లక్ష్మీ గార్డెన్ లో వర్ధన్నపేట మండల అధ్యక్షులు తుల కుమారస్వామి, కార్యక్రమం నిర్వహించగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ అసెంబ్లీ స్పీకర్మధుసూదనా చారి పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎల్ఇడి తెరల పై ప్రదర్శించి ప్రజలకు వివరించారు. మరోసారి ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోగస్ మాటలకు ప్రజలు మోసపోవద్దని ఈ సందర్భంగా ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పిటిసి మార్గం బిక్షపతి, అన్ని గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపిని ఓడించాలి

### తుమ్మల వెంకట్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శ



**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :**ఏటూర్ నాగారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఎన్నికల ప్రణాళిక బుక్లెట్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ పరిపాలనలో గత పదేళ్లలో ప్రధానమైన నాలుగు మూల స్తంభాలైన లౌకికత్వం, ఆర్థిక స్వాలంబన, ప్రజాస్వా మ్యం, సామాజిక న్యాయం, ఫదరలిజం, దెబ్బతిని దేశంలో ప్రజాస్వామ్య విలువలు మంటకల్పి నిరంకుషత్వం పెరిగిపోయిందని ప్రశ్నించే గొంతులను దేశద్రోహుల పేరుతో అరెస్టు చేస్తుందని ఇటీవల న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రభీరపూ ర్కాయస్థ నుఅరెస్టు చేసిందని దేశంలో రాజ్యాంగాన్ని మార్చివేసి మనువా ద సిద్ధాంతం అమలు చేసే ప్రయత్నం చేస్తూ సనాతన సంప్రదాయాల పేర ఇతర మతాల మీద దాడి చేస్తూ దేశంలో మతసామ రహస్యాన్ని దెబ్బతిస్తుందనీ పేర్కొన్నారు. అంతే కాకుండా పబ్లిక్ రంగ సంస్థల ను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముచున్నదని పేర్కొన్నారు. దేశంలో వామపక్షాల బలం చేకూర్చాలని పార్లమెంటులో వామపక్షాల బలం పెరిగితే మత సామరస్యం కాపాడుతూ, విద్యలో ఆరు శాతం కేటాయిస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని, దేశంలో ప్రజా పంపిణీ వ్య వస్థ పటిష్టం చేసి 14 రకాల వస్తువులను ప్రజలకు అందిస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని, కనీస వేతనం 26000 ఇస్తామని, పబ్లి క్ రంగ సంస్థ లు కాపాడుతామని పేర్కొన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో సిపిఎం బలపరిచిన ఇండియా కూటమి అభ్య ర్థి పోరిక బలరాం నాయక్ ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి దావూద్, దుగ్గి చిరంజీవి, తోలెం క్రిష్టయ్య, చిటమ ట రమేష్, బాలోజు రమేష్, బోట కృష్ణ, నాయిని కిష్టయ్య పాల్గొన్నారు.

## వెంకట్రాంరెడ్డికి గుణపాఠం తప్పదు



**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు ప్యాకేజీలు ప్రకటించి అమలు చేయని ముంపు బాధితుల ఉసురు బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి తప్పకుండా తగులుతుందని డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి, గజ్వేల్ పట్టణంలో ఇంటింటిప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలు పక్కదారి పట్టగా, జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. 10 ఏళ్లు గడిచినప్పటికీ రింగురోడ్డు నిర్మాణం పూర్తి కాలేదని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని, చిన్న వర్షం పడిన ప్రధాన రోడ్లపై నీరు నిలుస్తుందని, ఇక వివిధ వార్డులలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని, హామీ ఇచ్చిన 5 వేల ఇళ్లు కట్టివ్వలేదని ఆరోపించారు. అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు అండగా నిలిచి, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నేతలు నక్క రేగొండ గౌడ్, నాయిని యాదగిరి, మొనగారి రాజు, రాములు గౌడ్, నర్సింలు, కృపానందం, చంద్రయ్య, లక్ష్మణ్, సురేష్, ప్రేమ్ కుమార్, నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయి బహుమతి

### విద్యార్థులకు ప్రత్యేక జ్యూరీ అవార్డు కళాశాల ప్రిన్సిపాల్ డా.సంజీవ్ దూబే

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలకు దేశంలోనే ప్రథమ స్థానం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సంజీవ్ దూబే తెలిపారు. బెంగుళూరులొ చదువుతున్న విద్యార్థులు ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ అతిపెద్ద ఇంజనీరింగ్ హ్యాకథాన్ టెక్జియం 2024 బెంగుళూరు నందు గురువారం నిర్వహించబడిన ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మొదటి స్థానం లభించిందని తెలిపారు. మొదటి బహుమతిగా పది లక్షల నగదు, ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించిందని అన్నారు. 2024 ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం భారతదేశపు అతిపెద్ద ఇన్నోవేషన్ ప్లాట్ఫారమ్ తన ఏడవ ఎడిషన్ను ముగించింది. ఎల్‌టిటిఎస్ యొక్క సరికొత్త బెంగళూరు క్యాంపస్లో జరిగిన వార్షిక సాంకేతిక పోటీలో దేశవ్యాప్తంగా 503 ఇంజనీరింగ్ కళాశాలల నుండి 36,765 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానంలో మొదటి విజేతలుగా పది లక్షలు బహుమతి, ప్రాజెక్ట్ ప్రత్యేక జ్యూరీ బహుమతి గెలుపొందారని సంతోషం వ్యక్తం చేశారు. 2016లో ప్రారంభించినప్పటి నుండి, టెక్జియం అనేది ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ ఎల్ టి టి ఎస్ ద్వారా నిర్వహించబడుతున్న అకాడెమియా ఇండస్ట్రీ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ హ్యాకథాన్గా అత్యంత ప్రజాదరణ పొందింది. ఈ ఏడాది పోటీలో విజేతలకు మొత్తం రూ 18 లక్షలకు పైగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె విష్ణు రాజు, సెక్రటరీ శ్రీ ఆదిత్య విశ్వం విజేతలైన విద్యార్థులను డిపార్ట్మెంట్లను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, డా॥ లక్ష్మీ ప్రసాద్, హెచ్ఓడిలు, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, అశోక్ రెడ్డి, సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/కోనరావుపేట :** బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని, దేవుడి పేరుతో రాముడి అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని మంగళ్లపల్లి, సుద్దాల, పల్లిమక్త, నాగారం, కనగర్తి, వెంకట్రావుపేట, కొండాపూర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను పక్కకు పెట్టినట్లు బిజెపిని కూడా పక్కన పెట్టాలని అన్నారు. 10సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ ఖజనాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి పోయారని ఆరోపించారు. ప్రధాన మంత్రి మోదీ నల్లధనాన్ని వెలికి తీసి ఒక్కొక్కరి ఖాతాల్లో 15లక్షల రూ.లు జమ చేస్తారని చెప్పి మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కష్టపడి ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, బాలరాజు, తాళ్లపల్లి ప్రభాకర్, నాయిని ప్రభాకర్ రెడ్డి, నందు గౌడ్, దొబ్బల మహేష్, మానుక సత్యం, మల్యాల మనోజ్, ఉప్పుల గంగయ్య, ఎర్రవెల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** లోక్‌సభ ఎన్నికలలో ఈ నెల 13న జరిగే పోలింగ్ లో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు స్వీప్ ఆక్టివిటీస్ లో భాగంగా చేపట్టిన 5కె రన్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్‌పి ప్రభాకర్ రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఈ హక్కును సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధికి పాటుపడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా కళాజాత ప్రదర్శన, ఇంటింటి ప్రచారం, వివిధ రకాల విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందని తెలిపారు. హోమ్ ఓటింగ్ ద్వారా ఆసిఫాబాద్‌లో వంద శాతం ఓటింగ్ సాధించామని సిర్పూర్‌లో కూడా సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి కుల, మత, వర్గ, ప్రాంతాల వివక్ష లేకుండా, ప్రలోభాలకు గురి కాకుండా పోలింగ్ రోజున నిస్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీ నం.1950, సివిజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దేశ అభ్యున్నతి కోసం బిజెపికి ఓటు వేయండి

ఎంపి అభ్యర్థి గోడం నాగేష్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండల కేంద్రంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్ పాల్గొని స్థానిక శాసనసభ్యులు రామారావు పటేల్ ఈ సంధర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని వైకుంఠధామాలు, విద్యుత్ వెలుగులు బిజెపి ప్రభుత్వ పథకాలే అని ఎటు చూసిన జనం తమ ఓటు బిజెపికేనని మద్దత్తు తెలుపుతు ప్రచారానికి మద్దత్తుగా నిలుస్తున్నారు. బిజెపి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ గత పది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి కళ్లకు కడుతూ ప్రచారాన్ని కొనసాగించారు. బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్. .అయోధ్య రామ మందిరం కు నరేంద్ర మోదీ కృషి చేశారని అన్నారు. దేశ ఉజ్వలమైన భవిష్యత్తు,అభ్యున్నతి కోసం మరో సారీ నరేంద్రమోదీ ప్రధాని చేయడమే లక్ష్యంగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సభ్యులు,మండల పార్టీ సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.



# అప్రజాస్వామిక పాలనను ప్రజలు ఓడించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** పదేళ్లుగా కేంద్రంలో మోదీ ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక పాలనను, అవినీతిని ప్రజలు ప్రశ్నించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చేడ్వాయి, పెంచికల్ పేట్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నిజమైన ఆకాంక్షలను ఎన్నికలలో ప్రచారంలోకి తీసుకురాకుండా బిజెపి నాయకులు ముఖ్యంగా దేశ ప్రధాని మోదీ ముస్లింలు, మంగళ సూత్రాలు లాంటి అంశాలను ప్రస్తావిస్తూ, చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. బెంగుళూర్‌లో బిజెపి భాగస్వామ్య పార్టీ నాయకుడు స్త్రీలపై జరిపిన అత్యాచారాలు జుగుప్సాకరంగా ఉన్నాయని, అలాంటి వ్యక్తికి మోదీ ప్రచారం చేయడం సిగ్గు చేటని అన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ చివరికి దేశ రక్షణకు సంబంధించిన రక్షణ రంగాన్ని కూడ ప్రైవేటీకరించాలనే మోదీ చేతుల్లో నుండి దేశాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దేశ భద్రత కాంగ్రెస్ తోనే సాధ్యం అని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి దేశంలో అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి నాయకులు శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మోదీ నియంతృత్వ పోకడలకి కళ్ళెం వేయాలి

**బెజ్జూర్:** దేశంలో మోదీ నియంతృత్వ పోకడలకి కల్లెం వేయాలని, సెక్యులరిజాన్ని కాపాడాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. శుక్రవారం బెజ్జూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మత ప్రతిపాదికన ఓట్లు అడుగుతోందని, బిజెపి నాయకులు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల దేశంలో మతకల్లోలాలు చెలరేగే అవకాశం ఉందని ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో ఆత్రం సుగుణక్కని గెలిపించాలన్నారు. బిఆర్ఎస్‌కి ఓటు వేసినా బిజెపికి వేసినట్టేనని ఈ రెండు పార్టీలు ప్రజలని మోసం చేస్తున్నాయన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో బిజెపి వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిరంజీవి, దివాకర్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



**ప్రజాపక్షం/కుంటాల :** కేంద్రంలో రానున్నది రాహుల్ గాంధీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి అన్నారు. మండలంలోని లింబా(బి) గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలోనే నియోజకవర్గంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు ఓటుతో తగిన గుణపాఠ చెప్పాలని పిలుపునిచ్చారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆగస్టు 15లోపు 2 లక్షల రుణమా ఫీ చేయడం జరుగుతుందన్నారు. మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు ఆశోక్, డిసిసిబి డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పక్షపాతి జువ్వాడి రత్నాకర్‌రావు

వర్ధంతి సభలో కర్ణాటక మంత్రి బోసురాజు




**ప్రజాపక్షం/కోరుట్ల :** మాజీ మంత్రి దివంగత నేత జువ్వాడి రత్నాకర్ రావు పేద ప్రజల పక్షపాతి అని కర్ణాటక రాష్ట్ర చిన్న తరహా నీటిపారుదల శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి బోసురాజు అన్నారు శుక్రవారం రోజు కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో జరిగిన రత్నాకర్ రావు నాలుగవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి జువాడి రత్నాకర్ రావు మాలాంటి ఎందరికో ఆదర్శప్రాయుడని పేద ప్రజలకు ఏ విధంగా సహాయ పడాలో ఆయన నుంచే నేర్చుకున్నామని అన్నారు. అంతకుముందు మాట్లాడిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వడి నరసింగ రావు తమ తండ్రి స్వర్గీయ రత్నాకర్ రావు అనుక్షణం పేద ప్రజల కోసం పరితపించేవారని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఇంకా ఎంతో అభివృద్ధి చేయాల్సింది ఉందని తాము తమ తండ్రి అడుగుజాడల్లో నడుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటకకు చెందిన శాసనసభ్యులు మంత్ర గౌడ, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొంతం రాజం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానంద చారి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం / గొల్లపల్లి:** ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఇచ్చిన గ్యారంటీలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఉపాధి హామీ కూలీని 200 నుండి 400 లకు పెంచుతామని ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కేంద్రంలో 10 సంవత్సరాలుగా బిజెపి అధికారంలో ఉండి నిత్యవసర వస్తువులపై, ఎరువులు పై అధిక ధరలు పెంచి సామాన్య ప్రజల మీద భారం మోపారు. అందుకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుంది అని అన్నారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పేద మహిళలకు ఏటా లక్ష రూపాయలు యువతకు 30 లక్షల ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది. ఆగస్టు 15 లోపల రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు అందుకే ఈరోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీని అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లయితే మేమిద్దరం కలిసి ధర్మపురి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, రేవెల్ల సత్యనారాయణ గౌడ్, నేరెళ్ల మహేష్, అనిల్, శంకరయ్య, సత్తయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉపాధి హామీ కూలీలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డికి మద్దతుగా సిపిఐ నాయకుల ప్రచారం



**ప్రజాపక్షం/కోరుట్ల :** లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా కోరుట్ల పట్టణం కాలేజీ గ్రౌండ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో జీవన్ రెడ్డినీ గెలిపించాలని సిపిఐ జిల్లా నాయకులు చెన్న విశ్వనాథం ఆధ్వర్యంలో ప్రచారం చేయడం జరిగింది. మార్నింగ్ వాకర్స్‌కి కరపత్రాలు పంపిణీ చేస్తూ జీవన్‌రెడిని గెలిపించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుతారి రాములు, చింతకింది గణేష్, ఎండి మౌలాన, వంశీ కృష్ణ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో శ్రీహరిరావు ప్రచారం



**ప్రజాపక్షం/మామడ :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మామడ మండలం పరిమండల్, పోన్కల్, పోతారం, కమల్కోట్, బందల ఖానాపూర్ గ్రామాలలో జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పరిమండల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలసి వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలిస్తే ఇచ్చిన ప్రతి హామీ అమలు అవుతుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు గాను ఐదు గ్యారంటీలను అమలు చేసిన విషయం గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఏర్పడితే 400 రూపాయలు ఇస్తామని అన్నారు. బిజెపి ప్రభుత్వం మళ్లి వస్తే రాజ్యాంగం తీసివేస్తారని అన్నారు. మే 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో ఆత్రం సుగుణ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కూచాడి శ్రీవారి రావుతోపాటు మండల పార్టీ అధ్యక్షులు భుజంగ శ్రీనివాస్ రెడ్డి,ఎంపీపీ అమృత జైసింగ్,జెడ్పిటీసీ సోనియా సంతోష్,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.వి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అనుమతులు లేని ట్రినిటీ డిగ్రీ కళాశాల పై చర్యలు తీసుకోవాలని, దోస్తు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతికి ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాల అనుమతులు పొందడానికి ముందుగా ఒక భవనాన్ని తీసుకొని, అనుమతులు పొందిన తర్వాత వేరే భవనంలో నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను కొనసాగిస్తున్నారని, ఈ యొక్క డిగ్రీ కళాశాలను వేరే భవనానికి తరలించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న ఇన్స్పెక్షన్ వచ్చే అధికారులు ముడుపులకు ఆశపడి ఆ కళాశాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, భవన తరలింపు అనుమతులు లేకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను కొనసాగిస్తున్నారని, ఇలాంటి నియమ నిబంధనలు పాటించని కళాశాలపై, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదే విధంగా అనుమతులు లేని కళాశాలకు దోస్తు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఆయన అన్నారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల తంగళ్లపల్లి వేములవాడ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని 03 కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ళలోని పోలింగ్ కేంద్రాలను, సిరిసిల్ల జూనియర్ కాలేజీలో, వేములవాడ జెడ్పీ పాఠశాల లో ఏర్పాటు చేసిన ఇవిఎం యంత్రాల స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా మాట్లాడారు. జిల్లాలోని సిరిసిల్ల వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుకు మౌలిక సదుపాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుకు అభ్యర్థుల గుర్తులు స్పష్టంగా కనపడే విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు గ్రామస్థాయి నుండి ఓటర్లుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద 24 /7 పోలీస్/ సీఆర్పీఎఫ్ భద్రతా దళాల పటిష్ట నిఘా ఉండాలని అన్నారు. సిసి కెమెరాలను, విజటర్స్, సిబ్బంది విధుల రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గముల పరిధిలో లోక్ సభ ఎన్నికల నిర్వహణకై చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అబ్జర్వర్‌కు వివరించారు. ముందుగా కలెక్టరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఎంసిఎంసి మీడియా సెంటర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్‌డిఓలు రమేష్, రాజేశ్వర్, డిపిఆర్‌ఓ వి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT AND SESSIONS JUDGE (MACT) ::

AT :: RAJANNA SIRICILLA

M.V.O.P. No. 52 of 2021

Between: -

Bayya Shiva Kumar and Others ... Petitioners

AND

S.A. Waheed @ Syed Abdul Waheed and Another ... Respondents

NOTICE

R-2 :- Police Department IGP PTO AP HYD, R/by DGP, R/o. Medchal, Hyderabad, Ranga Reddy District (Owner of the Eicher Mini Bus bearing No. AP-09-PB-1604).

Whereas, the above named petitioners filed the above M.V.O.P. U/s. 166 (1) (C) of M.V. Act, against you for grant of compensation on the account of death sustained to Bayya Padmaja, W/o. Bayya Shiva Kumar, in a motor vehicle accident. Take notice that the above O.P is posted on 13-06-2024, for your appearance and counter, and in case of your failure to appear in person or through an Advocate on the said date at 10.30 A.M. before the Hon'ble Prl. District and Sessions Judge at Rajanna Siricilla, Otherwise the matter will be decided in your absence.

(By the Order of Court)

Sd/- Velmula Ramana Reddy
B.Com., LL.B.
ADVOCATE
Flat No. 401, Kamala Pearl Apartment
Back Side of District Court, Jyothinagar,
KARIMNAGAR-505 001 (T.S.) INDIA
Dated: 10-05-2024, Cell: 9440070435,
Karimnagar. 9949032747.



FORMAT C-2

(For political party to publish in website,newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name of political party : Independent

Name of Election : GENERAL ELECTION TO LOKSABHA-2024

*Name of State/UT : TELANGANA STATE

| | 1 | 2 | 3 | 4 | | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No | Name of Constituency | Name of candidate | (A)Pending criminal cases | | (B) Details about cases of conviction for criminal offences | | |
| | | | Name of Court,case No. & status of the case(s) | Sections of the Acts concerned & brief description of offence(s) | Name of Court & date(s) of order(s) | Description of offence (s) & punishment imposed | Maximum Punishment Imposed |
| | 12-Nagar kurnool (SC) | Karne Shireesha | 197/2022 | 505(2) | N.A | N.A | N.A |

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India &Anr.)

Name and address of candidate : ANJAIAH VIRIGINENI
H.No. 3-182, Main Road,
Nidmanoor. Pin: 508278

Name of politicalparty : BAHUJAN SAMAJ PARTY

Name of Election : Lok Sabha General Election 2024

Name of Constituency : 13-NALGONDA

I, ANJAIAH VIRIGINENI, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A)Pending criminal cases

| Sl. No. | Name of Court | Case No. and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief descriptionof offence(s) |
|---|---|---|---|---|
| 1 | JFCM Nidmanoor, | CC 783/ 2021 | Pending | Section 143, 149, 353, 427 of IPC & Section 3 of the Prevention of Damage to Public Property Act (Unlawful assembly & wrongfully entered in Tehsildar office) |

(B) Details about cases of conviction for criminal offences

| Sl.No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

# రాజ్యాంగాన్నిమార్చే కుట్రదారులను తరిమికొట్టండి

## చాడ వెంకటరెడ్డి పిలుపు





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రదారులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ బలపరిచిన కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు చేతిగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తులబాబు ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. గడిచిన 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను 25 మంది సంపన్నవర్గాలకు దోచిపెట్టిందని ధ్వజమెత్తారు. దేశాన్ని పూర్తిగా విధ్వంసం చేసి ఇప్పుడు వికసిత్ భారత్ పేరుతో ఓట్లను అడగడం సిగ్గు చేటన్నారు. బిజెపి దేశంలో మూడోసారి గెలిపిస్తే కార్పొరేట్ రాజ్యాన్ని తీసుకువచ్చి మనువాద సిద్ధాంతాన్ని రాజ్యాంగంగా మార్చే ప్రమాదం పొంచి ఉండడమే కాకుండా ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మరో మారు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే దేశం అల్లకల్లోలంగా మారుతుందని, ముఖ్యంగా సామాన్య ప్రజలు దేశంలో జీవించే హక్కులు కోల్పోతారని, దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి గెలిస్తేనే దేశంలో సామాన్య ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. కరీంనగర్ పార్లమెంటులో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, బోయిని అశోక్, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపల్లి కిష్టయ్య, వేముల రమేష్, కంది రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సదానందం, హమ్మయ్య, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**చిగురుమామిడి :** సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావునే గెలిపించాలని చాడ వెంకటరెడ్డి కోరారు. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సంధర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సిపిఐ మద్దతిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు హస్తం గుర్తుకే ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, బోయిని వల్లభాయ్ పటేల్, పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, తమ్మిశెట్టి రవీందర్, సూరం ఐలయ్య, దుద్దెల శంకరయ్య, కొమురయ్య, చందబోయిన కుమారస్వామి, నీల వెంకటయ్య, దుద్దెల సమ్మయ్య, చెంచల రవి, రాపర్తి రాజు, వీరన్న పటేల్, కలువల మొగిలి, బోయిని రాజు తదితరులున్నారు.

## విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బిజెపి, బిఆర్ఎస్

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** తమ పది సంవత్సరాల పాలనలో బిజెపి, బిఆర్ఎస్‌లు విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించాయని, గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని, కేంద్రంలో బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ప్రజలను కోరారు. హుజురాబాద్ మండల కేంద్రంలో సిపిఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలన ప్రభుత్వరంగసంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడంతోనే సాగిందన్నారు. కులాలు, మతాలమధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. మతతత్వ పార్టీలను తెలంగాణలో అడుగుపెట్టనీయబోమన్నారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను పార్లమెంటు సాక్షిగా బిజెపి ప్రభుత్వం తెస్తుంటే పరోక్షంగా సహకరించిన బిఆర్ఎస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్లేనని, ప్రజలు అప్రమత్తంగా దేశ ప్రయోజనాల కోసం ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి ముత్త రాజు, ఎఐఎస్ఎఫ్ నాయకులు రోహిత్, అభి, సందీప్, సిపిఐ నాయకులు అన్నే ఐలయ్య, మల్లయ్య, ఎల్లమ్మ, జల్లా గీతా, మాధురి, మజిర రెడ్డి, మంజుల రెడ్డి, బండి మమ్మీ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో ఫాసిజానికి పునాదులు

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పా ల్గొని ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బిజెపి ప్రభుత్వంలో దేశంలో ఫాసిజానికి పునాదులు వేస్తున్నారని, దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. పదేండ్లలో కార్పొరేట్లు దేశంలో అత్యంత సంపన్నులుగా మారారని, రైతులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు అట్టడుగుకు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుని నడ్డి విరిగేలా ఆకాశాన్ని అంటుతున్నాయని, రాను రాను సామాన్యులు బతకడం భారంగా మారుతుందన్నారు. మతాల ప్రాతిపదికన పరిపాలన చేస్తున్న బిజెపికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బిజెపికి బుద్ధి చెప్పాలని, ఎంపిగా ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిరంజీవి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఊబిలో బిజెపి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్



**ప్రజాపక్షం/వలిగొండ :** అవినీతి ఊబిలో కూరుకుపోయిన బిజెపిని ఓడించాలని భువనగిరి ఎంఎల్ఎ కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో ఎఐటియుసి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ముద్రించిన అవినీతిఊబిలో కూరుకుపోయిన బిజెపి కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలకు సంబంధించిన పుస్తకాలను వారు ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ పదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలపైన దాడులు, హింస పెరిగిపోయాయన్నారు. లౌకిక, ప్రజాస్వామికవాదులపై, ఆలోచనా పరులపై పాశవిక నిర్బంధాన్ని అమలు చేశారని, రాజ్యాంగ పరంగా ఏర్పడిన సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని చట్టసభలను నామమాత్రం చేస్తున్నదని, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులను, ముఖ్యమంత్రులను అరెస్ట్ చేస్తున్నదని, పార్లమెంటరీ ఫాసిజాన్ని దేశంలో అమలు చేస్తున్నదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని, కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా తయారు చేసారని, కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా తయారు చేసారని,4 లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్మిక, కర్షక హక్కుల రక్షణకు ఇండియా కూటమి అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి చెయ్యి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోడ సుదర్శన్, ఎలగందు అంజయ్య, మండలకార్యదర్శి పోలెపాక యాదయ్య, సామల శోభన్ బాబు, సామల భాస్కర్, ఎఐవైఎఫ్ జిల్లాఅధ్యక్షుడు ఎల్లంకి మహేష్, సల్వాద్రి రవీందర్, సుద్దాల సాయికుమార్, చొప్పరి వెంకటేష్ పాల్గొన్నారు.

## ఇండియా కూటమితోనే దేశానికి రక్షణ : సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఇండియా కూటమితోనే దేశానికి రక్షణ అని, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పి1గని వద్ద ఏర్పాటు చేసిన ద్వారా సమావేశానికి పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి సీతారామయ్య హాజరై ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికవర్గం పోరా డి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. లాభాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెట్టారన్నారని ఆరోపించారు. రాజ్యాంగం మార్పు పేరుతో దేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్న బిజెపిని రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సింగరేణి సంస్థను లూటీ చేసిందని కార్మికుల సంక్షేమం కోసం ఏమాత్రం ప్రయత్నం చేయని నాయకులు ఇప్పుడు ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికులంతా చేతి గుర్తుకు ఓటేసి గడ్డం వంశీకృష్ణని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కార్మిక సంఘాల నాయకులు మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, నిర్మట్ల మల్లేష్, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, మోతె లచ్చన్న, మురళి చౌదరి, కామెర వేణు, మారుపెల్లి బాబు, అనంత రెడ్డి, తవటం మల్లేష్, రాజకుమార్, బానే పాల్గొన్నారు.

## మతతత్వపార్టీని తెలంగాణలో అడుగుపెట్టనీయం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** మతతత్వ, కార్పొరేట్ పార్టీని తెలంగాణ అడుగుపెట్టనీయమని, బిఆర్ఎస్‌కు ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లేనని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ బలపర్చిన ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను వరంగల్ ఎంపిగా గెలపించాలని వరంగల్ నగరంలో సిపిఐ ఆధ్వర్యంలో పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ప్రజలను మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు అప్పన్నంగా కట్టబెట్టడంతోనే సాగిందన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. మతతత్వ, కార్పోరేట్ పార్టీలను తెలంగాణలో అడుగు పెట్టనీయబోమన్నారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను పార్లమెంట్ సాక్షిగా బిజెపి ప్రభుత్వం తెస్తుంటే పరోక్షంగా సహకరించిన టిఆర్ఎస్‌కు ఓటేస్తే బిజెపి వేసినట్లనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశ ప్రయోజనాల కోసం అభివృద్ధి కోసం పాటుపడే ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు, కార్పోరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో పదేళ్ల పాలనలో ప్రజలకు ఓరిగింది ఏమిలేదన్నారు. కడియం కావ్య గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాసుమియా, నాయకుల తాళ్లపల్లి జాన్‌పాల్, సువర్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.






### కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి

**హన్మకొండ ప్రతినిధి :** వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఇండియా నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడియం కావ్యను భారీ మెజారిటితో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో కడియం కావ్యను భారీ మెజారిటితో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి మనుషులను మనుషుల వలే బతుకనీయదన్నారు. మోదీబడా పారిశ్రామిక వేత్తలకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తున్నాడన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా సంపన్న వర్గాలకు ఉపయోగపడే పనులు చేస్తున్నారన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని కేవలం దేశంలోని బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన పనులు చేస్తూ వారి ఎదుగుదలకు దేశ సంపదను దోచి పెట్టారన్నారు. మోదీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయమని, మోదీని గద్దె దింపాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించడంతో పాటు గడిచిన పదేళ్లలో తెలంగాణకు నిధులు ఇవ్వకుండా వివక్షత చూపిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. వామపక్ష పార్టీలు బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటితో గెలిపించాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, బీకేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎన్. రాజమౌళి,హసన్‌పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి,నాయకులు ఎర్ర కుమారస్వామి,రాజ్ కుమార్,చంద్రమౌళి,ఎర్ర నాగరాజు,భరత్,షేక్ బాబు, అజయ్,ఆర్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మతంపేరుతో ప్రజలమధ్య బిజెపి చిచ్చు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి

**ప్రజాపక్షం/తొర్రూరు :** దేశంలోని వివిధ కులాలు, మతాల మధ్య బిజెపి చిచ్చుపెడుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని సిపిఐ మహబూబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి ప్రజలను కోరారు. శుక్రవారం మహబాదు జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో సిపిఐ, సిపిఐఎం, కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ, సిపిఐఎం పార్టీల పాలకుర్తి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని బంధు మహేందర్, ఎండియాకూబ్‌లు అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో విజయసారధి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నిత్యావసర ధరలను పెంచడం, గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. ఇండియా కూటమిలో భాగంగా వరంగల్ ఎంపి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరారు.







### అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం

అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని పాలకుర్తి ఎంఎల్‌ఎ యశస్వినీరెడ్డి అన్నారు. పది సంవత్సరాలుగా బిజెపి దేశాన్ని అభివృద్ధి చేసింది లేదని, ప్రభుత్వ ఆస్తులను విక్రయించి అంబానీ, ఆదానీలకు కట్టబెడుతూ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చుతామన్న అహంకార పూరిత మాటలను ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అప్పుల తెలంగాణగా మార్చిన బిఆర్ఎస్‌ను పార్లమెంటు ఎన్నికలలో ఓడించాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. సమావేశంలో జనగామ జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్, ఎఐటియుసి మహబాదు జిల్లా అధ్యక్షుడు వోమ బిక్షపతి, సిపిఐ, సిపిఐఎం, కాంగ్రెస్ నాయకులు బొల్లం అశోక్, రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్, పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, బంధు మహేందర్, ఎండి యాకూబ్, గణపురం లక్ష్మ ణ్, మంగలపల్లి మల్లయ్య, గూడెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని అప్పలకుప్పగా మార్చిన మోదీ

### గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** కేంద్రంలో పదేళ్లు పరిపాలించిన బిజెపి దేశాన్ని అప్పుల కుప్పగా మార్చిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం హిందుత్వం పేరుతో కాలయాపన చేస్తూ దేశ సంపద, ప్రజా సంపద, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ విజ్ఞతతో గ్రహించి రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డిని గెలిపించి నల్లగొండ ప్రత్యేకతను చాటాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, అమరవరపు పున్నయ్య, నంద్యాల రాంరెడ్డి, జక్కుల రమణ పాల్గొన్నారు.






### లౌకికశక్తుల ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి

**సూర్యాపేట :** మతాల, కులాల మధ్య చిచ్చు పెట్టి రాముడి పేరుతో మళ్లీ అధికారం చేపట్టాలని ప్రయత్నిస్తున్న బిజెపిని అన్నివర్గాల ప్రజలు ఓటు అనే ఆయుధంతో గద్దెదించి ప్రజాస్వామ్య లౌకిక శక్తుల ఇండియా కూటమి ని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్‌కు సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించడానికి కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్‌కుమార్, రేగట్టు లింగయ్య, కొత్వాల సురేందర్, ఎల్‌ఐసి వెంకటరెడ్డి, దీకొండ శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, గాలి కృష్ణ, బూర సైదులు, పొదిలా వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రికవరీపై తర్జనభర్జన

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకోవాలని భావిస్తున్నారు.అజ్ఞాతంలో రాష్ట్రానికి చెందిన ఎంతమంది మా వోయిస్టులు ఉన్నారు..? అందులో ఎంతమంది ఎన్‌కౌంటర్ అయ్యారు..? ఏఏ స్థాయి మావోయిస్టులపై ఎంతెంత రివార్డులు ఉన్నాయి..? తదితర వివరాలను సేకరించేందుకు ఆరునెలల సమయం పడుతుందనే అంచనా.

**నిపుణుల పర్యవేక్షణలో...**దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్న ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌లను నుంచి డేటాను రికవరీ చేసేందుకు ప్రత్యేక ఐటి నిపుణులను రంగంలోకి దించారు. అయితే అందులో ఎంత వరకు రికవరీ అవుతాయో తెలియని పరిస్థితి. ఐటి నిపుణులు మాత్రం డేటా రికవరీ చేసేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తున్నారు.

**ప్రణీత్‌రావుకు రెండు గదులు-17 కంప్యూటర్లు...**ఎస్ఐబి కార్యాలయంలో ప్రణీత్‌రావుకు ప్రత్యేకంగా రెండు గదులు కేటాయించారు. అందులో 17 కొత్త కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఈ కంప్యూటర్లకు ప్రత్యేకంగా ఇంటర్‌నెట్ సదుపాయం సైతం కల్పించారని ఎస్ఐబి అదనపు ఎస్‌పి డి.రమేష్ ఫోన్ ట్యాపింగ్‌పై పంజగుట్ట పోలీలకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ కంప్యూటర్లకు ఆర్థిక వనరులు ఎవరు సమకూర్చానే అంశంపై కూడా దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

**మూడు నెలలు ఆలస్యంగా ఫిర్యాదు...** గత ఏడాది డిసెంబర్ 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలుబడ్డాయి. బిఆర్ఎస్ ప్రభుత్వం కుప్పకూలిన మరుసి రోజే ఫోన్ ట్యాపింగ్ నిందితుడు ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావు కార్యాలయంలోని హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లి ధ్వంసం చేశాడు. ఘటన జరిగిన మూడు నెలల తరువాత అంటే మార్చి 10వ తేదీ ఎస్ఐబి అదనపు ఎస్‌పి డి.రమేష్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో చోరీ జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. అయితే అత్యంత కీలకమైన ఎస్ఐబి కార్యాలయంలో ఇంత పెద్ద ఎత్తున భారీ చోరీ జరిగితే అక్కడి సంబంధిత అధికారులు ఎందుకు స్పందించలేదనే విషయంపై కూడా చర్చ జరుగుతోంది.

## ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం

**(మొదటి పేజీ తరువాయి)**

చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ కింద తెలంగాణ రాష్ట్రానికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అగ్నివీర్ దేశ రక్షణకు మంచిది కాదన్నారు. ప్రధానమంత్రిగా మోదీ దిగజారి మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. బిజెపికి తెలంగాణలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు.

**ఇక్కడ బిజెపి ఆటలు సాగవు...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రులుగా తామంతా కలిసి ఒక క్రికెట్ జట్టుగా పనిచేస్తున్నామని, ఐదేళ్ల పాటు సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన అందిస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కూల్చే రాజకీయ కుయుక్తులను తిప్పకొడుతామన్నారు. ప్రభుత్వాన్ని కూల్చాలన్న బిజెపి ఆటలు ఇక్కడ సాగబోవన్నారు. బిఆర్ఎస్‌లో ఎవ్వరూ ఉండదల్చుకోలేదని, ఆ ప్రక్రియ మరింత వేగం కానుందన్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఐదు లక్షల మెజార్టీతో గెలువాలని తాము లక్ష్యంగా పెట్టుకు న్నామన్నారు.

**15 రోజుల్లో 'మేడిగడ్డ' తుది నివేదిక...**మరో 15 రోజుల్లో మేడిగడ్డ తుది నివేదికను వస్తుందని, వాటి ఆధారంగా చర్యలు ఉంటాయని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ అంశంలో ఎన్‌డిఎస్ఎ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినందుకు ముందుగా కెసిఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు

**ఎన్నికల తర్వాత కొత్త రేషన్ కార్డులు**
ఎన్నికలు పూర్తయిన తర్వాత కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తామని ఉత్తమ్ వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన పంటను కూడా కనీస మద్దతు ధరకు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వేచ్ఛవాయువులను పీల్చుకుంటున్నారని, 24గంటల పాటు సిఎం, మంత్రులు అందుబాటులో ఉంటున్నామన్నారు.

**జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం**
ఎన్నికల సమయం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాము ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇంటి సమస్య పరి ష్కారం, హెల్త్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. (టియుడబ్ల్యుజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ సభాధ్యక్షత వహించగా, సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు సమన్వయ కర్తగా వ్యవ హరించారు.

## ప్రధాని మోదీ చేసిందేమిటి?

**(మొదటి పేజీ తరువాయి)**

మధుయాష్కీగౌడ్, సీనియర్ నాయకురాలు డాక్టర్ జె.గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ రాహుల్ గాంధీకి అదానీ, అంబానీలు డబ్బులు ఇచ్చారని ప్రధాని మోదీ విమర్శలు చేస్తున్నారని, అదే నిజమైతే ప్రధానితో సహా సిబిఐ, ఇడి, ఐటి ఏమి చేస్తున్నాయని, కళ్లతో చూస్తున్నారా, నిద్రపోతున్నారా అని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. కాంగ్రెస్ తమకు పోటీయే కాదంటూనే పదేపదే బిజెపి విమర్శిస్తోందని, కాంగ్రెస్ పార్టీని చూసి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు భయపడుతున్నందునే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పుకుని ఓట్లు అడగడం లేదని, వారి ఎన్నికల ప్రణాళిక గురించి మాట్లాడడంలేదని, కాంగ్రెస్‌పై నిందలు మోపడం ద్వారా ఓట్లు అడుగుతోందని విమర్శించారు. మోదీ నల్లధనం వెలికితీస్తానని ప్రగల్భాలు పలికి దానిని నెరవేర్చలేదన్నారు. నల్లధనం ప్రయోజనాలను తన మిత్రులకే అందించారని విమర్శించారు.''ఎన్నికల ప్రకటన తర్వాత అదానీ, అంబానీ గురించి మేం మాట్లాడలేదంటున్నారు. టెంపోల్లో కాంగ్రెస్ నేతలకు డబ్బులు ముడుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపిస్తున్నారు. ఎక్కడి నుంచి డబ్బులు వస్తున్నాయో, ఎక్కడికి వెళ్తున్నాయో మీరు చూశారా? టెంపోల్లో డబ్బు తరలిస్తుంటే ఐటి, కేంద్ర సంస్థలు ఏం చేస్తున్నాయి? అదానీ, అంబానీ నుంచి డబ్బులు వెళ్తుంటే వారి ఇళ్లలో ఇడి, ఐటి సిబ్బంది సోదాలు చేయాలి. ఆ డబ్బును జప్తు చేయండి. అభివృద్ధిని గాలికొదిలేసి అనవసర విషయాలను ప్రస్తావించడం, విపక్షంపై ఆరోపణలే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రధాని స్థాయికి తగదు'' అని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ ధనవంతుల ఆస్తులు లాక్కుని పంచుతామనడం సిగ్గుచేటన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందని గుర్తించాలని, ఇందిరా గాంధీ భూసంస్కరణలు తీసుకువచ్చారని, బ్యాంకులను జాతీయం చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. మోదీకి 'ఎం' అక్షరం అంటే ఇష్టమని అందుకే మటన్, మొగలులు, మంగళసూత్రం, ముస్లింలు తదితర అంశాల గురించి మాట్లాడుతున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏదైతే చెబుతుందో అది కచ్చితంగా చేసి చూపిస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నో హామీలను అమలు చేశామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొన్నింటిని అమలు చేయలేక పోయినట్లు చెప్పారు. రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుటుందని, పరిహారం చెల్లిస్తామన్నారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, దేశ వ్యాప్తంగా కుల గణన చేపడుతామని, పేద మహిళలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, రైతులు పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని మల్లికార్జున ఖర్గే హామీ ఇచ్చారు. తన అల్లుడిపై వచ్చిన రూ.500 కోట్ల కుంభకోణం ఆరోపణలపై అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ 'తన అల్లుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసుకోండి, దోషిగా తెలితే శిక్ష వేయండి. జైలులో పెట్టండి' అన్నారు. దేశంలో అధిక విడతల్లో ఎన్నికల నిర్వహణ వల్ల ఎవరికీ ఉపయోగం లేదని విమర్శించారు. అయితే ఎన్నికల కమిషన్ విధానాల మేరకు అందరూ నడుచుకోవాల్సిందే అన్నారు. కమలం పువ్వులు పొద్దున వికసిస్తాయని, సాయంత్రం వాడిపోతాయని, కానీ హస్తం ఎప్పుడు ప్రజలతోనే ఉంటుందని, అది శాశ్వతమని ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల దృష్టి

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్ తెలిపారు. శుక్రవారం ట్రాఫిక్ సిబ్బందితో రాంగ్ రూట్ డ్రైవింగ్ అనే అంశంపై సైబరాబాద్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరుల ప్రాణాలకు, వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే విధంగా నిర్లక్ష్యంగా, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసినందుకు 239 వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మాదాపూర్, మేడ్చల్ ట్రాఫిక్ డిసిపి డివి శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిసిపిలు, ఎసిపిలు ఇన్స్పెక్టర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా పనిచేయాలి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఈ నెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కృషిచేయాలని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శుక్రవారం శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల్లో శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్, సహాయ రిటర్నింగ్ అధికారి స్నేహ, సెక్టోరల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు రద్దు..రాజ్యాంగం మార్పు...

ప్రచారసభల్లో సిఎం వ్యాఖ్యలు

ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రైతులకు భరోసా

'రాష్ట్రానికి బిజెపి ''గాడిద గుడ్డు'' తప్ప ఏమిచ్చింది' అనే ప్రకటనతో ప్రజలను ఆకట్టుకున్న సిఎం

27 రోజుల్లో 57 సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలతో హోరెత్తిన ప్రచారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుతం జరుగుతున్న లోక్ సభ ఎన్నికల ప్రచారంలో టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఊపిరి సలపనీయకుండా బిజెపి, బిఆర్‌ఎస్‌కు దీటుగా ప్రచార సభలు నిర్వహించారు. పార్టీ ప్రచారం మొత్తం తన భుజస్కందాలపై వేసుకుని ప్రచారాలు నిర్వహించారు. ఏప్రిల్ 6వ తేదీన తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభతో తన ఎన్నికల ప్రచారం మొదలు పెట్టి, మొత్తం 27 రోజుల్లో 57 సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలతో ప్రచారాన్ని హోరెత్తించారు. కొన్నిసార్లు ఒక్క రోజులోనే వివిధ నియోజకవర్గాల్లో జరిగిన నాలుగు సమావేశాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలు ముఖ్యమంత్రితో కలిసి కొన్ని ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి వాగ్ధాటిని ప్రజలలో ఆయనకున్న ఇమేజ్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారాన్ని ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించి ఇతర రాష్ట్రాలకు సైతం ఆయనను ప్రచారానికి పంపించింది. రాష్ట్రంలో ఎంతటి బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో సైతం పర్యటించి అక్కడి బహిరంగ సభలు, రోడ్‌షోలలో ఆయన పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీ నామినేషన్ కార్యక్రమానికి సైతం హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రచారం మధ్యలో వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి పత్రికలకు, ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. మండు టెండలను సైతం లెక్క చేయకుండా అలుపు సొలుపు లేకుండా తన వాగ్ధాటితో ఆయన ప్రజలను అకట్టుకున్నారు. కెసిఆర్‌పై, మోదీపై, వారి పాలనా వైఫల్యాలపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించి ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రచారసభలకు ప్రజలు పెద్దఎత్తున వచ్చారు. ముఖ్యంగా బిజెపి అధికారంలోకి వస్తే దేశానికి జరగబోయే నష్టం గురించి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాలు సంచలనం సృష్టించాయి. మరీముఖ్యంగా బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని మారుస్తుందని చేసిన ప్రసంగాలు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. దీనిపై మోదీ, అమిత్‌షా నుంచి బిజెపి నాయకులందరూ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన విమర్శలకు దీటుగా రేవంత్‌రెడ్డి బదులిచ్చారు. పదేండ్ల పాటు బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నా రాష్ట్రానికి నిధులు, అభివృద్ధి పనులకు అనుమతులు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, ఉన్నత విద్యాసంస్థల స్థాపనలో నిర్లక్ష్యం వంటి వాటిని బలంగా ఎత్తి చూపారు. రాష్ట్రానికి ఏమీ చేయని బిజెపికి ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా రాష్ట్రానికి బిజెపి ''గాడిద గుడ్డు'' తప్ప ఏమిచ్చింది అనే ప్రచారం ప్రజల్లోకి బాగా వెళ్లింది. ఆగస్టు 15లోపు తప్పనిసరిగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రైతులకు భరోసా ఇచ్చిన అంశం హైలెట్‌గా నిలిచింది. బిఆర్‌ఎస్ తమకు పోటీనే కాదని, ఈ ఎన్నికలు బిజెపి, కాంగ్రెస్ మధ్యనే జరుగుతున్నాయని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి ప్రధాన ప్రత్యర్థిగా బిజెపిని కట్టడి చేసి రాష్ట్రంలో 14సీట్ల వరకు కాంగ్రెస్ గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన కెసిఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బిడ్డ బెయిల్ కోసం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నరేంద్రమోదీ కాళ్ళ వద్ద మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తాకట్టు పెట్టారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం రాత్రి షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్, మాజీ ఎంఎల్‌ఎ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సిఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో చేపట్టడంతోపాటు షాద్‌నగర్ ముఖ్యకూడలిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రజల ఆత్మగౌరవాన్ని నరేంద్రమోదీ కాళ్ళ వద్ద కెసిఆర్ తన బిడ్డ కోసం పార్లమెంట్ సీటును తాకట్టు పెట్టారని మండిపడ్డారు. బిజెపికి ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దుకు ఓటు వేసినట్లేనని, ఈ విషయాన్ని పాలమూరు ప్రజలు గ్రహించాలని సూచించారు. మతం, దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్న బిజెపిని తరిమికొట్టేందుకు తెలంగాణ ప్రజలంతా సిద్ధం కావాల్సిన సమయం అసన్నమైందన్నారు. ఏడారిగా ఉన్న పాలమూరు జిల్లాను పదేళ్ళ కాలంలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నుంచి పాలమూరు జిల్లాకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు పౌరుషానికిఢిల్లీ సుల్తాన్‌లకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. నరేంద్రమోదీ పాలమూరు వస్తే ఐటిఐఆర్, రైల్వే కోచ్ ప్రారంభిస్తానని ప్రకటిస్తారోనని ఆశించినప్పటికి చివరకు నిరాశకు గురయ్యామని మండిపడ్డారు. మనుషులు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని, గుజరాత్ నుండి వచ్చిన నేతలు విషం చిమ్ముతుంటే మన నేతలు దాసోహం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిజెపి గెలుపు కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చెద్దామా..ఎన్నికలను అడ్డుపెట్టుకొని మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేస్తుందని వాపోయారు. పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. జెపి దర్గా సాక్షిగా ఆగస్టు15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, వెంకట్‌రాంరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, కాశినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తే వెనుకబడిన పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల గ్రామానికి చెందిన టిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రఘు యాదవ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూపాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంతోపాటు లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి అన్నదాతలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో భీముడి అశోక్‌రెడ్డి, బాబు బాయ్, రవీందర్ యాదవ్‌లు పాల్గొన్నారు.



## కొండా సంగీతారెడ్డి ప్రచారం



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చేవెళ్ల బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి వినూత్న రీతిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమె.. స్థానిక లంబాడా మహిళల వస్త్రలను ధరించి వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కొండా సంగీతా రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేవెళ్లను అభివృద్ధి పథంలో నడిపించొచ్చని కొండా సంగీతా రెడ్డి తెలిపారు.

**బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో..** జూబ్లీహిల్స్‌లోని హోటల్ దస్పల్లాలో శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సంగీతారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సెగ్మెంట్ లోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతు పలుకుతున్నారన్నారు. మే 13న ప్రతి ఒక్కరూ తరలివచ్చి ఇవిఎంపై రెండవ స్థానంలో ఉన్న కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంతో పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల, మతాలకతీతంగా బిజెపికి మద్దతు

కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కుల,మతాలకు అతీతంగా ప్రజలంతా నరేంద్ర మోదీకి, భారతీయ జనతా పార్టీకి మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ చేవెళ్ల ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షో వివేకానంద నగర్ కమాన్ నుండి చిత్తారమ్మ టెంపుల్,దీనబంధు చౌరస్తా,వెంకటేశ్వర్ నగర్ కాలనీ,జలకన్య హోటల్, ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్,ఎల్లమ్మ బండ చౌరస్తా మీదుగా ఉషా ముళ్లపూడి కమాన్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయడానికి యావత్ దేశం మొత్తం సిద్ధమైందన్నారు. అందులో భాగంగానే చేవెళ్లలో తాను రెండు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించబోతున్నానని కొండ విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను నిత్యం ప్రజల్లో ఉండి ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రత్యర్థి రంజిత్ రెడ్డి మాత్రం పోల్ మేనేజ్ మెంట్ పేరుతో డబ్బు,మద్యాన్ని నమ్ముకున్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు.ఈ రోడ్ షోలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

### విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరికలు

మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో సుమారు 500 మంది కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బిజెపిలో చేరారు. వారికి చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాషాయ కండువాలు కప్పి భారతీయ జనతాపార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసిన చేవెళ్ల ప్రజలు తన వెంట నిలిచారన్నారు. పోల్ మేనేజ్‌మెంట్ పేరిట రంజిత్ రెడ్డి చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని ఆయన బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అటు కాంగ్రెస్ పార్టీకి ఇటు భారత రాష్ట్ర సమితికి కాలం చెల్లిందని అన్నారు. దేశం మొత్తం మోదీ హవా నడుస్తోందని చెప్పారు. మన రాష్ట్రంలోనూ భారతీయ జనతా పార్టీ 12 నుండి 15 స్థానాల్లో విజయం సాధించబోతుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతోనే తాను చేవెళ్లలో రెండు లక్షల పైచిలుకు ఓట్లతో విజయం సాధించబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్ల ప్రచారంలో కారు జోరు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చేవెళ్ల పార్లమెంట్‌లో సిట్టింగ్ సీటును కైవసం చేసుకోవడానికి బిఆర్‌ఎస్ అధిష్టానం ఎప్పటికప్పుడు వ్యూహాలు పన్నుతుంది. చేవెళ్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ఆలస్యంగా మొదలు పెట్టినప్పటికీ ప్రచారంలో జోరు పెంచింది. క్షేత్రస్థాయిలో క్యాడర్ పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. బూత్ స్థాయిలో గత పదేండ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించే పనిలో గులాబీ నేతాలు నిమగ్నమైయ్యారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీవంద రోజుల పాలన చూడు.. పదేండ్ల పాలన చూడండి అనే నినాదంతో ప్రజలను కలుస్తున్నారు. చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ ప్రచారాన్ని ఆలస్యంగా మొదలు పెట్టింది. అయినా ముఖ్యనాయకుల ప్రచారంతో పార్టీ క్యాడర్‌లో జోష్ నింపుతుంది. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎక్కడికక్కడా పార్టీ క్యాడర్, నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపును ఎవరికి వారు తమ తమ భూజస్కాందాల మీద వేసుకుని పని చేస్తున్నారు. చేవెళ్లలో మొదట్లో బిఆర్‌ఎస్ అవకాశమే లేదన్న స్థాయి నుంచి ప్రత్యార్థులకు గట్టిపోటీ ఇచ్చేస్థాయిలో నిలిచింది. మరో సారి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురుతుందన్న ధీమాతో బిఆర్‌ఎస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్లలో కాసాని గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ పార్టీ అధిష్టానం నిరంతరం పర్యవేక్షణ చేస్తూ.. క్షేత్రస్థాయిలో క్యాడర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక వ్యూహాలు రచిస్తుంది.

### సర్వే రిపోర్టుల ఆధారంగా ప్రణాళికలు



చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ప్రత్యర్థులకు తగ్గట్టుగా ఎప్పటికీ కప్పుడు రాజకీయ కదలికలు.. ప్రజానాడిని పసిగట్టి ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి వేయాల్సిన ఎత్తుగడలపై అన్వేషణలు చేస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గం రాజకీయ సమీకరణాలను పసిగట్టేందు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. ఈ సర్వే టీమ్ ఇచ్చిన రిపోర్టు బేస్ చేసుకుంటూ అధిష్టానం ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రజలకు ఇవ్వాల్సిన సమచారాన్ని పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

### ప్రణాళికాబద్ధంగా ప్రచారం

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బిజెపి లు వేస్తున్న ఎత్తుగడలకు దీటుగా తమ ప్రణాళికలు ఉండాలన్న ఉద్దేశ్యంతో బిఆర్‌ఎస్ అధిష్టానం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆ పార్టీ శ్రేణుల ద్వారా తెలిసింది. చేవెళ్ల లో గత నెల రోజులుగా బిజెపి, కాంగ్రెస్‌లు కాలుకు బలపం కట్టుకుని తీరుగుతున్న విషయం తెలిసిందే. అయితే బిఆర్‌ఎస్ మాత్రం వారం రోజుల నుంచి పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగింది. ఈ నెల రోజుల్లో కాంగ్రెస్, బిజెపిలు ప్రచారంలో చేసిన తప్పిదాలు...ప్రజల నుంచి వస్తున్న స్పందనను పసిగట్టిన బిఆర్‌ఎస్ ఆ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కౌంటర్ చేస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వందరోజులో ఆరు గ్యారెంటీలను అమలు చేయని దాని గురించి ప్రశ్నిస్తూ... ఇలాంటి పాలన కావాలా...? గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలన, పేదల సంక్షేమ కోసం చెప్పట్టిన పాటుపడిన బిఆర్‌ఎస్ పాలన కావాలో... తెల్చుకోవాలన్న నినాదంతో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే వ్యూహాలు రచిస్తూ బిఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతుంది.

ఇక బిజెపి ఇటీవల రాజ్యాగంపై చేసిన వ్యాఖాలు, ఎంతగా వాడుకావాలో బిఆర్‌ఎస్ అంతగా వాడుకుంటూ ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. చేవెళ్లలో బడుగు బలహీనవర్గాలకు చెందిన కాసాని గెలుపు ఖాయం అని ఆ పార్టీ శ్రేణులు దీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు...అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కన్నా భిన్నమైన ఫలితాలను బిఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని గులాబీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కాసానిని గెలిపించాలని ప్రచారం



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** సబండ వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు కాసాని వీరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో సీరియల్ నెంబర్ వన్ కారు గుర్తుకు ఓటేసి జ్ఞానేశ్వర్ చూపించాలని కోరారు.

**కడ్తాల్ :** కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని మండలం బిఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు అనేగౌని దామోదర్‌గౌడ్, పాపగల్ల వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గంగవరం చంద్రశేఖర్, చింతకింది జంగయ్య, జాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

### మీర్‌పేటలో కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో...

**రంగారెడ్డి :** చేవెళ్ల బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయాన్ని కాంక్షిస్తూ మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ అంబేద్కర్ నగర్, 2, 19 వార్డులలో మీర్‌పేట బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడుగు, బలహీనవర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బిఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాలరెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు అర్జున్, జంగయ్య, మహేందర్, సహదేవ్, యాదగిరి, మల్లారెడ్డి, చారి, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, భరత్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అవినీతి ఊబిలో మోదీ ప్రభుత్వం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** అవినీతి ఊబిలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కూరుకుపోయిందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య విమర్శించారు. శుక్రవారం తుర్కయంజల్‌లో బిజెపి ప్రభుత్వం అవినీతిపై ఎఐటియుసి ప్రచురించిన పుస్తకావిష్కరణకు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చడంతో పాటు, పది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం అవినీతిని పుస్తకంలో సరళంగా వివరించడం జరిగిందన్నారు. సమాచార హక్కు చట్టంలో ఉన్న నిబంధనలను మార్చడంతో పాటు, కార్పోరేట్ శక్తులకి 16 లక్షల కోట్ల రుణమాఫీ, లోక్పాల్, లోకయుక్త చట్టాలను పట్టించుకోకపోవడం, తమ అవినీతి ఎక్కడ బయట పడుతుందని మోడీ భయాందోళనకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అవినీతిని ఆధారాలతో పొందపరచడం జరిగిందని ఓరుగంటి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని, భువనగిరి నియోజకవర్గంలో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, ఎఐటియుసి నాయకులు కాటమరాజు, చెక్క యాదగిరి, ఆనంద్, మల్లేష్, రవి, దీప్లా నాయక్, కోట్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 21న చలో బస్‌భవన్

టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ మేరకు మే 21న చలో బస్ భవన్‌కు టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈమేరకు శుక్రవారం యూనియన్ కేంద్ర కార్యాలయంలో యస్.బాబు అధ్యక్షతన రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. సమావేశమునకు యూనియన్ గౌరవాధ్యక్షులు కె.పద్మాకర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.వెంకన్న, కె.భాస్కర్‌రావు, పి.అప్పారావు, జిఎస్.నారాయణ, వికె స్వామి, కాళిదాసు, ఏ.జ్యోతి, జి.గంగారాం, బి.జ్యోతి, జిడి.ప్రసాద్‌డ్డిలు హాజరై ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించారు. ఆర్‌టిసిలోని అన్ని విభాగాలలో కార్మికుల సమస్యలు, ఎండి ఏకపక్ష నిర్ణయాలు, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలన్న డిమాండ్లతో కూడిన మెమోరాండం ఆర్‌టిసి యాజమాన్యానికి సమర్పించి మే 21 న ఛలో బస్ భవన్ కు పిలుపునిచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుండి కార్మికులు పెద్దయెత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు బిగిస్తున్న ఉచ్చు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎఐబి మాజీ చీఫ్ ఐపిఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు ఉచ్చు బిగుస్తుంది. ఈ కేసులో ప్రభాకర్‌రావుపై నాంపల్లి కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేయడంతో దర్యాప్తు అధికారులు అతనిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.శని, ఆదివారాల్లో ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నోటీసులు దేశంలోని అన్ని విమానాశ్రయ ఇమ్మిగ్రేషన్ అధికారులకు చేరుతుంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు ఏ క్షణంలో భారత్‌లో అడుగుపెట్టిన విమానాశ్రయంలోనే అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి.ఈ కేసులో ఇప్పటికే ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావు, అదనపు ఎస్‌పి భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్, డిఎస్‌పి తిరుపతన్నలు అరెస్టై ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు.ప్రభాకర్‌రావును విచారిస్తే ఫోన్ ట్యాపింగ్ చేయమని అతన్ని ఎవరు ఆదేశించారనే అసలు విషయాలు బయటపడుతాయి.ఈ వ్యవహారంలో మరికొంత మంది నిందితుల పేర్లు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ముస్లిం రిజర్వేషన్‌లు రద్దు చేస్తామనడం రాజ్యాంగ విరుద్ధమే

తీగుళ్ల పద్మారావుగౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. నిజమైన పేదరికం ముస్లింలలోనే అధికంగా ఉందని, రిజర్వేషన్లు తప్పనిసరిగా వారికి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ముషీరాబాద్ భోలక్‌పూర్ బడీ మసీదు వద్ద ఎంఎల్‌ఎ ముఠా గోపాల్‌తో కలిసి పార్థనలు ముగించుకొని బయటకు వచ్చిన ముస్లింలను కలిసి ఆలింగనం చేసుకొని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కిషన్‌రెడ్డి ఏనాడు స్థానిక ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. అధికార దాహం కోసం పార్టీలు మారే వారిగురించా మాట్లాడుకోవడం వృదా అని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో ముఠా జయసింహ, వి.శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ నాయకుడు షరీపోద్దీన్, మహ్మద్ అలీ, నాయకులు దీనదయాల్ రెడ్డి, సయ్యద్ అస్లాం, ముచ్చకుర్తి ప్రభాకర్, రెబ్బ రామారావు, శంకర్‌గౌడ్, మక్బూల్, వల్లాల శ్యామ్ యాదవ్, ఆర్,రాజేష్, పి.ప్రభాకర్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



జనసేన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు వంగ లక్ష్మణ్ గౌడ్ రాజీనామా చేసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## మల్లు రవి గెలుపునకు కృషి



ప్రజాపక్షం/నాగర్ కర్నూల్‌ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లాకేంద్రంలో సిపిఐపార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇండియా కూటమి కాంగ్రెస్‌పార్టీ ఎంపి అభ్యర్థి డాక్టర్ మల్లురవికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా ఇంద్రకల్ చౌరస్తానుండి బస్టాండువరకు వీధులగుండా ఇంటింటికి, షాపులకుతిరిగి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి ఓటువేసి గెలిపించాలని కోరారు. వనపర్తి గద్వాల్ అలంపూర్ కల్వకుర్తి పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా సిమెంటు, కాగిత పరిశ్రమలను నెలకొల్పే అవకాశం ఉన్నందున పారిశ్రామికవాడలను తీసుకురావాలంటే కచ్చితంగా దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే అమలుచేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్‌మెంబర్స్ శివశంకర్, నాగర్‌కర్నూల్ పట్టణ కార్యదర్శి కపిలవాయిగోపిచారి, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసులు, శివకృష్ణ, నరేష్, నితిన్, బాలపీరు, మహిళా సభ్యురాలు మల్లమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటు అభివృద్ధికి బాట



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి ఓటువేస్తే గ్రామాల ఆర్థిక అభివృద్ధికి ఓటువేసినట్లే అని ఓటర్లను ఉద్దేశించి కాంగ్రెస్‌పార్టీ మండల ఎస్‌ఎల్ అధ్యక్షులు సల్వాది వెంకటయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలోభాగంగా మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ గెలిపించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సల్వాది వెంకటయ్య మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకివస్తే గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎంపిటిపి ఖాజ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి: బిఆర్ఎస్‌పార్టీ నాయకులు తైలి వెంకటస్వామి, నాగమల్లయ్యతోపాటు మరికొంతమంది, ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌పార్టీకండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు వివరిస్తూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపుకు కృషిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మాజీసర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి శశికళశివశంకర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు దండునర్సింహ్మా, చంద్రయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు ఖాయం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు ఖాయమని ఎంపిపి సూర్యప్రతాప్ గౌడ్ అన్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామంలో రాష్ట్రమంత్రి జూపల్లికృష్ణారావు ఆదేశాలమేరకు ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ఎంపి అభ్యర్థి మల్లురవికి ఓటువేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి ఓటువేసి డాక్టర్ మల్లురవిని గెలిపిస్తే జూపల్లికృష్ణారావు సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రవికుమార్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు వంగూరు రాంప్రసాద్, బాలింగచారి, శంకర్, గ్రామపెద్దలు, వార్డుమెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపికి అపూర్వ ఆదరణ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : బిజెపిపార్టీ బలపర్చిన పోతుగంటి భరత్‌ప్రసాద్ కులమతాలకు అతీతంగా గ్రామాలలో ఆదరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి దిలీప్‌చారి అన్నారు.శుక్రవారం పట్టణకేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ప్రజలు ఎన్నడూలేని విధంగా బిజెపిని ఆదరిస్తున్నారని ఇలాంటి సందర్భాలు గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన ఆనందోత్సవం వ్యక్తం చేశారు. మోడిపంపిన భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తామని అన్నారు. బిజెపితోనే దేశాభివృద్ధి అని నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆయా మండలాల టిఆర్ఎస్ ఇతర పార్టీల నాయకులు బిజెపిలో చేరారు. బిజెపిగెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కోడుపర్తి సర్పంచ్ ఉమాదేవి, బిజెపి నాయకులు వెంకటేష్, రమాణారెడ్డి, నిరంజన్, విజయభాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజవర్దన్‌రెడ్డి, కొండలరావు, వెంకటారెడ్డి, తిరుపతయ్య, బూశయ్య, ప్రవీణ్‌కుమార్, యశ్వంత్, లోహిత్‌రెడ్డి ఉన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం / చిన్నంబావి : మండలంలోని యాసంగిలో రైతులు పండించిన ధాన్యం రైతుల ముంగిటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మండల కేంద్రంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఏపిఎం మద్దిలేటి మాట్లాడుతూ మండలంలో అన్ని చోట్లా మహిళ సంఘాల ద్వారానే వరి కొనుగోలు జరుగుతుందని, తూకం అయిన వెంటనే మిల్లులకు తరలించే విధంగా చేస్తామన్నారు. బుక్కు కీపర్ నర్సింహ, పాండు , గంగ, రాజు, రవి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణంపై తనిఖీలు



ప్రజాపక్షం / శ్రీరంగాపురం : మద్యం దుకాణంపై దాడి చేసి మద్యాన్ని సీజ్ చేసిన సంఘటన మండల పరిధిలోని నాగసానిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిసిన సమాచారం మేరకు నమ్మదగిన సమాచారంతో నాగసానిపల్లి గ్రామంలోని గొల్లవాని విష్ణువర్ధన్ తండ్రి పేరు వెంకటస్వామి కిరణా షాప్‌లో రైడ్ చేయగా నాలుగు కాటన్ల బీర్లు లభించినవి. మొత్తం 31.2 లీటర్ల బీరలు వీటివిలువ అందాజా రూ. 7800 వరకు ఉంటుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

## 'కాంగ్రెస్‌తోనే బిసిల అభివృద్ధి సాధ్యం'

ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ : దేశ వ్యాప్తంగా బీసీల ఆకాంక్షలు నెరవేరాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ఏకైక పరిష్కారమని కాంగ్రెస్ పార్టీ నేత రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాచాల మాట్లాడుతూ పదేండ్ల బీజేపీపాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని, ప్రధానిగా ఓబీసీకి చెందిన మోడీ ఉన్నప్పటికి బీసీలకు న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే సామాజిక ఆర్థిక సమగ్ర కులగణన అంశంపైనే మొట్టమొదటి సంతకం చేసి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డా. మల్లు రవిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సంపత్ కుమార్ , మనిగిల్ల శివ, అమ్మపల్లి బాలు, మహేష్ యాదవ్, రాజు, శివపాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి

### ఓటు వజ్రాయుధం..అవకాశం చేజార్చుకోవద్దు : సీఎం రేవంత్



ప్రజాపక్షం/నర్వ: పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దుకు అంగీకరించినట్లే అని సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మక్తల్‌లో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ అవకాశం చేజారిపోతే ఈ జిల్లా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావు అని అన్నారు. డీకే అరుణ ఓడిపోతే పాలమూరు జిల్లాకు వచ్చే నష్టం ఏమీ ఉండదని కీలక వ్యాఖ్యలు చేశారు. కానీ, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పదేళ్లుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉందని ముగ్గురు ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ఉండి పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. బిజెపిని గెలిపిస్తే మత విద్వేశాలను ప్రోత్సాహించినట్లే అని అన్నారు. తెలంగాణకు రావాల్సిన కంపెనీలు ఉత్తరప్రదేశ్‌కు గుజరాత్‌కు తరలించకపోవడం ఏనాడైనా చూశామా అని అడిగారు. నిత్యం మాట కలహాలు ఉండటం వల్లే యూపీకి కంపెనీలు రావడం లేదన్నారు. అందుకే తెలంగాణకు వచ్చిన సంస్థలుతరలించకపోతున్నారనివిమర్శించారు. బిజెపి ప్రభావం ఏమాత్రం లేని గుర్ గ్రామ్‌కు ఎన్నో పరిశ్రమలు వచ్చాయని తెలిపారు. తెలంగాణలో బిజెపికి ఓటు వేస్తే ఇక్కడికి వచ్చే పెట్టుబడులు కూడా ఆగిపోతాయని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అయినా మత కలహాలు ఉంటే పరిశ్రమలు రావు. ఉపాధి అవకాశాలు పెరగవు అన్నారు. దేశం ప్రశాంతంగా ఉండాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. మీ పాలమూరు బిడ్డగా నేను ముఖ్యమంత్రి కావడం తప్ప నేను అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగా మాట ఇస్తున్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్లకు కృషి చేస్తామని తెలిపారు. పాలమూరులో బిజెపికి ఓటు వేస్తే మళ్లీ బంగ్లా రాజకీయం నడుస్తుందని ఇసుక మట్టి దందా మొదలైతాయని తెలిపారు. ఈకార్యక్రమంలోని అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి ఎమ్మెల్యే శ్రీహరి ఏపి జితేందర్‌రెడ్డి బాలకృష్ణ రెడ్డి పోలీసు చంద్రశేఖర్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి జడ్పిచైర్ పర్సన్ వనజ , గద్వాల్ జిల్లా చైర్ పర్సన్ సరితమ్మ మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జలంధర్ రెడ్డి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆవేశంతో కాదు.. ఆలోచనతో ఓటేయండి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి: ఆవేశంతో కాదు ఆలోచన చేసి ఓటు వేయండని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హన్వాడ మండలం టంకర గ్రామంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేరుతో గత పది సంవత్సరాలుగా బిఆర్ ఎస్ పార్టీ మనలను మోసం చేసిందని, కానీ మీ ఆశీస్సులతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు అందించే ఇందిరమ్మ ఇండ్లు పథకానికి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం రాముల వారి సన్నిధిలో అంకురార్పణ చేశారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి లబ్దిదారునికి రేషన్ కార్డు ఇస్తామని, సిలిండర్‌ను ఐదువందలకే ఇస్తున్నామని, ఉచిత విద్యుత్ జీరో బిల్లు ఈ నెల 13 నుంచి అమలు అవుతాయని, పంద్రాగస్టు లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి గౌరవాన్ని పెంచేందుకు మహబూబ్‌నగర్ పార్లమెంటుఅభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం ఓటు వేసి గెలిపించాలని కోరారు. తిరుపతయ్య, మహేందర్, యంఎస్ఆర్, ఎంపిటిసి జాంగిరయ్య, టంకర కృష్ణయ్య, ఎన్‌పి వెంకటేశ్,వేములకృష్ణయ్య, అచ్చన్న, బాలయ్య, నవనీత, యాదిరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**ఇన్నాళ్లు బాగుపడ్డది ఎవరు?**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బాగుపడ్డది ఎవరని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. హన్వాడ మండలం కొత్తపేటలో ప్రచారంలో ప్రసంగించారు.మన పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి మన బాధలు తీర్చే బాధ్యత తీసుకోన్నారని, మరి రేవంత్ రెడ్డి గౌరవాన్ని పెంచే బాధ్యత మనదే కదా అని ఆయన ప్రజలకు తెలిపారు. అందుకే రేవంత్ రెడ్డి పంపించిన వంశీచంద్ రెడ్డిని పార్లమెంటు అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించి ఢిల్లీకి పంపితే రేవంత్ రెడ్డి గౌరవం పెంచడమే కాదు మన పాలమూరు అభివృద్ధిని కూడా సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు. అనంతరం బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు జుట్టు యాదయ్య, రామచంద్రయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. మారేపల్లి సురేందర్ రెడ్డి,ఎన్ పి వెంకటేష్ , టంకరకృష్ణయ్య,మహేందర్,నవనీత, చెన్నమ్మ, అంజి, శ్రీను వెంకటయ్య, మల్లయ్య, కోమటి వెంకట్రాములు పాల్గొన్నారు

**ఒక్క ఓటు రేవంత్‌రెడ్డి గౌరవాన్ని పెంచు**

మన ఒక్క ఓటు రేవంత్ రెడ్డి గౌరవాన్ని పెంచుతుంది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం హన్వాడ మండలం బుద్దారం,కారం తాండా ఓటర్లుతో బుద్దారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాజీ సర్పంచ్ ముద్దు చెన్నయ్య ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా సుధాకర్‌రెడ్డి, మహేందర్,మారే పల్లి సురేందర్‌రెడ్డి, ఎన్ పి వెంకటేష్,టంకరి కృష్ణయ్య, పెద్ద విజయ్ కుమార్, నవనీత, లక్ష్మన్, గంజి ఆంజనేయులు,రాజు నాయక్,షబ్బీర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల ఓటమి ఖాయం

### ప్రధాని నరేంద్రమోడీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ఈ దేశంలో ఎస్సి, ఎస్టి, బిసి రిజర్వేషన్లను కాపాడడంలో చౌకీదారుగా పనిచేస్తా రాష్ట్రంలో కాంగ్రెస్ బిఆర్ఎస్‌లు చీకటి ఒప్పందం చేసుకున్నారు. విలువలు లేకుండా వీరిరువురు ఒకటై బిజెపి అభ్యర్థులను ఓడించే పనిలో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగించి మైనార్టీలకు మేలు కలిగించే బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో జనసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ కులాలు మతాల పేరుట దేశాన్ని విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. దేశ వినాశకరమైన మత మార్పిడిలు మత రిజర్వేషన్లు అంబేద్కర్ తీసుకొచ్చిన సామాజిక హక్కులను కాలరాసే ప్రయత్నం కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని ఆయన అన్నారు. దేశ మూలవాసులైన హిందువులను వదిలి ముస్లిం మైనార్టీలపై ప్రేమ వలకబోస్తున్నారని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పట్ల కాంగ్రెస్ అనుకూలంగా లేదన్న విషయం ఈ ఎన్నికల్లో బయటపడుతుందని ఆయన అన్నారు. అమలుకు వీలు కానీ అనేక వాగ్దాలనాలు ఇచ్చి తెలంగాణ ప్రజలను వంచనకు గురి చేసిందని వారన్నా రు. తెలంగాణ రాష్ట్ర ం ఏర్పడిన తర్వాత మొదటిసారి అధికారంలోకి వచ్చిన బిఆరఎస్ ఈ రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని అన్నా రు. ఇటీవల అధికారం చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నాడని ఆయన విమర్శలు గుప్పించారు. పందిరి కింద ఉన్న రాముడికి గుడి కోట్లాది ప్రజల విశ్వాసం కలిగిన రామ మందిరాన్ని నిర్మించి రామభక్తిని చాటుకున్నామన్నారు. 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఉచిత చికిత్స చేయడం తమకే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కోట్లాది రూపాయలు ఈ రాష్ట్రనికి పంపానని వాటిని ప్రజలకు చెరకుండా అక్రమార్కులజేబులునిండాయని మండిపడ్డారు.

**ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాత మోడీ**

మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి అరుణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అబ్బురపడేలా పరిపాలన సాగిస్తున్న మోడీ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తాడు. మీ ఆడబిడ్డగా ఈ ప్రాంతం నుండి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నాను. అత్యధిక ఓట్లను వేసి ఆశీర్వదించాలని కోరుతున్నాను. తెలంగాణలో మొత్తం సీట్లు గెలిపించేలా ప్రజలు భరోసా ఇవ్వాలని కోరారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి డీకే అరుణ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్ ప్రసాద్, నాయకులు నాగురావు నామాజీ బ్రహ్మచారి ఎమ్మెల్సీ ఏవి ఎన్ రెడ్డి దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

## 'ఓటుహక్కు ఓ వజ్రాయుధం'



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని , ప్రతి ఓటరు విజ్ఞతతో ఓటుహక్కు వినియోగించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా స్వీప్‌నోడల్ అధికారి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి చిన్న ఓబులేష్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లశాతాన్ని పెంచేందుకు ఎన్నికల స్వీప్, డిఆర్‌డిఎ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని బస్టాండులో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతికశాఖ కళాకారులు ఓటరు చైతన్య పాటలద్వారా చైతన్యపర్చి ఓటర్లశాతాన్ని పెంచుతారంటూ ప్రతిజ్ఞచేశారు. ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాలమేరకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

## 'భరత్ ప్రసాద్ గెలుపు ఖరారైంది'

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా నిర్వహించబోయే విజయ సంకల్ప సభ ఏర్పాట్లను పరిశీలించి అనంతరం లక్ష్మీ కృష్ణ గార్డెన్‌లో మండల అధ్యక్షులు సమావేశంలో కేంద్రమంత్రి డా.ఎల్ . మురుగన్ మాట్లాడారు. బీజేపీ జాతీయ పార్టీ లక్ష్యం అప్ కి బార్ చార్ సవ్ పార్ సీట్లలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం ఉండనున్నదని బీజేపీ గెలుపు ఎప్పుడో ఖరారు అయిపోయిందని మెజార్టీ దిశగా రేపు విజయ సంకల్పసభ నిర్వహిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో 400 కు పైగా రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు బీజేపీ గెలవబోతుందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడిపోతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారని తప్పుడు ఆరోపణలు మార్ఫింగ్ వీడియోలతో అడ్డంగా దొరికిపోయి తెలంగాణ రాష్ట్ర ప్రజల గౌరవాన్ని మూసి పాలు చేశాడన్నారు. వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రఘునందన్ రెడ్డి,ఆశోక్‌రెడ్డి, హరిప్రసాద్, రామన్ గౌడ్, రమణ వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాములు, కుమారస్వామి,శ్రీను, ప్రభాకర్, రాము,శివారెడ్డి, అశ్విని, రాధా , సుమిత్రమ్మ, రాఘవేందర్‌గౌడ్ ఉన్నారు.

## 'తులం బంగారం' జాడ లేదేమి?

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల మండలంలోని చర్లపల్లి, అల్వాన్‌పల్లి, యాసాయి కుంట, గ్రామాలలో మహబూబ్‌నబగర్ పార్లమెంటు అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి కి మద్దతుగా ప్రచారం చేసిన జిల్లా జడ్పి వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య మాట్లాడారు. ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రతి ఆడ బిడ్డా పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం ఎక్కడ అన్నారు. ఆసరా పెన్షన్ దారుకు 4000 రూపాయలు , 500 గ్యాస్ కనెక్షన్లు ప్రతి విద్యార్థికి ఎలక్ట్రానిక్ స్కూటీ ఇస్తానని ఓట్లు వేసుకుని ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డి కి ఓట్లు వేస్తామన్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రఘుపతి రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్, ప్రణీల్ చందర్, ముడా డైరెక్టర్ ఇంతియాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, గిరి యాదవ్, మాజీ సర్పంచు శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి

ప్రజాపక్షం/జడ్చర్ల: మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని గుండప్ప కాంపౌండ్ లో 891 వ బసవ జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి బసవేశ్వర చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు సమసమాజ స్థాపన కోసం పోరాటం చేశాడని, ఆయ న అన్ని వర్గాలను అన్ని మతాలను సమానంగా చేశారన్నారు. వీరశైవ లింగయత్ సభ్యులు రాష్ట్ర సంగీత అకాడమీమాజీ చైర్మన్ బాద్మి శివకుమా , ముంద్రతి శివకుమార్, జీవన్, అమర్నాథ్, రవి శంకర్, రజిని, గణేష్, అశోక్, సురేష్, పెంటయ్య, దృవ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## నంచర్లలో జోరుగా బిజెపి ప్రచారం

ప్రజాపక్షం/మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో బిజెపి యువ నాయకుల ప్రచారం జోరుగా సాగుతుంది. ప్రచారంలో భాగంగా నంచర్ల గ్రామంలో యువకులంతా కలిసి పశువుల కాపరి దగ్గరికి గోర్ల కాపరి దగ్గరికి వెళ్లి మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, బూత్ ఇంచార్జి మున్నూర్ చందు, బిఎల్ఎ టు షేవకు శ్రీనివాసులు కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రిసివింగ్ కేంద్రంలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశమందిరంలో రిసివింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహించే సిబ్బంది అత్యంత జాగ్రత్తగా పకడ్బందీ విధులు నిర్వహించాలనిసూచించారు.

## పొలాలు, చెరువుల చెంత ప్రచారం

ప్రజాపక్షం/ కొత్తకోట: కొత్తకోట మండలంలోని రామనంతపురంలో ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంధ్య, ఉశన్న, మాజీ ఎంపీటీసీ పరిష రాములు, నాయకులు పరుశరాములు, ఎల్ఐసీ కురుమన్న, రాజు, సతీష్ కుమార్ రెడ్డి, రంజిత్ రెడ్డి, యాదయ్య, అంజన్న, స్వామి, కురవన్న, కురుమూర్తి, లక్ష్మీ కాంత్ , తిమ్మారెడ్డి, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## రంగాపురంలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాపక్షం/ పెబ్బేరు : రంగాపురంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరు అందుకుంది. నాగర్‌కర్నూల్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరేసే దిశగానాయకులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం సాగించారు. సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, నాయకులు సాయిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కోటీశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పెద్దింటి రామకోటి,ఎస్సీసెల్‌కార్యదర్శిదారపోగువెంకటేష్,లక్ష్మణ్‌బాలస్వామి ఉన్నారు.

## ఐక్యరాజ్యసమితి పూర్తిస్థాయి సభ్యత్వానికి అర్హత పొందిన పాలస్తినా : భారత్ ఓటు

ఐక్యరాజ్యసమితి : ఐక్యరాజ్యసమితిలో పూర్తిస్థాయి సభ్యత్వం పొందదానికి పాలస్తినా అర్హత పొందిందనీ, భద్రతా మండలి కూడా ఈ విషయాన్ని సానుకూల దృష్టితో పునఃపరిశీలన చేయాలని కోరుతూ శుక్రవారం జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా 143 దేశాలు ఓటు వేశాయి. భారత్ కూడా ఈ ఓటింగ్‌లో పాల్గొన్ని పాలస్తినాకు మేలు చేసేవిధంగా ఈ ముసాయిదాకు అనుకూలంగా ఓటు వేసింది. వ్యతిరేకంగా తొమ్మిది దేశాలు ఓటు వేయగా, 25 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. ఈ విషయంపై ఇజ్రాయిల్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఉగ్రవాద దేశానికి ఐక్యరాజ్యసమితిలో ఏ విధంగా సభ్యత్వం ఇచ్చి ఆహ్వానించి మీ సరసన కూర్చోబెట్టుకుంటారని ఇజ్రాయిల్ దౌత్యవేత్త నిలదీశారు. ''పాలస్తినా రాజ్యం ఐక్యరాజ్యసమితిలో పూర్తిస్థాయి సభ్యత్వం పొందడానికి అర్హత పొందింది. ఐక్యరాజ్యసమితి హక్కుల తీర్మానచట్టంలోని నాలుగవ అధికరణలోని నిబంధనలకు అనుగుణంగా ఈ అర్హత పాలస్తినాకు లభించింది అందువల్ల ఇకమీదట పాలస్తినాను ఐక్యరాజ్యసమితిలో ఒక సభ్యురాలుగా చేర్చుకోవాలి'' అని ముసాయిదా తీర్మానం ప్రతిపాదించింది. ఈ ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా 143 దేశాలు ఓటు వేశాయి. పాలస్తినా లిబరేషన్ ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇచ్చిన అరబ్బేతర దేశాలలో మొట్టమొదటిదేశం భారత్ మాత్రమే. 1974లో భారత్ పిఎల్‌ఓకు గుర్తింపు ఇచ్చింది. 1988లో పాలస్తినాకు దేశం అనే హోదా ఇవ్వాలనిగుర్తించిన తొలి దేశాల జాబితాలో కూడా భారత్ ఉంది. ఈ మేరకు గాజాలో భారత్ పాలస్తినా అథారిటీ ప్రతినిధి కార్యాలయాన్ని 1996లో తెరిచింది. ఆ తర్వాత ఈ కార్యలయాన్ని 2003లో రమల్లాకు తరలించింది. 193 దేశాలు సభ్యులుగా ఉన్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలోతీర్మానానికి వచ్చింది. అరబ్ గ్రూపు దేశాల చైర్మన్‌గా ఈ తీర్మానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రవేశపెట్టింది. భద్రతా మండలిలో వీటో చేసిన కారణంగా పాలస్తినా సభ్యత్వ విషయం ఐక్యరాజ్యసమితిలో ఆమోదం పొందలేదనీ సమితిలో ఉన్న భారత దౌత్యవేత్త రుచిరా కాంభోజ్ చెప్పారు. ఈ తీర్మానం అమలయ్యేట్టు చూస్తామని ఆమె ఈనెలారంభంలోనే చెప్పారు.

## 'అభివృద్ధిలో భాగం పంచుకోండి'



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మహబూబ్‌నగర్ అభివృద్ధిలో మీరు భాగం పంచుకోండి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వారిని ఉద్దేశించి మాట్లాడారు. పాలమూరు భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలు మీ తీర్పు వల్ల రేవంత్ రెడ్డి గౌరవంతో పాటు మన భావితరాలకు బంగారు బాటలు వేసిన వాళ్లం అవుతాం అని ఆయన చెప్పారు. ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు నాకు మరో రెండు పార్టీల అభ్యర్థులకు మధ్య జరిగే ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు మన పాలమూరుకు అభివృద్ధి ఫలాలను అందించే ఎన్నికలు అని, ఎన్నాళ్ల నిరీక్షణ ఫలమో అని ఆయన చెప్పారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కష్ణారావు మాట్లాడుతూ మీ యొక్క ఆర్థిక పరిస్థితిని పెంచేందుకు మీకు అండగా ఉంటానని, మీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# 'పదేళ్లలో మతోన్మాద బిజెపి చేసిందేమీ లేదు'

### సిపిఐ జిల్లా నాయకులు



ప్రజాపక్షం / పాన్‌గల్ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని సిపిఐ నాయకులు శుక్రవారం మండల కేతేపల్లి భగత్ సింగ్ నగర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి మల్లురవికి ఓటేయాలలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ అధ్యక్షులు కేతేపల్లి సర్పంచ్ కళావుతున్న, ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కె. శ్రీరాం మాట్లాడారు. బీజేపీ పేదల , రైతుల మహిళల, యువజనుల అభివృద్ధికి చేసింది ఏమి లేదన్నారు. మోడీ హామీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి రైతు ఖాతాలు రూ. 15 లక్షలు, రైతు ఆదాయం రెట్టింపు, 100 రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరల తగ్గింపు హామీలు నెరవేర్చలేదన్నారు. పెట్రోల్ , డిజిల్ ధరలు పెరిగాయని అన్నారు.ప్రజల సమస్యలు పరిష్కరించకుండా మతం రాముని పేరుతో ఓట్లు ఆడగటం దుర్మార్గమన్నారు.కేసిఆర్ 10 ఏళ్లలో నీల్లు నిధులు నియామకాలు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల , డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వలేదన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ గెలిస్తేనే దేశంలో ప్రజాస్వామ్యం ఉంటుందని, ఈసారి బీజేపీ గెలిస్తే ఇక ఎన్నికలు ఉండమన్నారు. కాంగ్రెస్ ఓటు వేయాలి అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మాజీ కార్యదర్శిశివకుమార్, మండల కమిటీ సభ్యులు పెద్ద హన్మంతు, పరశురాములు, మాల కుర్మయ్య, కురువ హన్మంతు పాల్గొన్నారు.

## చర్లపల్లి జైలును సందర్శించిన ప్రొబేషనరీ ఐఎఎస్‌లు



ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి కేంద్ర కారాగారంను 7గురు ప్రొబేషనరీ ఐఏఎస్‌లు శ్రద్ధా శుక్లా,కిరణ్ మయి కొప్పిశెట్టి,నారాయణ్‌అమిత్ మాలెంపాటి వికాస్ మహతో, ఉమాశంకర్‌ప్రసాద్,మయాంక్‌సింగ్, యువరాజ్, ఓరియంటేషన్ శిక్షణలో భాగంగా డాక్టర్ శ్రీనివాస్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జైలు రోజువారి పారిపాలన,ఖైదీల షెడ్యూల్, ఆసుపత్రి, బ్యారక్స్, పరిశ్రమలు, సాధారణ వంటగది,శానిటైజర్ యూనిట్‌ల గూర్చి పర్యవేక్షణాధికారి సంతోష్‌రాయ్ వివరించారు.ఖైదీలకు అందించే భోజనం రుచి,వివిధ కార్యక్రమాలను చూసి వారు ప్రశంసించారు. ఉప పర్యవేక్షణాధికారి కాళిదాస్,శశికాంత్,జైలర్లుతదితరులుపాల్గొన్నారు.

ప్రజాపక్షం
# మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
మహబూబ్‌నగర్ | శనివారం | 11 మే 2024 | 11

## చర్లపల్లి పిఎస్‌లో వాహనాల తనిఖీ



ప్రజాపక్షం/చర్లపల్లి: ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు తనిఖీ చేస్తున్నామని సిఐ రవీందర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు, స్పెషల్ పోలీసులతో కలసి తనిఖీలు ముమ్మరం చేశారు.రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ రవీందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే విధంగా చర్లపల్లి పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం చర్లపల్లి చౌరస్తాలో కవాతు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హరిందర్,నరసింహరావు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మాయమాటలకు జవాబు చెప్పాలి

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్



ప్రజాపక్షం/ జగద్గిరిగుట్ట: ఇండియా కూటమి సిపిఐ పార్టీ బలపరిచిన మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డిని గెలిపించుకుంటామని ఎఐటియుసి, మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ బస్తీలో సిపిఐ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ధన్ జన్ యోజన అకౌంట్లో జమ చేస్తానని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కూడా తొలగించి నిరంకుశ పాలన చేస్తున్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్నటువంటి భారతీయుల్లో మతం పేరుతో మత విద్వేషాలు ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలుపరచి మనుధర్మ శాస్త్రన్ని తీసుకురావాలని భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. తీసుకువచ్చిన భారత రాజ్యాంగాన్ని మార్చాలని రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్నాడు. ఆదాని అంబానీ లాంటి బడా పెట్టుబడిదారుల కొమ్ముగాస్తున్నారు. కావున ప్రజలు బిజెపి చెప్తున్నా మాయమాటలకు సరైన జవాబు తమ ఓటు హక్కుతో తెలియజేయాలని, లౌకిక వాదాన్ని కాపాడాలని సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య, వి.చంద్రమ్మ, శాఖ కార్యదర్శి యాకూబ్, విద్యాసాగర్ ఖాదర్ భాయ్, గులాం,ఇమాంబి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం



ప్రజాపక్షం/చర్లపల్లి: సునీతమహేందర్‌రెడ్డికి మద్దతుగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని కాలనీలలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మల్కాజ్ గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి మద్దతుగా ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పరమేశ్వరరెడ్డి డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ, సోనియాగాంధీ నగర్ ఫేస్1, 2, 3, టీచర్స్ కాలనీ, మారుతీ నగర్ కాలనీ, కటింగ్ కాలనీ, రెడ్డి కాలనీలలో ఇంటింటికీ తిరుగుతూ పాదయాత్ర చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతోనే మల్కాజ్‌గిరి అభివృద్ధి సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి,డివిజన్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి,పోచయ్యగౌడ్,గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో...**

మల్కాజ్‌గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కోఆప్షన్ సభ్యులు అదం షఫీ,సీనియర్ నాయకులు సత్యం సాగర్‌లు ఈస్ట్ గాంధీ నగర్ ఫేస్2లో గడపగడపకు తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,లింగారెడ్డి,ప్రభాకర్,ఖాజా,రాజిరెడ్డిలు ఉన్నారు.

## యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా శంకర్ యాదవ్



ప్రజాపక్షం/బంట్వారం : వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా గా శంకర్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సతీష్ రెడ్డి నియమించడం జరిగింది. శంకర్ యాదవ్‌కు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మండల పార్టీ అధ్యక్షులు వేంకటేశం ఆధ్వర్యంలో నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు...కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్నా ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు తనకు ఇచ్చినందుకు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కూమార్,జిల్లా అధ్యక్షులు సతీష్ రెడ్డి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గడపగడపకూ కాంగ్రెస్...

ప్రజాపక్షం/కోట్‌పల్లి: పార్లమెంటు చెవెళ్ళ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోట్‌పల్లి మత్స్యశాఖ మాజీ అధ్యక్షుడు నక్కల బందెయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గడపగడపకు తిరుగుతూ... రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగియగానే 6 గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల అనంతరం ఇళ్ళు లేని అర్హులైన ప్రజలందరికీ ఇళ్ళను ఇచ్చేందుకు సిద్దంగా ఉందని అన్నారు. చెవెళ్ళ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి




ప్రజాపక్షం/చర్లపల్లి: మహాత్మా బసవేశ్వర 891వ జయంతి సందర్భంగా కాప్రా వీరశైవ సమాజం,యువ కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇసీఐఎల్ చౌరస్తాలో బసవేశ్వర విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ, పులిహోర ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పావనీరెడ్డి, నాయకులు కొత్త అంజిరెడ్డి, రాఘవరెడ్డి, సభ్యులు యావపురం విశ్వనాథం,గంగా ఈశ్వరయ్య,శశికుమార్, బండేగౌడ, రాజేశ్వర్, యావపురం రవి, భీమ్ శంకర్, జ్ఞానేశ్వర్,కత్తి శివానంద,శివ,శంభులింగం,మటమ్ శివ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి ప్రచారం

ప్రజాపక్ష్యం /కోట్‌పల్లి: పార్లమెంటు ఎన్నికల్లో చెవెళ్ళ బిజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలని సీనియర్ నాయకులు పతంగి పాండు అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ళు పాలించి పేదల రక్తాన్ని తాగి కేసీఆర్ కుటుంబం దోచుకుందాని అన్నారు. అందుకే నేడు బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన అబద్దపు హామీలతో ప్రజలను మోసం చేసిందని, ఇచ్చిన హామీలే అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. తప్పదు హామీ లతో ప్రజలను మోసం చేస్తే నేడు ఊరుకోరని అన్నారు. నేడు గ్రామాల్లో బీజేపీ కి మద్దతుగా ప్రజలు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టి. రా.ఉ, తుమ్మలి రాజు, ఆశోక్ తదితరులున్నారు.

# జనజాతర సభను విజయవంతం చేయండి

### సిఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి




ప్రజాపక్షం/తాండూరు: తాండూరులో ఈ నెల 11న ఉదయం నిర్వహించే జనజాతర సభను విజయవంతం చేయాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం సలహా దారుడు వేం నరేందర్‌రెడ్డిలు కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం తాండూరు పట్టణంలో నిర్వహించే జనజాతర సభకు ఎఐసిసి జనరల్ సెక్రేటరి ప్రియాంక గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. ఇట్టి జనజాతర సభ వేదికను స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డితో కలసి శుక్రవారం రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ల, సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిలు పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తాండూరులో నిర్వహించే జనజాతర సభకు లక్ష మందికి పైగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని వెల్లడించారు. ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల ఎన్నికలలో 180స్థానాలకు పోలింగ్ పూర్తి కాగా అందులో 155 ఎంపి స్థానాలకు పైగా ఇండియా కూటమి విజయం సాదించడం ఖాయమని దీమా వ్యక్తం పర్చారు. ఇండియా కూటమి ప్రభంజనను చూసి ప్రధాని మోది భయపడుతున్నారని తెలిపారు. దేశంలో సెక్యూలర్ పార్టీలను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. దేశంలో మరో మారు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యంగాన్ని మార్చడం ఖాయమని, ఆ లాంటి పార్టీలను ప్రజలు దూరం పెట్టాలని కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయని వివరించారు. దేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ఆకర్షితులైన వారిలో 17వ స్థానంలో నిలువడం సంతోషదాయకమని చెప్పుకొచ్చారు.ఇచ్చిన మాటలకు కట్టుబడిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు.అందులో మహిళలకు ఉచిత బసు ప్రయాణం ఎంతో మేలు చేకూర్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఉచిత కరెంటు పేరిటా ప్రజలకు నెలకు రూ.2వేలు మేలు చేకూర్చడం జరిగిందని గుర్తు చేశారు.ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహరాజ్, పార్లమెంట్ ఎన్నికల తాండూరు అసెంబ్లి ఇంచార్జీ మహేష్‌కుమార్, నాయకులు కొండల్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ తదితరులు ఉన్నారు.

## పార్లమెంటు ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యప్తంగా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఆర్‌ఎస్ అధికారి రాజీవ్ చావ్ అన్నారు. శుక్రవారం లోక్ సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంసిసి ,ఎస్ఆర్ఎస్ , సివిజిల్ ,ఎంసిఎం సి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్థిలు చేసే ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకల మేరకు జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను అదేశించారు.

ఎన్నికల టింలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద చూపించాలని ,జిల్లా లో నియోజకవర్గాల వారిగా ఎన్నికలకు సంబంధించిన కుర్చల వివరాలను పూర్తి సమాచరము అందించాలని అధికారులను అదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అన్ని సెంటర్లను పరిశీలించారు. ఈ కా ర్యక్రమంలో డిఆర్‌డిఒ శ్రీనివాస్, చేన్నమ్మ, రాం బాబు, సురేష్, మహేందర్ తదితరులు పాల్గోన్నారు.

## సునీత విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: పార్లమెంట్ ఎన్నికలు దేశభక్తుల మధ్యన దేశద్రోహుల మధ్యన జరుగుతున్న పోరు, కార్మిక రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం అని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ లో మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిసునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పార్లమెంట్ ఎన్నికలు దేశభక్తుల మధ్యన దేశద్రోహుల మధ్యన జరుగుతున్న ఎన్నికలని దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రాణాలను త్యాగం చేసిన ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ కాంగ్రెస్ దేశభక్తుల మధ్యన మతోన్మాద బీజేపీ మధ్యన జరుగుతున్న పోరు అని అన్నారు. భారతదేశ లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడిన కాంగ్రెస్కు ఓటు వేయాలని కోరారు. నరేంద్ర మోడీ బిజెపి కార్మిక చట్టాలను కాలరాశి కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు బుద్ధి చెప్పాలని కార్మిక రాజ్యం కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్ట్ కార్పోరేటర్ గూడవరమ్మ, రేవంత్ రెడ్డి,యువసేన సాయి, ప్రవీణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, శేఖర్, మహిళా నాయకురాలు బత్తిని నాగమణి, సులోచన, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్




ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: వామపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్ నుండి జగద్గిరిగుట్ట వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ కి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్‌లు హాజరై మాట్లాడుతూ బీజేపీ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్,డీజిల్ గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, దళితులు, మహిళల పై అత్యాచారాలు, నిరుద్యోగం, విద్వేష పెరిగిపోయాయని వీటి గురించి మాట్లాడకుండా ప్రజలను మతం, దేవుడు పేరిట మభ్య పెట్టడానికి చూస్తున్నారని, కానీ ప్రజలు అన్ని తెలుసుకున్నారని కావున బీజేపీ ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు హరినాథ్, స్వామి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, మునిసిపల్ అధ్యక్షుడు రాములు, సదానంద్ శాఖ కార్యదర్శులు వెంకటేష్, సాయిలు, సహదేవరెడ్డి, శేఖర్ సుధాకర్, మహిళ సంఘం అధ్యక్షురాలు హైమవతి, ఇమామ్, నర్సింహ, రాజు, చారి, చంద్రమ్మ, సుజాత, కలమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం : భీం భరత్



ప్రజాపక్షం/నవాబుపేట్ : ఐదుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ పార్టీయే అభయ హస్తమని చేవెళ్ళ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ పామేనా భీం భరత్ చెప్పారు. శుక్రవారం నవాబుపేట్ మండలంలోని ఎల్లకొండ, గంగ్యాడ, మాదిరెడ్డి పల్లి గ్రామాలలో ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి కీ మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ కొంపల్లి యాదవరెడ్డి, పామేనా భీం భరత్ గడప గడప ప్రచారం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడ మే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వమన్నారు. 3 ఐదు నెలలు కాకముందే ఐదు గ్యారంటీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ఈ ఆరు గ్యారెంటీ పథకాల్లో కూడా మహిళలకే పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా మహిళలకు బస్సు సౌ కర్యం కల్పించామన్నారు. మహిళలకు 500కే గ్యాస్ కలెక్షన్, 200 యూ నిట్ల వరకు ఉచిత కరెంటును అందించామని తెలిపారు. ఉమ్మడి రంగారె డ్డిలో ఎలక్షన్ కోడ్ ఉన్నందున మనకు ఉచిత విద్యుత్ రావడం లేదని అ న్నారు. పొల్యూషన్ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు పోలీస్ మధుసుధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ కౌకుంట్ల బందయ్య గౌడ్, మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకటరెడ్డి, కొండల్ యాదవ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపురం ప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు ప్రభావతి,ఎంపిటిసి ఎగ్బల్, మాజీ సర్పంచ్‌లు రావుగారి వెంకట్ రెడ్డి, బొబ్బిలిగా మ శ్రీనివాస్ గౌడ్,రఫీ,ఉపాధ్యక్షులు శివప్రసాద్, ప్రభాకర్ రెడ్డి,సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి బానూరి ఉపేందర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు గుండాల శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి,ప్రభాకర్,మల్లేశం,ఆనందం, మంజుల, జ్యోతి,ఎం యాదయ్య, వెంకట్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కాంగ్రెస్ పెద్దపీట

ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్ : శుక్రవారం మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రె డ్డి గెలుపును కాంక్షిస్తూ కు త్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని కెవిఆర్ కన్వెన్షన్ హాల్ నందు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన నారి న్యాయ్ సమ్మేళనంకి ముఖ్య అతిథిగా అల్ ఇండియా మహిళా కాం గ్రెస్ ప్రెసిడెంట్ అల్కా లాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఏఐసీసీ కుత్బుల్లాపూర్ పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ జ్యోతి మణి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ కో ఆర్డినేటర్ శోభారాణి, కుత్బుల్లాపూర్ని యోజకవర్గ కాంగ్రెస్ట్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టిపీసీసీ ప్రధాన కార్యదర్శిలు నర్సారెడ్డి భూపతి రెడ్డి, జ్యోత్స్న శివా రెడ్డి, పున్నా రెడ్డి, ఎన్ఎంసి మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ని మహిళలు తప్పకుండ తమ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతిపై సిఎస్‌ను కలిసిన ఉద్యోగులు

### కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

ప్రజాపక్షం / హైదరాబాద్ : సెక్రటేరియట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాహుల్ అనుమానాస్పద మృతి చెందిన ఘటనపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఎఎస్ రాణి కుమిదిని పేషీలో ఔట్ సోర్సింగ్ కింద 11 ఏండ్లుగా పనిచేస్తున్న రాహుల్ ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు అకస్మాత్తుగా కింద పడిపోవడంతో వెంటనే స్పందించిన సహచర సిబ్బంది అంబులెన్సుకు ఫోన్ చేశారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్ కు తరలించినప్పటికీ వైద్యానికి డబ్బులు ఎక్కువ అవుతాయనే కారణంగా నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు గుండె శస్త్ర చికిత్స ఆపరేషన్‌తో పాటు డయాలసిస్ చేశారు. ఆపరేషన్ అనంతరం 48 గంటల అబ్జర్వేషన్‌లో ఉంచుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 9 గంటలకు రాహుల్ మృతి చెందారు. 33 సంవత్సరాల రాహుల్ పురాణ పుల్ కు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. సీనియర్ అధికారిణి రాణి కుమిదిని సీరియస్‌గా మందలించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉంటుందని ఉద్యోగులు అనుమానిస్తు ఈ ఘటనపై సెక్రటేరియట్ ఉద్యోగులు చీఫ్ సెక్రటరీ శాంతి కుమారిని కలిసి, రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు పి.సాయిబాబా



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ నా యకత్వంలోని ఎన్‌డిఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఎల్.బి.స్టేడియం లో శుక్రవారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు దోమల్ గూడలోని టిడిపి నగర పార్టీ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని అత్యధిక మేజారిటీతో గెలిపించేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. సభకు వెళ్లిన వారిలో నగర పార్టీ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, యాదగిరి రావు, పరుశురామ్, వెంకటేశ్ చౌదరి, కట్టా రాములు తదితరులు ఉన్నారు.

**Format C-1**

(For Candidate to publish in news Papers, TV)

**DECLARATION ABOUT CRIMINAL CASES**

(As per the Judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of the Candidate : **MOUTAM SAMPATH**
**S/o Ramulu**, Age: 34 Years,
Resident of H.No: 8-133,
Kamalapur Village and Mandal of
Hanamkonda District (Warangal Urban District)T.S

Name of the Political Party : **INDEPENDENT**

Name of the Election : **HOUSE OF PEOPLE (LOK SABHA)**

Name of the Constituency : **7-MALKAJIGIRI LOK SABHA CONSTITUENCY**

I, **MOUTAM SAMPATH** , a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending Criminal Cases**

| Sl. No | Name of court | Case No. and Dated | Status of cases | Section(s) of Acts concerned and brief Description of offence |
|---|---|---|---|---|
| 1 | 2nd Addl.J.M.FC at Huzurabad | CC No: 407/2021 2nd Addl.JMFC Huzurabad In Cr.No: 2/2021 P.S.Veenavanka | Trail | U/s290,323,505,324,427 r/w 34 IPC Illegally trespassed into victims and beat him and threatened him with dire consequence |

**(B) Details about the cases of conviction for criminal offences**

| Sl.No: | Name of Court &date(s) of order(s) | Description of offence(s) and Punishment Imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| | Not Applicable | Not Applicable | No Applicable |

# క్రీడ

# గుజరాత్ గెలిచింది.. నిలిచింది





ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన దూ ఆర్ డై మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ పంజా విసిరింది. అహ్మదాబాద్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన పోరులో 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ప్లేఆఫ్స్ ఆశలను గుజరాత్ సజీవంగా ఉంచుకుంది. మరోవైపు సీఎస్కే టాప్4లోనే కొనసాగుతున్నప్పటికీ తదుపరి దశకు చేరుకొనే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 231 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (104; 55 బంతుల్లో, 9x4, 6x6), సాయి సుదర్శన్ (103; 51 బంతుల్లో, 5x4, 7x6) శతకాలతో విరుచుకుపడ్డారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 210 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చెన్నై బౌలర్లలో తుషార్ (2/33) రెండు వికెట్లు తీశాడు. అనంతరం ఛేదనకు దిగిన సీఎస్కే 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 196 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (63; 34 బంతుల్లో, 7x4, 3x6), మొయిన్ అలీ (56; 36 బంతుల్లో, 4x4, 4x6) అర్ధశతకాలతో పోరాడారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మోహిత్ శర్మ (3/31) మూడు, రషీద్ ఖాన్ (2/38) రెండు వికెట్లతో సత్తా చాటారు. చెన్నైకు పేలవారంభం దక్కింది. 10 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. రచిన్ రవీంద్ర (1; 2 బంతుల్లో), ఇంపాక్ట్ ప్లేయర్ అజింక్య రహానె (1; 5 బంతుల్లో), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (డకౌట్; 3 బంతుల్లో) వరుసగా పెవిలియన్‌కు చేరారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన అలీ, మిచెల్ ఇన్నింగ్స్ చక్కదిద్దారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 57 బంతుల్లో 109 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో డారిల్ మిచెల్ 27 బంతుల్లో, అలీ 31 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించారు. అయితే అర్ధశతకాలు సాధించిన అనంతరం వీరిద్దరు ఔటయ్యారు. కుదురుకున్న మిచెల్‌ను మోహిత్ శర్మ పెవిలియన్‌కు చేర్చాడు. తర్వాత వచ్చిన శివమ్ దూబె (21; 13 బంతుల్లో, 2x4, 1x6), రవీంద్ర జడేజా (18; 10 బంతుల్లో, 2x4, 1x6), మిచెల్ శాంట్నర్ (డకౌట్; 11 బంతుల్లో) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయారు. ఆఖర్లో ధోనీ (26*; 11 బంతుల్లో, 1x4, 3x6) సిక్సర్లతో అలరించాడు.

**గిల్ - సుదర్శన్ మెరుపు శతకాలు**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ ఆది నుంచే దూకుడుగా ఆడింది.గిల్‌సుదర్శన్ నువ్వానేనా అన్నట్లుగా పోటీపడుతూ పరుగులు సాధించారు. ఈ క్రమంలో 25 బంతుల్లో గిల్, 32 బంతుల్లో సుదర్శన్ అర్ధశతకం సాధించారు. హాఫ్ సెంచరీ అనంతరం వాళ్ల విధ్వంసం కొనసాగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 12.4 ఓవర్లలో గుజరాత్ 150, 16.2 ఓవర్లలో 200 స్కోరు మార్క్‌ను అందుకుంది. మరోవైపు గిల్, సుదర్శన్ శతకాలు బాదారు. ఇద్దరూ 50 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకున్నారు. అయితే సెంచరీ సాధించిన తర్వాత గిల్, సుదర్శన్ పెవిలియన్‌కు చేరారు. 18వ ఓవర్లలో ఓపెనర్లు ఇద్దరిని తుషార్ దేశ్‌పాండే పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత గుజరాత్ స్కోరు వేగం తగ్గింది. సీఎస్కే చివరి నాలుగు ఓవర్లలో 41 పరుగులే ఇచ్చింది.

# కెకెఆర్‌తో ఆడే తుది జట్టు ఇదే

ఐపీఎల్‌లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ముంబై ఇండియన్స్ శనివారం తలపడనుంది. ఇప్పటికే ఎలిమినేట్ అయిన ముంబై జట్టు ఓదార్పు విజయం కోసం, మరోవైపు కోల్‌కతా ప్లేఆఫ్స్ బెర్త్‌ను అధికారికంగా కైవసం చేసుకోవడం కోసం పట్టుదలతో బరిలోకి దిగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే ఇరు జట్లు ఓసారి తలపడ్డాయి. వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ ఘన విజయం సాధించింది. 12 ఏళ్ల తర్వాత వాంఖడేపై కోల్‌కతా తొలిసారి గెలుపు రుచి చూడటం విశేషం. ఇప్పుడు సొంతగడ్డపై ముంబైతో శ్రేయస్ సేన మరోసారి తలపడటానికి సిద్ధమైంది. అయితే ఈడెన్ గార్డెన్స్‌లో ముంబైకు మెరుగైన రికార్డు సొంతం. ఈడెన్ వేదికగా ఆడిన 13 మ్యాచ్‌ల్లో ముంబై పదింట్లో గెలిచింది. చివరిసారిగా ఈ గడ్డపై 2019లో ఆడగా 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయితే కేకేఆర్ భీకర బ్యాటింగ్ లైనప్కు బంతితో పాటు బ్యాటుతో కూడా రేపు సమాధానం చెప్పాలని ముంబై భావిస్తోంది. దానికి తగ్గట్లుగా తుదిజట్టులో మార్పులు చేయనుంది. కోల్‌కతాకు ప్రధాన బలం వాళ్ల ఓపెనింగ్ జోడీ. ఈ సీజన్‌లో సునీల్ నరైన్, ఫిల్ సాల్ట్ 180 స్ట్రైక్‌రేటుతో 548 పరుగులు చేశారు. ఈ నేపథ్యంలో ఆదిలోనే వికెట్ల వేట మొదలుపెట్టాలని ముంబై ప్లాన్ చేస్తోంది. స్టార్ బౌలర్ బుమ్రాతో పాటు గత కేకేఆర్ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన నువాన్ తుషారాపై అంచనాలు పెట్టుకున్నారు. అయితే బ్యాటింగ్‌లో నిరాశపరుస్తున్న నమన్ ధిర్‌కు బదులుగా ఎడమచేతి వాటం బ్యాటర్ నెహాల్ వదేరాకు ఛాన్స్ ఇవ్వాలని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తోంది. అయితే ఈడెన్ గార్డెన్స్‌లో ఫామ్‌లో ఉన్న కేకేఆర్‌పై గెలవాలంటే రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ తిరిగి ఫామ్‌లో రావాలి. గత అయిదు ఇన్నింగ్స్‌లో హిట్ మ్యాన్ అత్యధిక స్కోరు 11 మాత్రమే. మరోవైపు ఇషాన్ తన చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో 32 టాప్ స్కోర్. వీరిద్దరు తిరిగి ఫామ్‌లోకి వచ్చి, సూర్యకుమార్ యాదవ్ చెలరేగితే ముంబై ఇండియన్స్‌కు తిరుగుండదు.

**ముంబై ఇండియన్స్ తుదిజట్టు (అంచనా)**

ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ, నెహాల్ వదేరా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య (కెప్టెన్), టిమ్ డేవిడ్ అన్షుల్, పీయూష్ చావ్లా, జస్‌ప్రీత్ బుమ్రా, నువాన్ తుషారా.

# రీల్



## పవన్ విషయంలో చిరు మరోసారి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలకి బ్రేక్ ఇచ్చి పవన్ రాజకీయ విషయాల్లో ఫుల్ బిజీగా ఉన్నారు. మరి ఈ క్రమంలో పవన్‌కి తోడుగా అనేక మంది సినీ ప్రముఖులు హీరోలు కూడా సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. మరి వీరితో పాటుగా పవన్ పెద్దన్నయ్య మెగాస్టార్ చిరంజీవి కూడా ఒక వీడియో బైట్ రీసెంట్‌గా చేశారు. ఇది వైరల్‌గా మారగా తాజాగా చిరు మరోసారి పవన్‌పై ఆసక్తికర కామెంట్స్ చేయడం వైరల్‌గా మారింది. మొదటగా తాను ఏ రాజకీయ పార్టీ లోనూ లేను అని అలాగే కుటుంబపరంగా పవన్‌కి తాము అంతా ఎప్పుడు సపోర్ట్‌గానే ఉంటామని తెలిపారు. అతడు రాజకీయంగా ఎదగాలనే మనసా, వాచా కోరుకుంటున్నామని చిరు కామెంట్స్ చేశారు. దీనితో ఈ సరికొత్త కామెంట్స్ పవన్ విషయంలో పద్మవిభూషణ్ చిరంజీవి నిన్న తన పద్మ అవార్డు అందుకున్నాక ఇవాళ తెలిపారు. ఇక దీని తర్వాత చిరు మళ్ళీ తన భారీ చిత్రం విశ్వంభరలో బిజీ కానున్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తుండగా యూవీ క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ప్రారంభమైన అజిత్ ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ షూటింగ్




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్మాణ సంస్థలలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్, స్టార్ హీరో అజిత్ కుమార్‌తో తమ కొత్త ప్రాజెక్టును ఇటీవలే అనౌన్స్ చేసింది. గుడ్ బ్యాడ్ అగ్లీ అనే టైటిల్తో రూపొందే ఈ తెలుగు తమిళ ద్విభాషా చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ఈ రోజు హైదరాబాద్ లోని ఓ స్టూడియోలో ప్రారంభమైయింది. ఈ కీలక షెడ్యూల్ కోసం ఓ మ్యాసీవ్ సెట్ నిర్మించారు. హీరో అజిత్‌తో పాటు కీలక పాత్రధారులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రం 2025 పండుగకు విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం అధిక్ రవిచంద్రన్, నిర్మాతలు నవీన్ యెర్నేని వై రవిశంకర్, బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్, సంగీతం దేవి శ్రీ ప్రసాద్, డీవోపీ అభినందన్ రామానుజం, ఎడిటర్ విజయ్ వేలుకుట్టి, సిఇఓ చెర్రీ, స్టంట్స్ సుప్రీం సుందర్, కలోయన్ వోడెనిచరోవ్, స్టైలిస్ట్ అను వర్ధన్, పీఆర్వో వంశీ శేఖర్, మార్కెటింగ్ ఫస్ట్ షోలుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి నెలలో థియేటర్ల లోకి రానుంది.



## డిఫరెంట్ కాన్సెప్ట్ తో సందీప్ కిషన్ ‘మాయవన్’ టీజర్

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ సందీప్ కిషన్ వరుస చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. చివరిసారి గా ఊరు పేరు భైరవకోన చిత్రం లో కనిపించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. డిఫెరెంట్ స్క్రిప్ట్ లతో అలరించే సందీప్ కిషన్ మరోసారి ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తో ముందుకి వచ్చారు. సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ సివి కుమార్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ మాయవన్. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఏకే ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ లపై నిర్మిస్తున్న ఈ టీజర్‌ను నేడు రిలీజ్ చేశారు. రిలీజైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సినిమా మంచి ఎంటర్ టైనర్ లాగా ఉండనున్నట్లు టీజర్‌ను చూస్తే తెలుస్తుంది. నీల్ నితిన్ ముఖేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ఆకాంక్ష రంజన్ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ చిత్రం కి సంబందించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## ప్రతినిధికి మరో సీక్వెల్



టాలీవుడ్ ప్రముఖ హీరో నారా రోహిత్ హీరోగా చాలా రోజులు తర్వాత హీరోగా మళ్ళీ తన పొలిటికల్ హిట్ చిత్రం ప్రతినిధి కి సీక్వెల్ తో పలకరించేందుకు వచ్చాడు. అయితే ఈ చిత్రాన్ని ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దర్శకత్వంలో ప్లాన్ చేసిన చిత్రమే ఇది. మరి ఈ సినిమా ఈరోజే థియేటర్స్ లో రిలీజ్ కి తీసుకొచ్చారు. అయితే ఇంట్రెస్టింగ్ గా ఈ చిత్రానికి కూడా సీక్వెల్ ఉన్నట్టుగా ఇప్పుడు ఖరారు అయ్యింది. మరి ఈ సినిమాకి కొనసాగింపు సినిమా ఎలా ఉంటుందో చూడాలి. అలాగే ఇందుకు పార్ట్ 2 కూడా ఎలా రన్ అయ్యింది అనేది కూడా ప్రధాన అంశంగా తీసుకోవాలి. మరి ప్రతినిధి 2 ఎలాంటి రన్‌ని అందుకుంటుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో సిరిలెల్ల, దినేష్ తేజ్, సప్తగిరి, సచిన్ ఖేడేకర్ తదితరులు నటించగా మహతి స్వర సాగర్ సంగీతం అందించాడు. అలాగే కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు సిరి తోట అలాగే సురేంద్రనాథ్ బొల్లినేని లు నిర్మాణం వహించారు.

## కవిత బెయిలుపై మీ ఉద్దేశమేంటి?

### ఇడిని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ :** అవినీతి కేసులో నిందితురాలు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె, కె.కవిత బెయిలు పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అభిప్రాయం ఏమిటో చెప్పాలని ఢిల్లీ హైకోర్టు కోరింది. మద్యం విక్రేతల ప్రయోనాలకు అ నుకూలంగా ఢిల్లీ ఎక్సైజు విధానాన్ని రూపొందించారన్న ఆరోపణలపై కేసు దర్యాప్తులో భాగంగా కె.కవితను ఇడి అధికారులు అరెస్టు చేశారు. సౌత్ గ్రూ పు తరఫున ఆమ్ ఆద్మీపార్టీ నాయకులకు కవిత ముడుపులు సమర్పించారన్న ఆరోపణలపై హైదరాబాద్ జూబిలీహిల్స్‌లోని ఆమె నివాసంలో మార్చి 15న ఇడి అధికారులు అరెస్టు చేసి ఢిల్లీ జైలుకు తరలించారు.

## 90 శాతం పనులు పూర్తయిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ -2

### జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ 2లో 38 రిజర్వాయర్లకుగానూ ఇప్పటికే 13 పూర్తయి, అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 25 రిజర్వాయర్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినట్లు జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా చేసేందుకు జలమండలి చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ 2 లోని ప్యాకేజి 2లో ఉన్న మల్లంపేట (3 ఎంఎల్ సామర్థ్యం) రిజర్వాయర్‌ను సుదర్శన్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. అనంతరం అదే మండలంలోని బాచుపల్లి ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా 1250 కిలో మీటర్ల మేర కొత్త పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది దాదాపు పూర్తి కావచ్చినట్లు చెప్పారు. ఇన్ లెట్, అవుట్ లెట్ పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ల పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసేందుకు మొక్కలను పెంచాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## ప్రజ్వల్ రేవణ్ణ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

### సిబిఐ విచారణ అవసరం లేదన్న కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

**మైసూరు (కర్నాటక):** జెడిఎస్ నాయకుడు, కర్ణాటక సిట్టింగ్ ఎంపి, హసన్ నుంచి మరోసారి పోటీ చేసిన ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. పోలీసులమని చెప్పుకొంటూ కొంత మంది తనతో బలవంతంగా రేవణ్ణపై కేసు పెట్టించారని బాధిత మహిల ఒకరు ఆరోపించడంతో, ఆ దిశగా కూడా సిట్ విచారణను కొనసాగిచనుంది. రాజకీయ ప్రయోజనాలను ఆశించి, తప్పుడు కేసులు పెట్టించారని, దీనిపై సుఇబిఐతో విచారణ జరిపించాలని జెడిఎస్ చేసిన డిమాండ్‌ను కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తోసిపుచ్చారు. సిట్ సమర్థవంతంగా దర్యాప్తును నిర్వహిస్తున్నదని, సిబిఐ విచారణ అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు. మొత్తం మీద తనను బెదిరించి, కేసు పెట్టించారని ఓ బాధితురాలు ఆరోపించడం సంచలనం రేపింది. జాతీయ మహిళా కమిషన్ కూడా స్పందించడంతో, జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. జెడియు రాష్ట్ర అధ్యక్షుడు, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమార స్వామి ఇదంతా రాజకీయ కుట్రగా చెప్పుకొచ్చారు. బాధితులను సిట్ అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ, సిబిఐ విచారణకు డిమాండ్ చేశారు. కాగా, కుమార స్వామి విమర్శలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తోసిపుచ్చింది. సిట్ దర్యాప్తు సక్రమమైన మార్గంలో వెళుతున్నదని ప్రకటించింది. సిబిఐ దర్యాప్తు అవసరం లేదని తెలిపింది.

## హేమంత్ సోరెన్ బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** అవినీతి సొమ్మును లెక్కల్లో చూపించకుండా అక్రమంగా తరలించారన్న ఆరోపణల కేసులో తాత్కాలిక బెయిలు కోరుతూ, హైకోర్టుకు మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను వ్యర్థమైపోయిందని, పై కోర్టులో చెల్లుబాటు కానిదిగా మారిందని పేర్కొంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారంపెదవి విరుస్తూ కేసును మూసేసింది. కింది కోర్టు ఇప్పటికే ఈ విషయంలో తన తీర్పు చెప్పిందని ధర్మాసనం గుర్తుచేసింది. ‘‘ఇది (పిటిషన్) వ్యర్థమైపోయింది’’ అని ధర్మాసనం హేమంత్ సోరెన్ తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, అరునభ్ చౌధరిలకు స్పష్టం చేసింది. మే 3 వ తేదీన హైకోర్టు ఈ కేసులో తన తీర్పును వెల్లడించింది, అదే విషయాన్ని మళ్ళీ సోరెన్ పై కోర్టులో సవాలు చేశారు, అందువల్ల పిటిషన్ వ్యర్థమైపోయిందని ధర్మాసనం పేర్కొంది. మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడంపై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఈ విషయంలో మార్గదర్శకాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనవలసి ఉన్నందువల్ల తన అరెస్టుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన విజ్ఞప్తిపై హైకోర్టు తీర్పు ప్రకటించేంతవరకూ తనకు తాత్కాలికంగా బెయిలు మంజూరు చేయాలని హైకోర్టును కోరారు. గతవారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సోరెన్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) రాబోయే మూడు రోజుల్లో సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు రాబోతోందనీ, ఈ రెండు పిటిషన్లను కలిపి ఒకేసారి విచారణ జరపాలని కపిల్ సిబల్ ధర్మాసనాన్ని కోరారు. ఐతే ధర్మాసనం మాత్రం, స్పెషల్ లీవ్ పిటిషన్‌లో ఉన్న అభిప్రాయాలు అన్నీ మే 13న విచారణకు వస్తాయని ఆయనకు బదులు చెప్పింది. ‘‘ఆయన మాజీ ముఖ్యమంత్రి అనే విషయం మరచిపోండి, కానీ సోరెన్‌కు ఒక పౌరుడుగా హక్కులు ఉన్నాయి, ఒక పౌరుడుగా హైకోర్టు ఆయన కేసును న్యాయబద్ధంగా పరిష్కరించాల్సి ఉండాల్సింది’’ అని కపిల్ సిబల్ అన్నారు.

## తెలంగాణ గొంతు నులుమిన బిజెపిని చిత్తు చిత్తుగా ఓడించండి

**ప్రజా పక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గొంతు నులుమిన మోదీ సర్కార్‌ను గద్దె దించేందుకు ఆపార్టీ అభ్యర్థులైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించాలని,ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి హస్తం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ మద్దతుగా అంబర్‌పేట్, పటేల్ నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వ హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. .బడ్జెట్ ద్రవ్యలోటు పూడ్చడం పన్నుల ప్రోత్సాహానికి సహాయం, హార్టికల్చర్ యూనివర్సిటీ, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు తదితర హామీలు నీటి మూటలయ్యాయని అన్నారు. కాజీపేట్ ఫ్యాక్టరీ ని గుజరాత్ కు తరలించుకుపోయి తెలంగాణకు మొండిచేయి చూపితే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కనీసంఒక్క మాట కూడ మాట్లాడలేకపోయ్యారని తెలిపారు. అదేవిధంగా 10 ఏళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం విభజన హామీల అమలు కోసం కేంద్రంతో నిజాయితీగా పోరాడలేదని,లాలూచీ కుస్తీ నడిపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీద్, అనీల్, మోసిన్, పర్వేజ్, ఖాజా, ఇర్ఫాన్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## సిబిఐకి పట్టుబడిన ముగ్గురు పోస్టల్ అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఎంటిఎస్‌గాపదోన్నతి కల్పించేందుకు వారి నుంచి రూ.3 లక్షలు లంచం డబ్బులు తీసుకున్న ముగ్గురు పోస్టల్ శాఖ అధికారులను సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.ఆబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసులో అసిస్టెంట్ సూపరింటెండెంగ్ విధులు నిర్వహిస్తున్న రామంతాపూర్‌కు చెందిన సిహెచ్.మాధవి. అక్కడే విధులు అధికారులుగా విధులు నిర్వహిస్తున్న హబ్సిగూడకు చెందిన సిహెచ్.సురేందర్‌కుమార్, బేగంబజార్‌కు చెందిన బి.టి.సింగ్‌లు తమ శాఖలో తాత్కాలికంగా పనిచేస్తున్న 18 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు రూ.18 లక్షల లంచం అడిగారు. ఈ క్రమంలోనే బాధిత ఉద్యోగులు వారికి రూ.2లక్షలు అందించారు. మిగతా డబ్బులు కూడా ఇవ్వాలని పై ముగ్గురు అధికారులు ఒత్తిడిచేయడంతో బాధితులు కలీముద్దీన్, జనార్ధన్‌లు సిబిఐలోని అవినీతి నరోధక విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు.లంచం అడిగిన అధికారుల ఫోన్ కాల్స్ రికార్డులకు కూడా సిబిఐ అధికారులకు అందించారు.ఈ క్రమంలోనే పై ముగ్గురు అధికారులకు ఈ నెల 8న మిగిలిన లంచం డబ్బులు ఇస్తుండగా సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారి కార్యాలయాలతో పాటు వారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించారు. కేసు నమోదు చేసిన ఈ ముగ్గురు అధికారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఓటర్లు పిల్లలతో ఓటింగ్‌కు రావొద్దు

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటు వేసేందుకు వచ్చే వారు చిన్న పిల్లలను తీసుకొని రావొద్దని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఓటర్లకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలలో 15 డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని తెలిపారు. టూరిజం ప్లాజాలో శుక్రవారం పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు, పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు అత్యంత కీలకమైన నిశ్శబ్దకాలానికి సబంధించిన నిబంధనలపై నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్, హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి దురిశెట్టి అనుదీప్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సిఈఓ మధుకర్ నాయక్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ జిల్లాలో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మ్యాన్ పవర్, మెటీరియల్ వంద శాతం పూర్తయిందని, ఈవిఎం కమిషనింగ్ పూర్తయిందని, పోలింగ్‌కు ముందు జరగాల్సిన ప్రక్రియ అంతా సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 3986 పోలింగ్ కేంద్రాలలలో వంద శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, 1250 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. క్రిటికల్, పోలింగ్ కేంద్రాల బయట కూడా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు 14,292 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 362 మంది, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 119 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. అత్యవసర సేవల ఓటర్లు 7 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో సి విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 339 ఫిర్యాదులు రాగా, అన్ని ఫిర్యాదులను పరిష్కరించామని, ఆయా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో మరింత నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ సిబ్బంది కోసం మే 12, 13వ తేదీలలో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, అందుకోసం జిల్లాలో సుమారు 37 కేంద్రాలను గుర్తించామని రోనాల్డ్ రోస్ వివరించారు. పోలింగ్ ముందు ఆ పాయింట్‌ల నుండి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వరకు పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ సంబంధించిన సమగ్రి అందజేసిన తర్వాత రిసెప్షన్ సెంటర్ నుండి తిరిగి గుర్తించిన పాయింట్ వద్ద ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా ఇప్పటివరకు 311 మంది ఫ్రీ పికప్, ఓటు వేసిన తర్వాత తిరిగి డ్రాప్ చేయాలని అభ్యర్థన పెట్టారని, వారందరికీ ఆ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వారికి పోలింగ్ కేంద్రం వద్ద సరిపోనూ వీల్ చైర్ ఏర్పాటు చేశామన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ అయిన మే11 సాయంత్రం ఆరు గంటల నుండి జిల్లాలో జిల్లా యేతర వ్యక్తులు, ఇతర నియోజకవర్గం వారు ఈ నియోజకవర్గంలో ఎవరూ ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అప్రమత్తతో క్షేత్ర స్థాయిలో పని చేస్తారని, కళ్యాణ మండపాలు, హోటల్లు, లాడ్జిలను తనిఖీ చేస్తారన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ఒక రోజు ముందు అనగా ఈ నెల 12, 13వ తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదన్నారు.

## మా పార్టీ కూడా తప్పులు చేసింది

### భవిష్యత్తులో రాజకీయాలు మార్చుకుంటాం

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ

**లక్నో:** తమ పార్టీ కూడా తప్పులు చేసిందని, భవిష్యత్తులో తమ రాజకీయాలను మార్చుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. లక్నోలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీని చక్రవర్తితో పోల్చారు. ‘మోదీ ప్రధాన మంత్రి కాదు.. చక్రవర్తి. ఇద్దరు పెట్టుబడిదారుల కోసం ఒక ఏర్పడిన ఒక ఫ్రంట్’ అంటూ ధ్వజమెత్తారు. రాజ్యాంగంపై జరిగిన ఒక సదస్సులో ప్రేక్షకులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, మోదీతో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, అయితే, ఆయన అంగీకరించరనే విషయం తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. ఒక ప్రశ్నపై స్పందిస్తూ, కాంగ్రెస్ కూడా కొన్ని పొరపాట్లు చేసిందని అన్నారు. అందుకే, రాబోయే కాలంలో తమ రాజకీయాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. పార్టీకి విధేయుడిగా ఉంటూనే తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని అన్నారు. అయితే, కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పు అవసరమనే విషయంపై ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో అధికార బిజెపికి180 కంటే ఎక్కువ సీట్లు రావని రాహుల్ జోస్యం చెప్పారు. మోదీ మరోసారి ప్రధాని కాలేరని తాను లిఖితపూర్వకంగా రాసి ఇవ్వగలనని అన్నారు. అనంతరం సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉమ్మడి ర్యాలీలో పాల్గొన్న ఆయన మరోసారి ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ‘రాజకీయాల్లో కొందరు అధికారం ఎలా పొందాలని మాత్రమే ఆలోచిస్తారు. నేను రాజకీయాల్లోనే పుట్టాను. దానిపై ఆసక్తి లేదు. కానీ నాకు ఇది ప్రజలకు సహాయపడే సాధనం‘ అని ఆయన అన్నారు. దేశ జనభాలో 90 శాతంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలు, పేదలకు సమాన భాగస్వామ్యం లభించడం లేదని రాహుల్ అన్నారు. కులప్రాతిపదికన జనాభా గణనను జరిపిస్తామని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ‘దేశం బలపడాలంటే 90 శాతం మందిని కలుపుకొని తారాలి. లేకపోతే అభివృద్ధి కుదరదు.. 90 శాతం మంది బ్యూరోక్రసీ, స్పోర్ట్స్, మీడియా, న్యాయవ్యవస్థ, అందాల పోటీల్లోకి కూడా రారని పది శాతం మంది అనుకుంటారు. అయితే, ఈ కొద్ది శాతం మందే దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చగలుగుతారా?’ అన్నారు. రాజ్యాంగంపై ప్రధాని దాడి చేస్తున్నారని విమర్శించారు. మోదీ ఒక రాజులా వ్యవహరిస్తున్నారని, కెబినెట్‌తోగానీ, పార్లమెంటుతోగానీ, రాజ్యాంగంతోగానీ ఆయనకు ఎలాంటి సంబంధం లేదని ఎద్దేవా చేశారు. అంశం ఏదైనాసరే తాను ప్రధానితో చర్చకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కానీ, ప్రదానికే తనతో చర్చించడం ఇష్టం లేదని అన్నారు.